



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 1 జనవరి 2026 | సంపుటి: 9 | సంచిక: 363 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




## రేవంత్ శుభాకాంక్షలు

### కొత్త సంవత్సరంలో ప్రతీ కుటుంబం ఆశించిన లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్ష

**హైదరాబాద్, డిసెంబర్ 31 (మనం బ్యూరో):** రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో పాటు మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు,

...మిగతా 2లో

### దృశ్య రూపంలో మనం

## త్వరలో యూట్యూబ్ ఛానల్

ఈ పదేళ్ల మా సుదీర్ఘ ప్రయాణంలో మరెవ్వరికీ సాధ్యం కాని రీతిలో మేం పాఠకుల అభిమానాన్ని సంపాదించాం.. అందుకు చెక్కుచెదరని మా మనం సైన్యం (మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న మా జర్నలిస్టులు) ప్రధాన కారణం.. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేవలం విలువలకు కట్టుబడే మా ప్రయాణాన్ని కొనసాగించాం. ఇకపై కూడా ఇదే రీతిలో మా ప్రయాణం ఉంటుందని చెప్పేందుకు ఒకింత గర్వపడుతున్నాం..ఈ దశాబ్ద కాలంలో న్యూస్ పేపర్ రూపంలో మీ మదిలో చెరగని ముద్ర వేసిన మనం ఇక దృశ్యంలోకి కూడా అడుగు పెట్టబోతోంది.. ఈ సంక్రాంతి పర్వదినం తర్వాత యూట్యూబ్ ఛానల్ తో మిమ్మల్ని పలకరించేందుకు సిద్ధమవుతోంది.. ఏ నినాదంతో పత్రికను ప్రారంభించామో అదే నినాదం జనం కోసం అక్షర యజ్ఞం యూట్యూబ్ ఛానల్ రూపంలోనూ కొనసాగుతుంది.. ఈ నూతన సంవత్సరం వేళ మీ అందరితో ఈ సంతోషకరమైన వార్తను పంచుకోవడం మాకెంతో ఆనందంగా ఉంది.. మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- మేనేజ్‌మెంట్

# ఫిబ్రవరిలో పుర పోరు!

## గత ఏడాది జనవరిలోనే ముగిసిన గడువు

## అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన

### రాష్ట్రంలో జీహెచ్ఎంసితో కలిపి 8 కార్పొరేషన్లు, 125 మున్సిపాలిటీలు

### పరీక్షల సీజన్ ప్రారంభం లోపే ఎన్నికలు నిర్వహించే యత్నంలో ప్రభుత్వం

### ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానున్న ఓటరు జాబితా



**హైదరాబాద్, డిసెంబర్ 31, మనం బ్యూరో:** పంచాయతీ ఎన్నికల ఫలితాలతో ఉత్సాహంతో ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ అదే ఊపుతో పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. విద్యార్థుల పరీక్షలు ముగిసే లోపే అంటే మార్చి లోపే ఫిబ్రవరి రెండో వారం నాటికి ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జనవరి మూడో వారం లోగానే అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సూచించినట్లు తెలిసింది. దీంతో కమిషన్ అధికారులు ఇప్పటికే సంబంధిత ఏర్పాట్లు ప్రారంభించారు. రాష్ట్రంలో 120 మున్సిపాలిటీలు 9 కార్పొరేషన్లకు గత ఏడాది జనవరిలోనే గడువు ముగిసింది. అప్పటి నుంచి అవి ప్రత్యేకాధికారుల

...మిగతా 2లో

### ఫిబ్రవరిలోనే మహా జీహెచ్ఎంసీ ఎన్నికలు?

**హైదరాబాద్, డిసెంబర్ 31 (మనం బ్యూరో):** మహా జీహెచ్ఎంసీ ఎన్నికలను సైతం ఫిబ్రవరిలోనే నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇదే నెలలో జీహెచ్ఎంసీ పాలక మండలి గడువు ముగియనుంది. ఇప్పటికే గతంలో జీహెచ్ఎంసీలో ఉన్న 150 డివిజన్లను

...మిగతా 2లో

### ఉద్యోగులకు కొత్త సంవత్సర కానుక

## రూ.713 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల




**హైదరాబాద్, డిసెంబర్ 31 (మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.713 కోట్లు బుధవారం విడుదలయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతీ నెలా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది.ఈ నేపథ్యంలో డిప్యూటీ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈనెల నిధులను విడుదల

...మిగతా 2లో

### భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణలో

## ఎవరి జోక్యమూ లేదు

### భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ



**ఢిల్లీ, డిసెంబర్ 31:** ఈ సంవత్సరం భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన ప్రకటనను భారత విదేశాంగ శాఖ ఖండించింది. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ విషయంలో ఎవరి జోక్యం లేదని స్పష్టం చేసింది. ఇది రెండు దేశాల సైనిక డీజీఎంవోలు చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, ఇందులో మూడో పక్షం పాత్ర లేదని

...మిగతా 2లో

## లేబర్ కోడ్స్ డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫై చేసిన కేంద్రం

**ఢిల్లీ, డిసెంబర్ 31:** కార్మిక చట్టాల స్థానే ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లకు సబంధించి డ్రాఫ్ట్ రూల్స్‌ను కేంద్రం నోటిఫై చేసింది. వేతనాలు; సామాజిక భద్రత; పారిశ్రామిక సంబంధాలు; వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన కోడ్ల ముసాయిదా నిబంధనలపై అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. 2026 ఏప్రిల్ 1 నుంచి వీటిని దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చే ఉద్దేశంతో డ్రాఫ్ట్ రూల్స్ను ప్రచురించింది.

## యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ@1000

YOUNG INDIA SKILLS UNIVERSITY TELANGANA

**హైదరాబాద్, డిసెంబర్ 31:** యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కీలక మైలురాయిని చేరింది. స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరింది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యం అందించే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి గతేడాది ఆగస్టు 1న శంకుస్థాపన జరిగింది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో యూనివర్సిటీ నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాన్సలర్‌గా, విశ్రాంత ఐఏఎస్ అధికారి సుబ్బారావు వీసీగా ఉండగా.. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. బోర్డుకు పారిశ్రామిక

...మిగతా 2లో

## 968 టీఎంసీల గోదావరి నీటిని రాబట్టుకుంటం

### రాష్ట్ర జల హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనైనా కాపాడుకుంటం

### సుప్రీం కోర్టు కేసుతో ఏపీ ముందుకు పోకుండా అడ్డుకుంటం

### ప్రతిపక్షాల అనవసరం రాద్ధాంతం • మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 31 (మనం బ్యూరో):** గోదావరిలో రాష్ట్రానికి కేటాయించిన 968 టీఎంసీల నీటి హక్కులను కాపాడుకోవడమే ప్రభుత్వం ముందున్న లక్ష్యమని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వేగవంతంగా తీసుకుంటున్న నిర్ణయాలతోనే ఈ ఏడాది ఈ ఏపీ ప్రతిపాదనను తిరస్కరించిందన్నారు. గోదావరి లోని అదనపు వరద నీరు ఇప్పటికీ పంచుకోలేదనీ, ఎలాంటి మళ్లింపునైనా రాష్ట్రాల మధ్య సంప్రదింపులతోనే జరగాలని పేర్కొన్నారు. తెలంగాణ నీటి హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి

...మిగతా 2లో

## యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

### రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలున్నయ్

### రబీకి అవసరమైన 10.40 లక్షల టన్నుల్లో ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రబీ

...మిగతా 2లో

## అవినీతిలో రెవెన్యూ ఫస్ట్

### వ్యవ‘సాయం’లో చేతివాటం

2025లో 199 ఏసీబీ కేసులు నమోదు

273 మంది అవినీతి పరుల అరెస్ట్

ఆదాయానికి మించి ఆస్తులపై 15 కేసులు

వార్షిక నివేదిక విడుదల చేసిన ఏసీబీ డీజీ చారుసిన్హా



2

## గణతంత్ర వేడుకల్లో మన డప్పు దరువుకు చోటు

### అందె భాస్కర్ బృందానికి మూడోసారి దక్కిన గౌరవం

**హైదరాబాద్, డిసెంబర్ 31:** తెలంగాణ మట్టి కళారూపమైన ‘డప్పు’ మరోసారి దేశ రాజధానిలో మారుమోగనుంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందే గ్రామానికి చెందిన ప్రముఖ డప్పు కళాకారుడు, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార గ్రహీత అందే (అంగడి) భాస్కర్ బృందానికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్ లో ప్రదర్శన ఇచ్చేందుకు ఈ బృందానికి వరసగా మూడోసారి ఆహ్వానం అందింది.

దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన అత్యుత్తమ కళారూపాల మధ్య, తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించి తమ ప్రతిభను చాటనున్నారు.

**హర్షం వ్యక్తం చేసిన భాస్కర్..**

వరసగా మూడో ఏడాది కూడా జాతీయ వేదికపై ప్రదర్శనకు అవకాశం దక్కడంపై అందె భాస్కర్ ఆనందం వ్యక్తం చేశారు. తమ కళను గుర్తించి ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆహ్వానంతో సిద్దిపేట జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర ఖ్యాతి జాతీయ స్థాయిలో మరోసారి వెలుగులోకి వచ్చినట్లు అయిందని అన్నారు.

## పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ దాడి



### ఉగ్రదాడిగా పేర్కొన్న రష్యా

### అవాస్తవమన్న కీవ్ ప్రభుత్వం

### ఇది ఆందోళనకరమన్న ప్రధాని మోడీ

**మాస్కో, డిసెంబర్ 31:** రష్యా అధ్యక్షుడు పుతిన్ అధికార నివాసంపై దాడి జరిగింది. 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించిందని రష్యా విదేశాంగశాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఆ దృశ్యాలు విడుదలయ్యాయి. రష్యా రక్షణశాఖ వాటిని బయటపెట్టింది. ఈ వీడియో ప్రారంభంలో కూలిన డ్రోన్

...మిగతా 2లో

### ఉక్రెయిన్లో బఫర్ జోన్ విస్తరణకు పుతిన్ ఆదేశాలు

రష్యా జనరల్ వాలేరి గెరసిమోవ్

9

## కిరిబాటిలో తొలి న్యూ ఇయర్ వేడుకలు



కొత్త ఏడాదికి ప్రప్రథమంగా వేడుకలతో స్వాగతం పలికిన రికార్డు దక్కించుకుంది ఆ చిన్ని దేశమే. దాని పేరే.. కిరిబాటి. పసిఫిక్ మహా సముద్రంలో దేశం హోదా పొందిన ద్వీపమైన ఇది క్రిస్మస్ ఐలాండ్‌గా పేరు పొందింది. ఈ ద్వీప ప్రాంతంపై ప్రతిరోజూ తొలి సూర్య కిరణాలు ప్రసరిస్తుంటాయి. అందుకని, అక్కడ నూతన సంవత్సర వేడుకలు అందరికన్నా ముందే జరుగుతాయి. మన దేశంలో దాదాపు 7.30 గంటల తర్వాత కొత్త ఏడాది ఆగమనం జరుగుతుంది.

### పోస్టల్ డిపార్ట్‌మెంట్

## మూసివేత

**కోపెన్ హాగన్(డెన్మార్క్), డిసెంబర్ 31:** డెన్మార్క్ ప్రభుత్వం.. దాని 400 సంవత్సరాల నుంచి కొనసాగిస్తున్నదేశంలోని పోస్టల్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రజలు డిజిటల్ కమ్యూనికేషన్ వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దీనితో తపాలా సేవలను ముగించిన తొలి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ఈ ఏడాది ప్రారంభం నుంచే దేశంలోని రెడ్ మెయిల్ బాక్సులను ప్రభుత్వం తొలగిస్తూ వస్తోంది. జూన్ నుంచి ఇప్పటివరకు దాదాపు 1,500 మెయిల్ బాక్సులను తొలగించింది. డిసెంబరులో వీటిని స్వచ్ఛంద సంస్థల కోసం విక్రయించింది. అయితే వీటిని డెన్మార్క్ ప్రజలు సైతం కొనుగోలుకు ఆసక్తి చూపించారు.

# పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఒకటి కనిపిస్తోంది. నోవ్గొరొడ్ ప్రాంతంలో పుతిన్ నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని రష్యా వెల్లడించింది. అయితే, దీన్ని ఉగ్రదాడిగా పేర్కొంది.

ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను అన్నింటినీ నిర్వీర్యం చేశామని, నివాసానికి ఎటువంటి నష్టం కలగలేదని క్రెమ్లిన్ పేర్కొంది. ఇది శాంతి చర్చలకు విఘాతం కలిగించే దాడి అని విదేశాంగశాఖ మంత్రి లవ్రోవ్ హెచ్చరించారు. అయితే ఈ వ్యాఖ్యలను ఉక్రెయిన్ ఖండించింది. ఇదంతా అవాస్తవమని చెప్పింది.

కాగా.. అధ్యక్షుడి నివాసాన్ని లక్ష్యంగా చేసుకున్నారనే నివేదికలు తీవ్ర ఆందోళన కలిగించాయని భారత ప్రధాని మోడీ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఘర్షణలకు ముగింపు పలకడం, శాంతి సాధనకు ప్రస్తుతం కొనసాగుతోన్న దౌత్య ప్రయత్నం అత్యంత ఆచరణీయ మార్గమని ఆయన ప్రకటించారు.

# ఫిబ్రవరిలో పుర పోరు!

(మొదటి పేజీ తరువాయి)

పాలనలో నడుస్తున్నాయి. అయితే, హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసింది. దీంతో పాటు కొత్తగా కొన్ని నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా, కొన్ని మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో జీహెచ్ఎంసితో కలిపి 8 కార్పొరేషన్లు, 125 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఫిబ్రవరితో గడువు ముగిసిపోనున్న జీహెచ్ఎంసితో కలిపి అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనీ, అది కూడా విద్యార్థుల పరీక్షల సీజన్ మొదలయ్యే లోగానే ముగించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అయితే, ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్లతో పాటు మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోని రెండు మున్సిపాలిటీల గడువు ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఉంది. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు జరుగనున్న మున్సిపాలిటీల్లో ఓటరు జాబితా సిద్ధం చేసే పనిని త్వరలో మొదలు పెట్టనుంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండేందుకు జనవరి రెండో వారం కల్లా ఓటర్ల జాబితా తయారీకి సన్నాహాలు చేస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో త్వరలో జరుగనున్న పురపాలక సంఘాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గత అక్టోబర్‌లో రూ.2780 కోట్లను విడుదల చేసింది. జీహెచ్ఎంసీ మినహా మిగతా అన్ని పట్టణ సంస్థలకు విడుదలైన ఈ నిధుల ద్వారా 2432 పనులు చేపట్టనున్నారు. ఇవే కాకుండా కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, శివార్లలోని గ్రామ పంచాయతీలను విలీనం చేసుకున్న మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు, కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లకు రూ.30 కోట్ల చొప్పున అదనంగా మంజూరు చేశారు. కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన రాష్ట్ర వాటా నిధులు రప్పించేందుకు కూడా అధికారులు కృషి చేస్తున్నారు. ఒకేసారి పెద్ద ఎత్తున నిధులు మంజూరు కావడంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. జనవరి చివరి నాటికి ఈ పనులన్నీ కొలిక్కి తేవాలని అధికారులు భావిస్తున్నారు.

## ఫిబ్రవరిలోనే మహా జీహెచ్ఎంసీ ఎన్నికలు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం 300కు పెంచింది. ముందుగా హైదరాబాద్ మహా నగర శివారు ప్రాంతాలను సమీపంలోని మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఆ తరువాత ఆ మున్సిపాలిటీలను సైతం జీహెచ్ఎంసిలో విలీనం చేసింది. దీంతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరితో పాటు కొత్తగా ఫ్యూచర్ సిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే, ఫిబ్రవరిలో పుర పోరుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం మహా జీహెచ్ఎంసి ఎన్నికలతో పాటే నిర్వహిస్తుందా? లేక విడిగా నిర్వహిస్తుందా అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మిగిలింది.

# యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)





సీజన్కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోలిస్తే, ఈ డిసెంబర్లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు.

ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఏ.పీ మరియు కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాపు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు.మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. యాప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

## భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణలో ఎవరి జోక్యమూ లేదు

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ఘాటించింది. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఇప్పటికే పలు సందర్భాల్లో తమ వైఖరిని స్పష్టం చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాది భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల సడలింపునకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ మంగళవారం ప్రకటించారు. ఉత్తర మయన్మార్ సంక్షోభం, ఇరాన్ అణు సమస్య, ఇజ్రాయెల్-పాలస్తీనా ఉద్రిక్తతల పరిష్కారానికీ తాము మధ్యవర్తిత్వం వహించామని చెప్పారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరిగిన కాల్పుల విరమణ అంగీకారం కుదిర్చారంటూ భారతీయ మూలాలున్న ట్రంప్ సహాయకుడు రికీ గిల్‌కు అమెరికా ప్రభుత్వం తాజాగా సత్కరించి, అవార్డు ప్రదానం చేయడం గమనార్హం.



## జానా రెడ్డికి సీఎం పరామర్శ

**హైదరాబాద్, డిసెంబర్ 31:** ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని ఆయన ఇంట్లో కలిసి పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

## 968 టీఎంసీల గోదావరి నీటిని రాబట్టుకుంటం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్‌కు ముందుగా అనుమతించిన 80 టీఎంసీల నీటిని మించి ఉమ్మడి జలాశయాలలో అధిక వినియోగంపై హక్కు కోసం ఏపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. అదనపు వాటాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదనీ, ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# సంఘాలది కపట నాటకం.. సర్కార్ ది స్నేహ హస్తం

- **పదేళ్లు నిద్రపోయిన సంఘాలే.. నేడు మొసలి కన్నీరు కారుస్తున్నాయి**
- **రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది జర్నలిస్టు ఫ్రెండ్లీ విధానం**
- **తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్పష్టీకరణ**

**హైదరాబాద్ (డిసెంబర్ 31):** 'ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అక్రిడిటేషన్ రగడకు కారణం ప్రభుత్వం కాదు.. దశాబ్దాలుగా వ్యవస్థను శాసిస్తున్న కొన్ని యూనియన్ల స్వార్థమే. గత బి. ఆర్. ఎస్. ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా పెదవి విప్పని, పాదం కదపని నాయకులు.. ఇప్పుడు చేస్తున్న ధర్నాలు కేవలం 'కపట నాటకాలు' మాత్రమే. కానీ రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం మాత్రం జర్నలిస్టుల పట్ల అత్యంత సానుకూలంగా ఉంది' అని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్పష్టం చేసింది. మంగళవారం సమాచార శాఖ కమిషనర్ను కలిసిన అనంతరం టి.ఎస్.జే.యు. నాయకులు మాట్లాడుతూ, సంఘాల మోసాన్ని నమ్మొద్దు: 'గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టు నిధులు పక్కదారి పడుతున్నా, ఇన్సూరెన్స్ ఆగిపోయినా చోద్యం చూసిన కొన్ని సంఘాలు.. ఇప్పుడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయి. జీవో రూపకల్పనలో లోపాలకు కారణం ఆ సంఘాల తప్పుడు సలహాలే.జర్నలిస్టులు ఈ మోసాన్ని గమనించాలి' అని టి.ఎస్.జే.యు.హెచ్చరించింది.

**ప్రభుత్వం సానుకూలం–**
**కమిషనర్ భరోసా..**

'జర్నలిస్టుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందన చాలా సానుకూలంగా ఉంది. అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్ది అందరికీ న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు' అని తెలిపారు.

**చర్చల్లోని ముఖ్యాంశాలు..**

ఇన్సూరెన్స్ పక్కా: జర్నలిస్టుల కుటుంబాలకు రక్షణగా నిలిచే 'గ్రూప్ ఇన్సూరెన్స్' పథకాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, త్వరలోనే దీనిపై నిర్ణయం వెలువడుతుందని తెలిపారు. డెస్క్ జర్నలిస్టులకు గుర్తింపు: క్షేత్రస్థాయి జర్నలిస్టులతో సమానంగా డెస్క్ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వ పథకాలు, అక్రిడిటేషన్ వర్తింపజేసేలా జీవోలో మార్పులు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.



**చిన్న పత్రికలకు న్యాయం:**

గతంలో మాదిరిగా కాకుండా, చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ ప్రక్రియను సరళతరం చేసి, వాటికి అండగా ఉంటామని ప్రభుత్వం చెప్పినట్లు వెల్లడించారు.

**ప్రజా ప్రభుత్వంపై నమ్మకం ఉంది:**

కొన్ని సంఘాలు చేస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని, రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం జర్నలిస్టుల పక్షపాతని.. త్వరలోనే అన్ని సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుందని టి.ఎస్.జే.యు. ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో టి.ఎస్.జే.యు. రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగొని , ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల, ఆర్గ నైజింగ్ సెక్రటరీ క్రాంతి తదితరులు  తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడులక వేళ జపాన్‌లో విషాదం

**టోక్యో, డిసెంబర్ 31:** జపాన్లో భూకంపం సంభవించింది. తూర్పు నోడా ప్రాంతంలోని తీరంలో భూమి కంపించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.0గా నమోదైందని, 19.3 కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సమయంలోనే భూమి కంపించడం అక్కడి వారిని కలవరపాటుకు గురిచేసింది. ఈ నెల 8వ తేదీన జపాన్ తూర్పు తీరంలో 7.5 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేయగా.. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనంతరం 12వ తేదీన 6.7 తీవ్రతతో మరోసారి భూమి కంపించింది.

## రేవంత్ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని గుర్తు చేశారు. నేటి నుంచి ప్రారంభం కానున్న కొత్త సంవత్సరంలో ప్రతీ కుటుంబం తాము ఆశించిన ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ, ప్రజలంతా ఆనందంతో, ఆరోగ్యంతో ఉండాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ @ 1000

(మొదటి పేజీ తరువాయి)

దిగ్గజం ఆనంద్ మహీంద్రా ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న తాత్కాలిక క్యాంపస్ లో లాజిస్టిక్స్, హెల్త్కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లో స్వల్పకాలిక, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, ఏఐజీ, అపోలో ఆసుపత్రులు, జీఎంఆర్ కార్గో వంటి ప్రముఖ సంస్థలు యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యాయి.

# అవినీతిలో రెవెన్యూ ఫస్ట్

**హైదరాబాద్,డిసెంబర్ 31(మనం, ప్రత్యేకప్రతినిధి):** సర్కారు ఉద్యోగాలు వెలగబెడుతూ నెలకు లక్షలాది రూపాయలు వేతనాలు అందుకుంటూ లంచాలకు అర్రులు చాస్తున్న అవినీతి పరులను ఏసీబీ అధికారులు వెంటాడుతున్నారు. లంచాలు అందనిదే ఫైళ్లను కదలనివ్వమని అడ్డదారుల్లో ఆర్జిస్తున్న అక్రమార్కుల అవినీతికి కళ్లెం వేస్తున్నారు. లంచాల మొత్తాల కోసం ఏజెంట్లను నియమించుకుని పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్న లంచావతారుల భరతం పడుతున్నారు. ఈ నేపథ్యంలో 2025లో రాష్ట్రవ్యాప్తంగా 273మంది అవినీతి పరులు లంచాలు మెక్కి ఏసీబీకి చిక్కి కటకటాలపాలయ్యారు. మరో 15మంది ప్రభుత్వ అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టి ఏసీబీకి పట్టుబడ్డారు. ఈక్రమంలో 2025 సంవత్సరంలో తెలంగాణ యాంటీ కరప్షన్ బ్యూరో 199 కేసులు నమోదు చేసి 273 మంది నిందితులను అరెస్ట్ సినట్లు ఏసీబీ డీజీ చారు సిన్హా వెల్లడించారు. ఈ మేరకు ఆమె బుధవారం 2025 ఏసీబీ వార్షిక నివేదికలను విడుదల చేశారు. రాష్ట్రంలో 157 ఏసీబీ ట్రాప్ కేసుల్లో 224 మంది అరెస్ట్ అయ్యారని వీరిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. అలాగే 15 అక్రమాస్తుల కేసుల్లో రూ.96.13 కోట్లు వెలికి తీశామని, 54 ఆకస్మిక తనిఖీలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్టీఏ చెక్ పోస్టులపై దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 115 మంది నిందితులపై కేసులు పెట్టేందుకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చిందని ఏసీబీ డీజీ చారు సిన్హా తెలిపారు.

**రెవెన్యూ ఫస్ట్ :**

తెలంగాణలో అవినీతి కేసులలో పట్టుబడిన నిందితులలో రెవెన్యూ శాఖకు చెందిన వారు ముందంజలో ఉన్నారు. వెరసి ప్రభుత్వ శాఖలలో అడ్డదారిలో రెవెన్యూ శాఖ అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ విభాగాల్లో అత్యధికంగా లంచం కేసులు వెలుగుచూశాయి. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది. కేవలం లంచం మాత్రమే కాకుండా.. అక్రమంగా కోట్లు కూడబెట్టిన 15 మంది పైగా ఉన్నతాధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి. వీరిలోనూ రెవెన్యూ శాఖకు చెందిన వారుండటం విచారకరం. ఆదాయానికి మించి ఆస్తుల కేసులలో నిందితుల నుంచి కేజీల కొద్దీ బంగారం, భారీగా నగదు, స్థిర ఆస్తులను ఏసీబీ సీజ్ చేసినట్లు తెలిపింది.

**కాల్..చేస్తే పట్టేస్తాం :**

రాష్ట్రంలో ఏసీబీ ట్రాప్ కేసుల్లో 2025లో రూ.57.17 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీజీ చారు సిన్హా తెలిపారు. ఆయా మొత్తాలలో బాధితులకు రూ.35.89 లక్షలు తిరిగి చెల్లించినట్లు పేర్కొన్నారు. ఇదిలావుండగా ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా ఆధ్వర్యంలో డిసెంబర్ 3 నుంచి 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అవినీతి అధికారులపై ఫిర్యాదుల కోసం క్యూర్ కోడ్ కంప్లైంట్ సిస్టమ్ ప్రారంభించామని దూర ప్రాంతాల ప్రజలకు సులభంగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించినట్లు వివరించారు. అవినీతిలో కొత్త దారులు తొక్కుతున్న అక్రమార్కులను ఏరివేసేందుకు ఏసీబీ సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా 73 మంది అధికారులకు ప్రాథమిక ఇండక్షన్ శిక్షణ అందించారని తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు కాల్ చేయాలని, వాట్సాప్ నెంబర్: 9440446106, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) ద్వారా కూడా ఫిర్యాదు అవకాశం ఉందన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీజీ చారు సిన్హా తెలిపారు. 2025లో అవినీతిలో రెవెన్యూ శాఖ తొలిస్థానంలో ఉండగా వ్యవసాయ, ఇరిగేషన్, పోలీస్ శాఖల్లోనే లంచం కేసులు ఎక్కువగా వెలుగుచూశాయని ఏసీబీ రికార్డులు చెబుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దాదాపు రూ. 58 కోట్ల విలువైన డాక్యుమెంట్లను సీజ్ చేశామని, వాటి విలువ బహిరంగ మార్కెట్ విలువ రూ. 1,000 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేశారు. అవినీతి పరుల సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేస్తే వారి భరతం పడతామని ఏసీబీ డీజీ చారు సిన్హా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ :**

రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం 2025లో నిర్వహించిన తనిఖీలలో గణనీయమైన విజయాలను నమోదు చేసిందని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ షికా గోయెల్ పేర్కొన్నారు. పన్ను ఎగవేతను గుర్తించడం, రాబడిని తిరిగి పొందడం మరియు అక్రమాలను నిరోధించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించిందన్నారు. ఈక్రమంలో 2025లో 292 కేసులకు సంబంధించి 480 విచారణలు జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. అలాగే రూ. 228.31 కోట్ల పన్ను ఎగవేతను గుర్తించి రూ.213.58 కోట్లను వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగిందన్నారు. వాహన తనిఖీలకు సంబంధించి 203 రూట్ చెక్‌ల ద్వారా 18,137 వాహనాలను తనిఖీ చేసి 3,994 కేసులు నమోదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఆయా కేసులకు సంబంధించి రూ. 12.51 కోట్ల జరిమాన, ట్యాక్స్‌లను వసూలు చేశామని వివరించారు. అలాగే పౌర సరఫరాల శాఖ పరిధిలోని రేషన్ షాపులకు సంబంధించి 451 తనిఖీలు నిర్వహించి 53 సెక్షన్ కింద దాదాపు 70 కేసులు నమోదు చేశామన్నారు. రాష్ట్రంలో అనుమతిలేని వాహనాలు, నిత్యవసర వస్తువుల కల్తీలపైనా దాడులు నిర్వహించి దాదాపు 100 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. రైతులను మోసగించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇందులో భాగంగా పత్తి, వరి విత్తనాల, యూరియా పంపిణీలోని అక్రమాలపై ఆకస్మిక తనికీలు చేపట్టామన్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించి సమాచారాన్ని 14432 టోల్-ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ షికా గోయెల్ విజ్ఞప్తి చేశారు.

**రైల్వేలో 2,607 కేసులు :**

సికింద్రాబాద్ రైల్వే పోలీస్ పరిధిలో ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గిందని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనాదీప్తి వెల్లడించారు. ఈక్రమంలో 2025 వార్షిక నివేదికను ఆమె బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది 2,607 కేసులు నమోదు చేశామని, అలాగే 500 మంది చిన్నారులను రక్షించామని తెలిపారు. కాగా 2025లో రైలు ప్రమాదాలలో 1,317 మంది చనిపోయారని, ఆత్మహత్యలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు.



## మహారాష్ట్ర డీజీపీగా 26/11 హీరో

**ముంబై, డిసెంబర్ 31:** మహారాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సదానంద్ దాతేను నియమిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత డీజీపీ రశ్మీ శుక్లా జనవరి 3న పదవీ విరమణ చేయనుండగా.. అదే రోజు దాతే బాధ్యతలు చేపట్టనున్నారు. 26/11 ముంబయి దాడుల్లో వీరోచిత పోరాటం చేసిన ఈ సీనియర్ ఐపీఎస్ రాష్ట్ర డీజీపీగా రెండేళ్లపాటు కొనసాగనున్నారు. 1990 బ్యాచ్కు చెందిన ఐపీఎస్ అధికారి సదానంద్ దాతే.. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్గా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన మహారాష్ట్ర ప్రభుత్వం.. ఆయన్ను రాష్ట్ర కేడర్కు బదిలీ చేయించుకుందతి. నాటి 26/11 ముంబయి దాడుల్లో వీరోచిత పోరాటం చేసినందుకు గాను గతంలో దాతేను రాష్ట్రపతి పతకం వరించింది. మహారాష్ట్ర ఏటీఎస్ చీఫ్గా పనిచేసిన ఆయన.. సీబీఐ, సీఆర్పీఎఫ్లలోనూ పలు హోదాల్లో సేవలందించారు. పుణె విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

## రూ.713 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈమేరకు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, అడ్వాన్స్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో దాదాపు రూ.10 వేల కోట్లకు చేరాయి. దీంతో ఉద్యోగ సంఘాలు జూన్‌లో ఆందోళనకు సిద్ధపడటంతో ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని అదే నెలలో ప్రభుత్వం ప్రకటించింది.మొదటిసారి జూన్‌లో రూ.183 కోట్లు విడుదల చేసింది. ఆ తరవాత ఆగస్టు నుంచి రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది.



# ఎల్ఐసీ, గురు మందిరం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**చేవెళ్ల, డిసెంబర్ 31 (మనం న్యూస్):** చేవెళ్ల మండలం గొల్లగూడ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ సాందీప ఆచల ఋషి పరిపూర్ణ గురు మందిరం, ఎల్ . ఐ.సీ ఏజెంట్ నాగుల శంకర్ గురు ప్రసాద్ కు సంబంధించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను బుధవారం చేవెళ్ల ప్రెస్ క్లబ్, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు అత్తెల్లి అనంత్ రెడ్డి, ఎల్ . ఐ.సీ ఏజెంట్ శంకర్ గురు ప్రసాద్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి జీవిత బీమా, ఆరోగ్య బీమా కలిగి ఉండాలని తెలిపారు. ఆరోగ్య భీమా లేకపోవడం వల్ల కార్పొరేట్ ఆస్పత్రుల్లో వేలకు వేలు ఖర్చవుతాయని, ఆరోగ్య బీమా ఉండడం వల్ల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండవచ్చని తెలిపారు.

ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఆరోగ్య భీమా జీవిత బీమా తీసుకోవాలని సూచించారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్ఐసి క్యాలెండర్ ఆవిష్కరించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని శంకర్ గురు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గోపాల్, రాకేష్, మధు, చంద్రశేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, రమేష్, యాదయ్య, ఆనంద్, ప్రవీణ్, సత్యం, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌండ్ల యాదయ్య, కృష్ణయ్య, నాయకులు అశోక్, గణేష్, చంద్రశేఖర్ రెడ్డి, జయసింహ రెడ్డి, బల్ల ఆంజనేయులు గౌడ్, శ్రీకాంత్, సురేందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి,రాఘవేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.



లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి 100 మంది బీదవారికి చీరలు పంచడం జరిగింది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.
(రంగారెడ్డి మనం న్యూస్)

# తుర్కయంజాల్ సర్కిల్ ను ఎల్బీనగర్ జోన్‌లో కలిపి నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలి



- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి అఖిలపక్ష నాయకులు వినతి పత్రం అందజేత

**తుర్కయంజాల్ డిసెంబర్ 31( మనం న్యూస్):** తుర్కయంజాల్ మున్సిపాలిటిని సర్కిల్ గా ఏర్పాటు చేయాలని, మరియు తుర్కయంజాల్ మున్సిపాలిటీ మొత్తాన్ని ఎల్బీనగర్ జోన్ లో కలిపి నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి కి అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం తొర్రూర్ క్యాంప్ ఆఫీసులో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, టిపిసిసి సభ్యులు మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధనరాజ్ గౌడ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ కోసికె ఐలయ్య, సీనియర్ నాయకులు మేతరి దర్శన్, గుండ ధనరాజ్, మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు నరసింహారెడ్డి, బచ్చిగళ్ళ రమేష్, వధిగళ్ల బాబు, సురేష్, బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్, గుండ్ల అర్జున్, అఖిలపక్ష నాయకులు. పాల్గొన్నారు.

# బీసీ బిల్లుపై స్పందించండి

- 'సుప్రీం'లో పిటిషన్ వేయాలి
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,డిసెంబర్ 31(మనం, ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రపతి వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు పెండింగ్‌లో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సూచించారు. తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు సంవత్సరం కాలంగా రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటంపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో బుధవారం కవిత జాతీయ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఈ తరుణంలో తెలంగాణలోని 52 శాతం బీసీ జనాభా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బిల్లు ఆమోదం పొందేలా చూడాలని, ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఏడాది కాలంగా బిల్లు పెండింగ్‌లో ఉండటం బీసీల హక్కులకు భంగం కలిగించడమేనని, ఈ విషయంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా న్యాయపోరాటం చేయాలని కవిత నొక్కి చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు ముందే రిజర్వేషన్ల ప్రక్రియను స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.



# 'కరోన' కరెన్సీ కురిపించింది

- కోవిడ్‌లోనే ఐబొమ్మకు ఆదరింపు
- మూడేళ్లలో రూ.13 కోట్లు ఆర్జన
- ఐ బొమ్మ రవి కేసులో కీలక అంశాలు

**హైదరాబాద్,డిసెంబర్ 31 (మనం, ప్రత్యేక ప్రతినిధి):** కరోన కష్టకాలంలో తనకు మాత్రం కాసుల వర్షం కురిసిందని ఐబొమ్మ కేసులో నిందితుడు రవి పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఈక్రమంలో ఐబొమ్మ రవి పైరసీ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు కీలక విషయాలను ప్రస్తావించారు. ముఖ్యంగా కరోన కాలంలో పైరసీతో రూ. 13 కోట్ల 40 లక్షలు వచ్చాయని రవి పోలీసుల కస్టడీ విచారణలో ఒప్పుకున్నాడు. నిందితుడు రవికి ఉన్న 7 బ్యాంకు ఖాతాల్లో ఈ మొత్తం సొమ్ము డిపాజిట్ అయ్యిందని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాడ్స్ ద్వారా ఒకసారి ఏకంగా ఒక కోటి 78 లక్షలు ఆర్జించినట్లు తేలింది. అయితే ట్యాక్స్ ఇబ్బందులు రాకూడదని తన సోదరి చంద్రికకు రూ. 90 లక్షలు పంపాడని, అలాగే లావాదేవీలు మొత్తాన్నీ విదేశీ కరెన్సీ రూపంలోనే చేశాడని పోలీసులు గుర్తించారు. సినిమాల పైరసీ చేసేందుకు రవి కొంతకాలం పాటు కూకట్‌పల్లిలోని ఉషా ముళ్లపూడి దగ్గరలో ఒక ఆఫీస్ నిర్వహించాడని, పది మంది సిబ్బందిని నియమించుకుని పైరసీ చేయించాడని పోలీసులు వివరించారు. ఈ నేపథ్యంలో ఓ విదేశీయుడి ద్వారా ట్రేడ్ మార్క్ లైసెన్స్ పొందిన రవి రెండురకాలుగా సినిమాకు కొనుగోలు చేశాడని పోలీసుల కస్టడీ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. లావాదేవీలన్నీ డాలర్ల రూపంలోనే చేశాడని, ఆన్‌లైన్ బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఇక ఒక్కో సినిమాకు క్యామ్ కార్డర్ ప్రింట్‌కు 100 డాలర్ల నుంచి 200 డాలర్లను రవి చెల్లించాడని పోలీసులు అంటున్నారు. కోవిడ్ కాలంలోనే ఆన్‌లైన్‌లో సినిమాలు చూసే వారి సంఖ్య పెరగడంతో తన పైరసీ బిజినెస్ మెరుగుపడిందని రవి పోలీసులకు వివరించాడు. అయితే.. పైరసీ, బెట్టింగ్ విషయాలను పక్కదారి పట్టించేందుకు రవి ప్రయత్నించి దొరికిపోయినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

# అన్వేష్‌ను దేశద్రోహిగా ప్రకటించాలి

- పంజాగుట్టలో నటి కరాటే కళ్యాణి ఫిర్యాదు
- ఖమ్మంలోనూ మరోకేసు నమోదు



**హైదరాబాద్,డిసెంబర్ 31(మనం,ప్రత్యేకప్రతినిధి) :** హిందూ దేవతలను దూషించిన అన్వేష్ పై దేశద్రోహం కేసు నమోదు చేయడంతో పాటు దేశద్రోహిగా ప్రకటించాలని సినీనటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి డిమాండ్ చేశారు. ఈక్రమంలో హిందూ,ముస్లింల మధ్య గొడవలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన అన్వేష్‌పై ఆమె పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. దీంతో పంజాగుట్ట పోలీసులు అన్వేష్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనతికాలంలో అన్వేష్ కి నోటీసులు జారీ చేయనున్నామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా కరాటే కల్యాణి కీలక వ్యాఖ్యలు చేశారు. అన్వేష్ ను అన్ సబ్ స్క్రైబ్ చేయాలని, .హిందూ, ముస్లిం గొడవలను అతడు రెచ్చగొడుతున్నాడని మండిపడ్డారు. ఇంత నీచంగా మాట్లాడుతున్న అన్వేష్ కు 2.5 మిలియన్ సబ్ స్క్రైబర్స్ ఇచ్చింది మనమేనని, అన్వేష్ కు వస్తున్న ప్రతి రూపాయి మన దేశం నుంచి, ముఖ్యంగా తెలుగు వారి నుంచే వస్తోందన్నారు. కాబట్టి వెంటనే అతడి ఛానల్ ను అన్ సబ్‌స్క్రైబ్ చేయాలన్నారు. కాగా అన్వేష్‌పై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. అతడిని భారత్ కు రప్పించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అతడిని దేశద్రోహిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయని కళ్యాని తెలిపారు. ఇదిలావుండగా అన్వేష్‌పై ఖమ్మంలోని ఖానాపురంహవేలి ఠాణాలోనూ ఇప్పటికే కేసు నమోదైంది. విశాఖపట్టణానికి చెందిన అన్వేష్ విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా ఇటీవల అతడు వీడియో విడుదల చేశాడు. దానవాయిగూడేనికి చెందిన జి.సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసు అధికారి వివరించారు.

# తుర్కయంజల్ ప్రజలకు తీరని అన్యాయం

**మున్సిపాలిటీని సర్కిల్ గా ప్రకటించి, నాలుగు డివిజనల్ గా విభజించాలి**

**బిఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు పైసల్ ఆలీ డిమాండ్**



**తుర్కయంజాల్ డిసెంబర్ 31 (మనం న్యూస్):** పూర్వ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ని సర్కిల్ గా ప్రకటించడంతో పాటుగా నాలుగు డివిజన్ నులుగా విభజించాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ఫైసల్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం తుర్కయంజాల్ డివిజన్ లోని అయన కార్యాలయంలో మాట్లాడుతూ, సుమారు లక్ష ఓటర్లు ఉన్న తుర్కయంజాల్ ను సర్కిల్ గా ప్రకటించకుండా ప్రభుత్వం తుర్కయంజాల్ ప్రజలకు తీరని అన్యాయం చేసింది. శాస్త్రీయ బద్దంగా విభజన చేస్తే తుర్కయంజాల్ సర్కిల్ గా అవుతుంది. ప్రభుత్వం వెంటనే తుర్కయంజాల్ ను సర్కిల్ గా ప్రకటించడంతో పాటుగా నాలుగు డివిజన్ లుగా విభజించాలని అయన కోరారు. ఇప్పటికే ఈ ప్రాంతం నుంచి సుమారు 1200లకు పైగా అభ్యంతరాలు ఇచ్చిన ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం దారుణం అన్నారు. ప్రజల అభిష్టం మేరకు తుర్కయంజాల్ ను సర్కిల్ గా ప్రకటించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన తెలిపారు.

# తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా సుందర్ కల్లూరి



**రంగారెడ్డి డిసెంబర్ 31 (మనం న్యూస్)** జర్నలిస్టుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గా సుందర్ కల్లూరి అల్టిమేటం జారీ చేశారు.. ఈనేపథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత పిఆర్వోగా రెండు ప్రభుత్వాలలో పనిచేసిన అనుభవం ఉన్నటువంటి సుందర్ కల్లూరిని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వరరావు నియమించడం జరిగింది.. ఈ సందర్భంగా సుందర్ కల్లూరి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికై ఆవిర్భవించినటువంటి తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘనికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గా నియమించినటువంటి గౌరవ అధ్యక్షులు ఆనం చిన్ని వెంకటేశ్వరరావుకి మరియు తోటి కార్యవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.. జర్నలిస్టుల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో ముందుంటానని అలాగే జర్నలిస్టుల సంక్షేమానికై అహర్నిశలు కష్టపడతానని, తనకు అప్పగించినటువంటి బాధ్యతకు న్యాయం చేస్తానని తెలియజేశారు..

# మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్.**



**చేవెళ్ల, డిసెంబర్ 31 (మనం న్యూస్):** మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం 40 ఎమ్ ఎల్ డి వద్ద మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఎన్. సి. సి, కే. ఎస్ ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యాలు సకాలంలో మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎన్.సీ.సీ, కె ఎస్ ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యాల లేబర్ లైసెన్సులు రద్దు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతారం నీటి శుద్ధి కేంద్రంలో 28 మందికి గాను కేవలం 15 మందితో పనులు చేయిస్తున్నారని వారిపై అధిక పని భారం పడిందని అన్నారు కార్మికులకు జీతాలు చెల్లించని పక్షంలో ఆందోళన పోరాటాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో

# బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు శివ ప్రకాష్ ప్రత్యేక పూజలు.



**రంగారెడ్డి డిసెంబర్ 31 (మనం న్యూస్)** వైకుంఠ ఏకాదశి సందర్భంగా చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని గోసగుండ్ల శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు శివ ప్రకాష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శివ ప్రకాష్ మాట్లాడుతూ స్వామివారి దీవెనలతో కాలనీవాసులు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలియజేశారు. ఫణిగిరి కాలనీ అధ్యక్షుడు అజయ్, ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి.. శివ ప్రకాష్ ను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, తోట శ్రీను, స్వామి,శ్రీను స్వామి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు రవి యాదవ్, కళ్యాణ్, ప్రవీణ్ కుమార్, గణేష్, గానీ, హరీష్, మహేష్, అసిఫ్, వల్లీ, రిషి గౌడ్ ఉన్నారు.

# ప్రజలు ఆర్టిఏ సేవలు వినియోగించుకోవాలి



**రంగారెడ్డి డిసెంబర్ 31 (మనం న్యూస్)** మలక్ పేటలోని హైదరాబాద్ తూర్పు జోన్ ఆర్టిఏ కార్యాలయం మలక్పేట్, బి-బ్లాక్ పార్క్ సమీపంలోని ప్రభుత్వ క్వార్టర్స్, బి37 నుండి బి44 నంబర్లకు మార్చబడిందని జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు. బుధవారము నూతన ఆర్టీవో కార్యాలయాన్ని మలక్ పేట్ ఆర్టీవో కిష్టయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజలు దరఖాస్తుదారులు తమ పనుల నిమిత్తం కొత్త కార్యాలయాన్ని సందర్శించాలని కోరారు. ప్రజలందరూ సహకరించి ప్రభుత్వ సేవలు పొందాలని అన్నారు.

# ఓసీల సింహ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలి



**రంగారెడ్డి డిసెంబర్ 31 (మనం న్యూస్)** ఓసీల సింహ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలి అని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న వైశ్య, రెడ్డి, బ్రాహ్మణ, కమ్మ,వెలమ, చౌదరి, మార్వాడి కులాల సమూహంతో జనవరి 11 న వరంగల్ లోని ఆరట్స్ అండ్ సైన్స్ కాలేజీలో లక్ష మందితో తలపెట్టిన సభకు పెద్ద ఎత్తిన తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్యవైశ్య సంఘాలు ,వివిధ సంఘాల నాయకులతో శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ కర్మన్ ఘాట్ లో నిర్వహించిన సన్నాహక సభలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వ నుండి రిజర్వేషన్లు పొందక అగ్రకులంలో ఉన్న విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపారస్తులు వారి జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జీవన ప్రయాణం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు , పార్టీలు ఏవైనా అగ్రకుల సామాజిక వర్గాల్లోని నిరుపేదలకు ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించకుండా తాత్సారం చేస్తున్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు కడు పేదరికంలో ఉన్న వారికి ఫీజుల్లో రియంబర్స్మెంట్, ఫీజు రాయితీలు, నాన్ రిఫండెబుల్ ఆర్థిక సహాయం, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో వయోపరిమితిని సడలించకుండా, ఫీజులో రాయితీలు ఇవ్వకుండా అర్హత మార్కులలో సడలింపు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వీరి అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. అగ్రకుల సామాజిక వర్గాల కుల సంఘాల సభ్యులతో లక్షమంది తో సభ నిర్వహించి దేశవ్యాప్తంగా ఈ డబ్ల్యూ ఎస్ కమిషన్ ఏర్పాటు చేయాలి.

# అయ్యప్ప స్వామి మండల దీక్షలు ప్రారంభం: హాజరైన ఉప్పల



**రంగారెడ్డి డిసెంబర్ 31 (మనం న్యూస్)** సెంట్రల్ సెన్సార్ బోర్డ్ మెంబర్, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్త గురుస్వామి (27వ మాలాధారణ) , అయ్యప్ప స్వామి భక్తుల ఆధ్వర్యంలో దాస ఆంజనేయ స్వామి దేవాలయం నాగేశ్వర్ రావు నగర్ కాలనీ జూజూ నిర్వహిస్తున్న 41 రోజుల మండల దీక్షల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ప్రముఖ సామాజిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భక్తి, నియమ నిష్ఠలతో కూడిన అయ్యప్ప స్వామి మండల దీక్షలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు యువతను సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయని తెలిపారు. అన్నప్రసాద వితరణ లో పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# క్రియాశీల సంసిద్ధతే విజయ రహస్యం



ఆధునిక సమాజానికి ఈ ఏడాది మార్పు, ఆలోచనల మారునకు ఆరంభం. రేపటి భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న బెంగ ఈ రోజున వ్యక్తులను మాత్రమే కాదు, వ్యవస్థలను, సమాజాలను, దేశాలను కూడా వెంటాడుతోంది. మారుతున్న కాలం, వేగంగా దూసుకుపోతున్న సాంకేతిక విప్లవం, కృత్రిమ మేధ ప్రాభవం, రాజకీయ-ఆర్థిక ఒడిదుడుకులు, సామాజిక మార్పులు ఇవన్నీ కలిసి మనలో అనిశ్చితిని పెంచుతున్నాయి. కానీ 2026 నూతన సంవత్సరం తలుపు తట్టే వేళ ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. భవిష్యత్తుకు భయపడాల్సిన అవసరం లేదు. దానికి సిద్ధపడాల్సిన అవసరం మాత్రమే ఉంది. ఏడాది మారిందంటే కేవలం క్యాలెండర్ పేజీలు మారడమే కాదు. మన ఆలోచనలు, మన ప్రణాళికలు, మన జీవన దృక్పథం మారాల్సిన సమయం ఇది. ఉద్యోగాలు, ఆదాయాలు, ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు కాలాను గుణంగా పరీక్షించబడుతూనే ఉంటాయి. అదే సమయంలో మనల్ని మనమే సమీక్షించుకునే అవకాశం కూడా నూతన సంవత్సరం ఇస్తుంది. 2026 మనకు ఏమిస్తుందో కాదు? మనం 2026కి ఎంత మేరకు సిద్ధంగా ఉన్నామో అనేది ముఖ్యం.

ప్రపంచంలో అత్యంత కష్టమైన పనులు మూడే మూడు అంటారు. రహస్యాన్ని కాపాడటం, అవమానాన్ని మర్చిపోవటం, కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం.ఈ మూడింటిలో అత్యంత కీలకమైనది కాలం. ఎందుకంటే కాలం చేతిలోంచి జారితే తిరిగి పట్టుకోలేం. కాలానికి ఎదురీదే శక్తి రావాలంటే మన జీవిత పునాదిని ప్రణాళికబద్ధంగా పటిష్టం చేసుకోవాలి. ఒక వ్యక్తి గానీ, ఒక సమాజం గానీ జయాపజయాలు సాధించాలంటే, వారు కాలాన్ని ఎలా వినియోగిస్తున్నారన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది. కాలాన్ని గౌరవించడం నేర్చుకున్న వ్యక్తికి, సమాజానికి కోరికలు లక్ష్యాలుగా మారతాయి, లక్ష్యాలు విజయాలుగా మారతాయి. వింత ఏమిటంటే! కాలం అమూల్యమైనదని అంటారు. కానీ కాలాన్ని వృథా చేయ డంలో మాత్రం ఎవ్వరూ వెనకాడరు. సమయ పాలన లేని నీతులు...బూడిదలో పోసిన పన్నీరు లాంటివే. గతం మన చేతుల నుంచి జారిపోయింది. భవిష్యత్తు ఇంకా రాలేదు. మన చేతిలో ఉన్నది ఒక్క వర్తమానమే. కూలీ అయినా, కుబేరుడైనా...ప్రతి ఒక్కరికీ రోజుకు 24 గంటలే. ఆ 24 గంటల వినియోగంలోనే విజయమో, పరాజయమో దాగి ఉన్నాయి.ఇక్కడ మరో ముఖ్యమైన అంశం-పోలిక. ఇతరులతో పోల్చుకోవడం కాదు, నిన్నటి తనతో నేటి తనను పోల్చుకోవడమే నిజమైన పురోగతి. నిన్న కంటే ఈ రోజు నేను మెరుగ్గా ఉన్నానా? ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వస్తే, అదే విజయానికి మొదటి అడుగు.




భవిష్యత్ కాలం ఒక కుటుంబాన్ని అయినా, ఒక దేశాన్ని అయినా నిలబెట్టేది సంపద ఒక్కటే కాదు. ఆరోగ్యం నైపుణ్యం, సంసిద్ధత, భద్రత-ఈ నాలుగు సమానంగా ఉండటం చాలా అవసరం.

కానీ నేటి వేగవంతమైన సాంకేతిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల్లో భద్రతకు అర్థం మారిపోయింది. ఈ మారుతున్న ప్రపంచంలో భద్రత అనేది కేవలం డబ్బుతో కొలవలేని అంశం. మార్పులకు భయపడ కుండా ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించుకోవడమే నిజమైన భద్రత. డబ్బు రావచ్చు...పోవచ్చు. ఉద్యోగం మారొచ్చు. టెక్నాలజీ పాతది పోయి కొత్తది రావచ్చు. రాజకీయాలు మారవచ్చు. కానీ నేర్పు...ధైర్యం, నేర్చుకునే మనసు, మార్పును స్వీకరించే ఆలోచన, మాట్లాడుకుని పరిష్కరించుకునే సంస్కృతి ఉన్న సమాజమే నిజంగా సంసిద్ధమైన సమాజం. భవిష్యత్తు భద్రత నాలుగు స్తంభాలపై నిలబడుతుంది. డబ్బు, ఆరోగ్యం, నైపుణ్యం, సంబంధాలు. ఈ నాలుగు సమపాళ్లల్లో ఉన్నప్పుడే ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక సమాజం సుభిక్షంగా ఉంటుంది. సమాజం వ్యవస్థలతో, విధానాలతో నిలబడు తుంది. కానీ వాటికి గౌరవం, మర్యాద, ప్రతిష్ట రావాలంటే మానవీయ విలువలతో కూడిన ప్రవర్తనే ఆధారం. మంచి భవిష్యత్తు అదృష్టం వల్ల కాదు. ఎన్ని విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనే సంసిద్ధత వల్ల సాధ్యమవుతుంది. రేపు ఏమి జరుగుతుందో తెలుసుకోవాలన్న ఆత్రుత అవసరం లేదు. ఏం జరిగినా ఎదుర్కొనే ధైర్యమే అవసరం. కాలం పిరికివాళ్లను మరింత భయపెడుతుంది. ధైర్యవంతులను మాత్రం పరీక్షల ద్వారా తీర్చిదిద్దుతుంది.

2026నూతన ఆంగ్ల సంవత్సరం అడుగిడుతున్న వేళ ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. భయపడితే కాలం శత్రువుగా మారుతుంది. భుజం కలిపితే అదే కాలం మిత్రుడవుతుంది. భవిష్యత్తు మనల్ని భయపెట్టడానికి కాదు... మనల్ని తయారుచేయడానికి వస్తుంది. నూతన ఆంగ్ల సంవత్సరం మనకు ఏమిస్తుందో అనే ప్రశ్న కంటే,2026 కోసం మనం ఎంత సిద్ధంగా ఉన్నామో అనే ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాలి. సిద్ధపడిన వారికే రేపటి కాలం వశమవుతుంది. సంసిద్ధత ఉన్నప్పుడే కొత్త సంవత్సరం మనదవుతుంది. అందుకోసం తగిన కార్యాచరణ అవసరం.

**- మేకిరి దామోదర్**
9573666650

## హ్యాపీ న్యూ ఇయర్ 2026!

పాఠం నేర్పని వైఫల్యాలు
నూతన వత్సరాన్ని సృష్టించలేవు
గాయాలను మోసుకుంటూ
కొత్త ఏడాదిలోకి ఎలా అడుగు పెడతావు?
అనుభవాలు పాఠాలు నేర్పకపోతే
కొత్త క్యాలెండర్ నిండా
పాత అనుభూతులే ఎదురవుతాయి!
కొత్త కొత్త ఆలోచనలు
దృశ్యరూపం కట్టకపోతే
కాలం ఒక మురికి కూపం!
ఒకరికి ఒకరు చెప్పుకునే శుభాకాంక్షలు
యాంత్రికమైపోతే కాలానిదేమి తప్పు?
మనుషులు గోడలు నిర్మించుకుంటూ
మైదానాలు కలగంటున్నారు
కరచాలనాలు వట్టి శరీరాలకే
లోపలి అశ్ప ృశ్యతలు అట్లనే ఉన్నాయి
ఊరికే మూసిని నిందిస్తాం
మన దుర్గంధం మనకు తెలియదు!
కలలు కనడం మానేసి
సూర్యోదయంలా వెలగందే
ఉదయాలు మొలవవు!
హ్యాపీ న్యూ ఇయర్ 2026!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

## శిథిల దృశ్యం

కిటికీలకు ఆవలి వైపున చూడు
అట్టహాసంగా సాగుతున్న అన్యాయాల ఊరేగింపు
గాలిలో కలిసిపోతున్న పసివాడి ఆర్తనాదాలు
ఎవరికీ వినబడని ఒక దీనగాథ!
ఆకలి ఒడ్డున విసిరేయబడ్డ బాల్యం
రాలడానికి సిద్ధమైన కన్నీటి బిందువు
ధనవంతుడి అహంకారపు నవ్వుల మధ్య
నిశ్శబ్ద సమాధిగా మిగిలిన వేదన!
ముసుగులు ధరించిన క్రూర అణచివేతలు
రంగులు మార్చుకుని రాజమార్గాలపై విహారం
మనం మాత్రం సుఖాల గదిలో
గాజు తెరల వెనుక బందీలమయ్యాం!
కిటికీ రెక్కలు తెరిచే ఉన్నా
చూపులకు దొరికేది నీలి ఆకాశమే
శూన్యంలో దాగి ఉన్న ఆర్తనాదాలు
మన చైతన్యానికి అందని దృశ్యాలు!
ఇంకెంత కాలం ఈ నిద్ర?
మనమెప్పుడు మేల్కొంటాం? ఈ ప్రశ్న!

**- రాము కోలా**
9849001201

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
– ఎడిటర్

# గ్రామీణ భారతంపై పాలకుల నిర్లక్ష్యం



భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని వేదికల మీద వల్లెవేసే పాలకులు, క్షేత్రస్థాయిలో మాత్రం అదే ఆత్మను నలిపేసేలా వ్యవహరిస్తుండటం నేటి సామాజిక విషాదం. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవాలంటూ సాగుతున్న ఆందోళనలు కేవలం రాజకీయ నిరసనలు మాత్రమే కావు, అవి అణగారిన వర్గాల జీవన హక్కుపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ఆక్రందనలు. ఒకప్పుడు నిరుపేదలకు కొండంత అండగా నిలిచిన ఈ పథకాన్ని, నేడు పాలకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం క్రమంగా సమాధి చేసేందుకు సిద్ధపడటం అత్యంత దారుణం. ప్రస్తుత పాలకవర్గం ఈ చట్టాన్ని నేరుగా రద్దు చేసే ధైర్యం లేక, 'నిర్లక్ష్యం ద్వారా ఊపిరి ఆడకుండా చేయడం' అనే కుటిల వ్యూహాన్ని అమల్లోకి తెచ్చింది. బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోతలు విధించడం, కూలీల నోటి దగ్గరి ముద్దను లాగేసుకునేలా వేతనాల చెల్లింపులో నెలల తరబడి జాప్యం చేయడం ద్వారా ఈ పథకాన్ని పథకం ప్రకారం నిర్వీర్యం చేస్తున్నారు. రైతులకు ఇచ్చే నామ మాత్రపు నగదు సాయాన్ని ఉపాధి హామీకి ప్రత్యామ్నాయంగా చూపడం ప్రజలను నిలువునా వంచించడమే. భూమి ఉన్న రైతులకు ఇచ్చే ఆ అరకొర సాయం, రెక్కాడితే గానీ డొక్కాడని భూమి లేని నిరుపేద కూలీల కడుపు నింపదు. పని చేసే హక్కును హరించి, బిచ్చం వేసినట్లుగా నగదు పంపిణీ చేయడం పౌరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అవుతుంది.



రాష్ట్రాల మధ్య వేతనాల్లో ఉన్న భారీ వ్యత్యాసాలు పాలకుల అసమర్థతకు పరాకాష్ట. ఒక రాష్ట్రంలో ఇచ్చే వేతనం మరో రాష్ట్రంలో సగం కూడా లేకపోవడం, కూలీలను తమ సొంత గడ్డ నుండి తరిమేయడమే. ఈ దుస్థితి కారణంగానే ఛత్తీస్‌గఢ్. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి నిరుపేదలు వలస కూలీలుగా మారి, వేల మైళ్ల దూరంలో ఉన్న ఇతర రాష్ట్రాలకు ప్రాణాలకు తెగించి వెళ్తున్నారు. అక్కడ లభించే కొద్దిపాటి అదనపు కూలీ కోసం తమ కుటుంబాలను వదిలి, అభద్రత మరియు పని ప్రదేశాల్లో హింస ఎదుర్కొంటూ బతుకులీడుస్తున్నారు. వలసల బాటలో జరుగుతున్న మరణాలు, పేదరికం చేస్తున్న వెక్కిరింతలు పాలకుల విధానపరమైన పాపమే. గ్రామీణ ఉపాధి కల్పనలో దశాబ్దాలుగా మనం సాధించిన ప్రగతి శూన్యమని ఈ వలసలే సాక్ష్యం చెబుతున్నాయి.

పాలనా సౌలభ్యం పేరిట ప్రవేశపెట్టిన నేరుగా నగదు జమ చేసే విధానం వెనుక లోతైన రాజకీయ కుట్ర దాగి ఉంది. ఇది ప్రజల బాగు కోసం కాకుండా, కేవలం ఓట్ల వేట కోసం రూపొందించిన ఆయుధం. స్థానిక సంస్థలైన గ్రామ సభల ద్వారా జరిగే అభివృద్ధిని అడ్డుకుంటూ, నేరుగా కేంద్రమే నిధులు ఇస్తోందని భ్రమ కలిగించడం ద్వారా అధికారాన్ని కేంద్రీకృతం చేస్తున్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తిని చంపేయడమే కాకుండా, గ్రామాలను మళ్లీ ఢిల్లీ పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేస్తోంది. ఓట్ల కోసం అప్పుడప్పుడు విసిరే నగదు ముక్కలు నిరుపేదలను శాశ్వత పేదరికంలోనే ఉంచుతాయి తప్ప, వారిని ఆర్థికంగా ఎన్నటికీ బలోపేతం చేయవు.అసలు చర్చ జరగాల్సింది గతాన్ని నిందించడం గురించి కాదు, వర్తమానంలో జరుగుతున్న అన్యాయం గురించి.

ఒకవైపు గత పాలకుల దోపిడీని, మరోవైపు వందల ఏళ్ల నాటి చరిత్రను తవ్వుతూ కాలక్షేపం చేస్తున్న పాలకులు, నేటి గ్రామీణ నిరుద్యోగ రక్కసిని అరికట్టడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఉపాధి హామీలో పని కేవలం నామ మాత్రంగా మారిందని విమర్శించే పాలకులు, దాన్ని ఉత్పాదక శక్తిగా మార్చడంలో ఎందుకు విసిగిపోయారో సమాధానం చెప్పాలి. గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణం జరగకపోవడం, ఉన్న వనరులు వృథా కావడం పరిపాలనా అసమర్థతే.

గ్రామీణ భారతం తన లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైందనే చేదు నిజాన్ని మనం అంగీకరించాలి. నిరుపేదల ఆకలిని రాజకీయం చేసే ధోరణి ఇకనైనా వీడాలి. ఉపాధి హామీ పథకాన్ని కేవలం ఒక గొయ్యి తవ్వే పనిగా కాకుండా, గ్రామీణ పునర్నిర్మాణానికి బలమైన పునాదిగా మార్చాలి.

పని చేసే హక్కు అనేది పౌరుడి ప్రాథమిక హక్కు.. దాన్ని అరకొర నగదు బదిలీలతో భర్తీ చేయడం అసాధ్యం. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవడానికి సంక్షేమాన్ని ఒక సాకుగా వాడుకుంటోంది.

ఇప్పటికైనా పాలకులు తమ కుటిల రాజకీయ వ్యూహాలను పక్కన పెట్టి, గ్రామీణ పేదల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. గ్రామాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను ప్రచారాలకు, తాయిలాలకు మళ్లించడం ఆపాలి. లేకపోతే, ఈ పాలకుల నిర్లక్ష్యానికి గ్రామీణ భారతం శాశ్వతంగా మూల్యం చెల్లించక తప్పదు. చరిత్ర పాలకుల వైఫల్యాలను ఎన్నటికీ క్షమించదు.

నిరుపేద కూలీల కడుపు మంట రేపుతున్న ఈ విధానాలు అంతిమంగా వ్యవస్థకే ముప్పుగా పరిణమిస్తాయి. గ్రామాలను స్మశానా లుగా మార్చి స్వర్ణ భారతాన్ని నిర్మిస్తామనడం పచ్చి అబద్ధం. ఇప్పటికైనా మేల్కొని, ఉపాధి హామీ పథకానికి జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోయడం పాలకుల తక్షణ కర్తవ్యం.

**- వెంక గారి భూమయ్య**
9848559863

## దుఃఖం మనిషి అంతర్యాతన

ఎవరయినా ఒక మనిషి చనిపోతే
కళ్ళు చెమ్మగిల్లుతాయి

ఆ మనిషి తెలిసినవాడో
దగ్గరి వాడో అయితే
కళ్ళతో పాటు గుండెలూ
ద్రవిస్తాయి గోడు గోడు మంటాయి

పోయినవాడు
మనుషుల్లో తిరిగినవాడయితే
మనుషుల్ని అక్కున చేర్చుకున్న వాడయితే
మనసుల్ని కదిలించినవాడయితే
కళ్ళూ గుండెలే కాదు
దేహంలోని అణువణువూ
గుండెల్లోంచి ఎగిసే ప్రతి రక్తం చుక్కా
బోరు బోరున ఏడుస్తాయి

చీకట్లో ఒంటరిగా కూర్చుని
దుఃఖాన్నీ జ్ఞాపకాల్నీ
హృదయం మిక్సీలో వేసి
ఎప్పటికోగాని బయటపడలేడు

ఊపిరి కోల్పోయి అచేతనుడయిన
వాడి దేహానికి ఎవడు పాడె కడితే ఏంది
ఎవడు మోస్తే ఏముంది
గాల్లో పేలిన తుపాకులు
ఎవరిని సముదాయిస్తాయి
పాత ఫోటోలు.. కవితలు..
పాటలు.. ప్రకటనలు
బతికున్నవాడి ఉనికినే చాటుతాయి
పోయినోడు ఎట్లాగూ వెళ్ళిపోయాడు
మౌనంగానే
దుఃఖం మనిషి అంతర్యాతన
రోదన ఓ బహిరంగ ప్రదర్శన

**- వారాల ఆనంద్**

# బహుజనుల నిశ్శబ్ద విప్లవం



ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు కేంద్ర బిందువు గ్రామపంచాయతీ ఎన్నికలు. ఈ క్రమంలో తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు తమ కేటాయించిన రిజర్వేషన్ శాతం కంటే అధికంగా ఎన్నిక కావడం అందరిని ఆశ్చర్యపరిచింది. రిజర్వ్ కాని సీట్లలో కూడా గెలవడం గ్రామస్థాయి రాజకీయాల్లో స్వాభిమానానికి సూచిక. రాష్ట్ర రాజకీయ చరిత్ర లో సామాజిక మార్పుకు సంకేతంగా, బహు జన వాదానికి ప్రతీకగా చెప్పవచ్చు. భారతదేశ సగటు కన్నా తెలంగాణలో అత్యధిక శాతం బీసీ జనాభా ఉంది, వారి రాజకీయ ప్రాతినిధ్యం దశాబ్దాలుగా అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బీసీల కోసం'డెడికేటెడ్ కమిషన్' నియమించారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ సర్వే జరిపింది. బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్ విద్య ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఇవ్వడానికి బిల్లు ఆమోదించి రాష్ట్రపతికి పంపారు. దీనికి ఆమోదం లభించకపోవడంతో తక్షణం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్స్ అమలుచేయడానికి జీవో9 ను జారీచేసింది. దీన్ని ఆధిపత్య కులాలు హైకోర్టులో సవాలు చేయడంతో బ్రేక్ పడింది. బీసీల్లో ఉద్యమానికి దారితీసాయి. ఆ ఉద్యమ ప్రభావంతో ఎన్నడులేని లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో బీసీ, దళిత వర్గాల మధ్య ఒక కొత్త రాజకీయ చైతన్యం పెరిగి, పల్లె పోరులో అగ్రకులాలకు అభిముఖంగా స్థానిక రాజకీయ పోరు జరిగింది. బహుజనుల సామాజిక చైతన్యం ఒక నిశబ్ద రాజకీయ విప్లవానికి పునాది వేసింది.

పంచాయతీ రిజర్వేషన్లు మొత్తం 50 శాతం వరకే పరిమితం చేయాలనే సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లను కొత్తగా కేటాయిస్తూ జీఓ 46 జారీ చేసింది. ఇందులో కూడా గతంలో కన్నా ప్రత్యేకించి సర్పంచ్ కోటాను 17 శాతానికి తగ్గించడంపై బీసీ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఒక వైపు చట్టపరమైన 50 శాతం పరిమితి విధింపు, మరో వైపు గతంలో కన్నా బీసీల రిజర్వేషన్ శాతం తగ్గించినప్పటికీ...జనరల్ స్థానాల్లో బీసీ ఎస్సీ ఎస్టీలు పోటీచేసి తమ రిజర్వేషన్లకు అతీతంగా విజయకేతనం ఎగరవేశారు. గణాంకాల పరంగా పరిశీలించినట్లయితే రాష్ట్రంలో ఈ సర్పంచి ఎన్నికల్లో 86.4 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారే విజయం సాధించారు. 13.6 శాతం మంది మాత్రమే జనరల్ అభ్యర్థులు గెలిచారని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. విజేతలైన 12,702 మందికిగానూ 36.9 శాతం మంది బీసీలు కాగా, ఎస్టీలు 29.3 శాతం, ఎస్సీలు 18.2 శాతం మంది కాగా 13.6 శాతం మంది జనరల్ కేటగిరీ నుంచి ఎన్నికయ్యారనీ ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. తమకు రిజర్వ్ అయిన వాటి కంటే అధికంగా 166 స్థానాల్లో మహిళలు గెలిచినట్లు, యువత అత్యధిక స్థానాల్లో గెలిచారనీ రాష్ట్రఎన్నికల సంఘం పేర్కొంది. ఈ ఎన్నికల్లో ముఖ్యంగా జనరల్ స్థానంలో బీసీలు 50 శాతంపైగా గెలవడం బీసీ వర్గాలల్లో స్పష్టమైన మార్పుకు నిదర్శనం. ఈ ఎన్నికల్లో వచ్చిన ప్రధాన మార్పులను పరిశీలిస్తే డబ్బు పెట్టిన అగ్రకుల నాయకులు ఓడిపోయారు. ఇన్నాళ్లు రాజకీయంగా దూరంగా ఉన్న బీసీ, ఎస్సీ కులాలు ఉమ్మడిగా తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నం చేశారు. జగిత్యాల జిల్లా, బుగ్గారం మండలం, సిరికొండ గ్రామంలో బీసీ కులానికి చెందిన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన పంచిత ధర్మరాజు అత్యధిక డబ్బులు పంపిణీ చేసిన అగ్రకుల ఓ పార్టీ నాయకునిపై ఒక ఓటు తేడాతో గెలుపొంది చరిత్ర సృష్టించాడు. ఓ గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్లు మరియు సర్పంచ్ మొత్తంగా ఎస్సీలకు గెలుపొంది రికార్డు సృష్టించారు. బీసీ ఎస్సీ ఎస్టీలలో ఇలాంటి అరుదైన గెలుపు తెలంగాణ రాజకీయ సామాజిక ఒక చిత్రాన్ని మార్చింది. వేలకోట్లు డబ్బులు ఖర్చు పెట్టిన అగ్రకుల పార్టీలకు అభిముఖంగా గెలుపొందడం తెలంగాణ చరిత్రలో ఇది మొదటి సారి. ఉమ్మడి పోరాటాలతో ముందుకెళ్లాలి. కుల గణన, బీసీ రిజర్వేషన్స్‌కు అంశాలు సామాజిక సమీకరణకు దారితీసాయి. ఈ మార్పుకు ప్రధాన కారణం తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నిక్సాన బహుజన ఉద్యమాలు కొనసాగడమే. ఈ వాస్తవాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అర్థం చేసుకొని భవిష్యత్తు రాజ్యాధి కార పోరాటాలకు కలిసి రావాల్సిన అవసరం ఉంది. అప్పుడే పీడిత వర్గాలకు విముక్తి లభిస్తుంది.

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# ఎస్ఐఆర్ అమలుపై విమర్శలెందుకు?



ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అనేది భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా సవరణ. అతి త్వరలో ఈ ప్రక్రియను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోతున్నారు. అయితే ఇప్పుడు ఎస్ఐఆర్ పై దేశ వ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారం రేగుతోంది. అయినప్పటికీ రాజకీయ విమర్శలను పట్టించుకోకుండా కేంద్ర ఎన్నికల కమిషన్ సమగ్ర ఓటర్ సవరణ చేస్తూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే పది రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను అమలు చేసింది. మన దేశం నుంచి అక్రమ వలసదారులను నిబంధనల ప్రకారమే తిరిగి పంపడం ఎలా అసమంజసం అవుతుంది? దీనిపై కాంగ్రెస్, వామపక్షాలు చేస్తున్న ఆరోపణలు దేనికి సంకేతం? దేశ భద్రత కంటే వారికి అక్రమ వలసదారుల ఓటు బ్యాంకే ముఖ్యమా? అనే ప్రశ్నలు ఎస్ఐఆర్ గురించి తెలిసిన ప్రతి సామాన్యుని నోట ప్రశ్నగా వినిపిస్తోంది. ఎస్ఐఆర్ అంటే ఏంటి? ప్రక్రియ ఎలా జరుగుతుంది? ఎస్ఐఆర్‌పై విపక్షాల ఆరోపణల్లో విశ్వసనీయత ఎంత?. ఎస్ఐఆర్ అనేది భారత ఎన్నికల కమిషన్ సర్వసాధారణంగా చేపట్టే ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ మాత్రమే. దేశ వ్యాప్తంగా 1951 నుంచి ఇప్పటి వరకు 8 సార్లు ఓటర్ సవరణ ప్రక్రియ నిర్వహించారు. 2004లో చివరి సవరణ జరిగింది. ఈ ప్రక్రియకు గతంలో ప్రత్యేకంగా ఎలాంటి పేరు లేకపోవడం వల్ల పెద్దగా వివాదాస్పదం కాలేదు. ఎస్ఐఆర్ పేరు పెట్టడం ద్వారా అనుమానాలు, అపోహలు నెలకొన్నాయని చెప్పవచ్చు. గతంలో చేపట్టిన ఓటర్ సవరణ తర్వాత డబుల్ ఓటర్ ఐడిలు, వలసలు, చనిపోయిన వ్యక్తుల పేర్లు తొలగించకపోవడంతో ఓటరు జాబితా సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలు రాజకీయంగా సైతం తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ప్రస్తుతం ఈ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను భారత ఎన్నికల కమిషన్ చేపట్టింది. దేశవ్యాప్తంగా ఓటర్ల సవరణ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా నిర్వహించడమే ఈ ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశం. ఇప్పటికీ 9 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ అమలు అయింది. ఇప్పటికీ అండమాన్ నికోబార్, చత్తీస్‌గఢ్, గోవా,గుజరాత్,కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, వెస్ట్ బెంగాల్‌లో ఎస్ఐఆర్ అమలైంది.

ఎస్ఐఆర్ అమలు ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్స్ అమలులో కీలకంగా వ్యవహరిస్తారు. ఓటరు పేర్లు, అడ్రస్ మారిందా, కుటుంబ సభ్యుల వివరాలు సరిగ్గా ఉన్నాయా, లేదా అని పరిశీలిస్తారు. చివరిసారి నిర్వహించిన ఓటర్ సవరణ తర్వాత అత్యధికంగా నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు పేరుకు పోయాయని ఎన్నికల కమిషన్ గుర్తించింది. అక్రమ వలసదారుల ఓటు బ్యాంకును తమ పార్టీకి అనుకూలంగా మార్చుకొని రాజకీయాలు చేస్తున్నట్టు సైతం ఆరోపణలు ఉన్నాయి. అందుకు తగ్గట్టుగానే కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు అక్రమ వలసదారులపై రేటు విషయంలో భిన్నంగా స్పందించడం గమనించదగ్గ విషయం. ఈ ఏడాది ప్రారంభంలో బీహార్‌లో భారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రభావంతో బీహార్‌లో ఓటర్ల సంఖ్య 7.84 కోట్ల నుంచి 7.42 కోట్లకు తగ్గింది. ఇక పశ్చిమ బెంగాల్ నుంచి అక్రమ వలసదారులు లక్షల్లో తిరుగు ప్రయాణం కోసం సరిహద్దు వద్ద షెల్టర్లలో వేచి ఉండి మరి వెళ్ళిపోవడం వార్త కథనాల్లో చూసాం. ఎస్ఐఆర్‌లో ఏదైనా ఓటరు ఈ దేశ పౌరుడు కాదని నిర్ధారించాక ఆ పౌరులపై చట్టపరంగా చర్యలు ఉంటాయి. లక్షల్లో జరిమానా, జైలు శిక్ష తప్పదు. అలాంటి పరిస్థితిని ఎదుర్కోలేకనే అక్రమ వలసదారులు వారి స్వదేశానికి వెళ్లిపోయారని చెప్పవచ్చు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలులో ముఖ్యంగా నాలుగు దశలు ఉంటాయి. మొదటిది పర్ఫార్మెన్స్ పర్జ్- అంటే ఓటర్ల జాబితా వడపోసి డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన వ్యక్తులు, శాశ్వతంగా అడ్రస్ మార్చుకున్న ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించడం. రెండవది స్పెషల్ సమ్మరీ రివిజ్ - అంటే ప్రత్యేక సమగ్ర సవరణ అని అర్థం. ఈ దశలో ఓటర్ల అడ్రస్, వయస్సు, డాక్యుమెంట్ల వివరాలు డోర్ టు డోర్ సర్వేల ద్వారా ధ్రువీకరిస్తారు. మూడోది షెడ్యూల్ అమలు - ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను విడుదల చేసి బూత్ లెవెల్ ఆఫీసర్ల ద్వారా అమలు చేయడం ఈ దశలో ముఖ్యమైన ప్రక్రియ. ఇక నాలుగోది రాజకీయ పార్టీలతో సమన్వయం- ఈ దశలో ఎస్ఐఆర్ అమలు ద్వారా ఓటర్ల జాద్వారా తప్పులుంటే రాజకీయ పార్టీలు సరిదిద్దడానికి సహకరించాలని భారత ఎన్నికల కమిషన్ సూచిస్తోంది. భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ అమలు ద్వారా గణనీయమైన నకిలీ ఓటర్లను తొలగించడం, అలాగే ఈ దేశం కాని వారిపై చర్యలు చేపట్టడం జరుగుతోంది. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అనేది అధికారిక ఓటు చోరీ అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎస్ఐఆర్ చేపట్టే దశల్లో నాలుగో దశ అయిన రాజకీయ పార్టీలతో సమన్వయంతో ఓటర్ల జాబితాలో తప్పులుంటే రాజకీయ పార్టీలు కలుగజేసుకొని సరిదిద్దడానికి అవకాశం ఉంది. అన్యాయంగా తొలగించబడ్డ ఓటర్లను జాబితాలో తిరిగి చేర్చే అవకాశం రాజకీయ నాయకులకు ఉంటుంది కదా. ఎస్ఐఆర్ చేపట్టే పూర్తి హక్కు భారత ఎన్నికల కమిషన్‌కు సొంతం. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టు సైతం కలుగజేసుకోలేని విధంగా ఉంటుంది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టే ప్రక్రియలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని తెలిపింది. అలాగే ఆధార్ అనేది ఒక వ్యక్తి గుర్తింపు మాత్రమేనని సుప్రీంకోర్టు ప్రధానంగా ప్రస్తావించింది. దేశంలోకి చొరబడి రాజకీయాలను ప్రభావితం చేసే విధంగా అక్రమ వలసదారులకు వత్తాసు పలకకుండా వారి తొలగింపుకు ఎస్ఐఆర్ ద్వారా సహకరించాల్సిన అవసరం ప్రతి భారతీయ రాజకీయ నాయకులపై ఉందనే విషయం గుర్తించాలి.



**-శ్రీనివాస్ గుండోజు**
9985188429

# కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం

- ముస్సిపాలిటీల్లోనూ ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారు
- ఆశావహుల జాబితాను రెడీ చేయండి
- టిక్కెట్లు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మొద్దు
- సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలకే టిక్కెట్లు
- టిక్కెట్లు రానివారికి పార్టీ, నామినేటెడ్ పదవుల్లో సర్దుబాటు చేస్తాం
- ఆవేశంతో రాంగ్ స్టెప్ వేస్తే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి బండి



**కరీంనగర్ డిసెంబర్ 31(మనం బ్యూరో)....** రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగరేయడమే బీజేపీ ముందున్న లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. టిక్కెట్ల విషయంలో పైరవీలు, మొహమాటాలకు తావులేదని, సర్వే రిపోర్టుల ఆధారంగా గెలుపు గుర్రాలకే పార్టీ నాయకత్వం బీజేపీ టిక్కెట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. టిక్కెట్ల కోసం తనతోపాటు తన కుటుంబ సభ్యులకు ఫోన్లు కూడా చేయొద్దని, ఎవరైనా ఒత్తిడి తెస్తే వాళ్లకు వచ్చే టిక్కెట్లు కూడా రావని హెచ్చరించారు. టిక్కెట్ ఆశించడంలో తప్పు లేదని, గెలవలేని పరిస్థితి ఉన్నప్పుడు అర్థం చేసుకుని పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. టిక్కెట్లు రాకపోయినా పార్టీ పరంగా, నామినేటెడ్ పోస్టుల పరంగా వారికి న్యాయం చేస్తామన్నారు. ఈసారి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువ మంది నామినేటెడ్ పోస్టులు దక్కేలా క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా టిక్కెట్ల కోసం, ఇతరత్రా విషయాల్లో గొడవలకు దిగే నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులను కోరారు. టిక్కెట్లు రాలేదనే కోపంతో పార్టీని వదిలివెళ్లాలనుకునే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈసారి తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, రాజకీయ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవద్దని సూచించారు. తనకు పార్టీ గెలుపు, పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బ్లాక్ మెయిల్ కు బెదిరింపులకు బండి సంజయ్ లొంగే రకం కాదని స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కరీంనగర్ లోని త్రిధా హోటల్ లో కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లోని పట్టణ, జోన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో 'మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం' నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు.ఎన్నికల్లో టిక్కెట్లు ఇప్పిస్తానని ఎవరైనా హామీ ఇచ్చినా నమ్మొద్దు. సర్వే ఆధారంగా గెలిచే అవకాశమున్న వాళ్లకు మాత్రమే టిక్కెట్లు వస్తాయి. పార్టీ నాయకత్వం మాత్రమే టిక్కెట్లు ఇస్తుంది. ఈ విషయంలో ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దు. కరీంనగర్ తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీకి మంచి వాతావరణం ఉంది. ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారు. ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం. ఇతర మున్సిపాలిటీల పీఠాలను సైతం బీజేపీ గెలుచుకునేలా చేస్తాం.

ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారు. బీజేపీ నాయకులు, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు మాత్రం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి. టిక్కెట్లు రానివారికి పార్టీ, నామినేటెడ్ పదవుల్లో సర్దుబాటు చేస్తాం. ఆవేశంతో రాంగ్ స్టెప్ వేస్తే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఎన్నికల సమయంలో గొడవలు పెట్టుకునే నేతలను ఉపేక్షించబోం. వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేస్తాం.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో పదేళ్లలో బీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు. కేంద్ర నిధులతోనే ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి జరుగుతోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమే. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం లేని బీఆర్ఎస్ కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే. ఈ నేపథ్యంలో కరీంనగర్ కార్పొరేషన్ సహా మున్సిపాలిటీలన్నింటినీ బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిద్దాం. ఇదే విషయాన్ని మీరు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి. ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటేసేలా ప్రచారం చేయండి. మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున బోగస్ ఓట్లు ఉన్నాయని వార్తలు వస్తున్నాయని, వెంటనే ఓటర్ల ముసాయిదా జాబితాను డివిజన్లు, వార్డుల వారీగా సేకరించి ఇంటింటికీ వెళ్లి పరిశీలించండి. బోగస్ ఓట్లు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయండన్నారు.

## మహిళా అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి
- నారి మహిళా ఆరోగ్య సంకల్పం లో భాగంగా సానిటరీ న్యాప్ కిన్స్ పంపిణి



**జగిత్యాల డిసెంబర్ 31(మనం న్యూస్):**మహిళా అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్క లంబా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతా రావు ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గం పట్టన కేంద్రంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ (సానిటరీ న్యాప్ కిన్ ) కార్యక్రమం లో భాగంగా పట్టణంలోని మహిళలలకు న్యాప్ కిన్స్ ను పంపిణి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మిదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నారీ న్యాయ్ కార్యక్రమం ద్వారా మహిళా ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధి దిశగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు నాయకత్వంలో దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ నిలిచిందన్నారు. ఇలా దేశంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వం ద్వారా వచ్చిన నిధులను సద్వినియోగం చేసేందుకు ఉడాన్ ప్రియదర్శిని కార్యక్రమం ద్వారా న్యాప్ కిన్ లను పంపిణి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా సంక్షేమం కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి పథకాన్ని మహిళా పేరు పైన ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డీకే దక్కిందన్నారు. రాష్ట్రం లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చెయ్యడమే లక్ష్యం గా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. జిల్లాలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజి మంత్రి జీవన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు పొలాస నందయ్య సహకారంతో జిల్లాలో మహిళా కాంగ్రెస్ పటిష్టత దిశగా సమిష్టిగా ముందుకెళ్తామన్నారు. ప్రజలు ముఖ్యంగా మహిళా లోకం కాంగ్రెస్ పార్టీని ప్రభుత్వం ను ఆదరించి, ఆశీర్వాదం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో మహిళా కాంగ్రెస్ బాధ్యులు నాగ లక్ష్మీ, సంతోషి,మమత, అనిత , అలిశెట్టి మమత తో పాటు మహిళలు తదితరులు ఉన్నారు.



## ఏపీ డిప్యూటీ సీఎం కొండగట్టు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

- డిప్యూటీ సిఎం పర్యటన విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల డిసెంబర్ 31 ( మనం ప్రతినిధి ):** జనవరి 3న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు పరిశీలించారు.

డిప్యూటీ సిఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సభా స్థల ఏర్పాట్లు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం హెలిప్యాడ్, శిలాపలకం మరియు గుడి ఆవరణ ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



## నట్టల నివారణ మందుల పంపిణీ

**జగిత్యాల డిసెంబర్ 31( మనం ప్రతినిధి):** జగిత్యాల మండలం అంతర్గం గ్రామంలో గ్రామ సర్పంచ్ నోముల రమ్య శేఖర్ రెడ్డి ఉప సర్పంచ్ లక్ష్మణ గౌడ్ వార్డ్ మెంబర్స్ ఆధ్వర్యంలో పశు సంపద అధికారి ఎలిగేటి రవీందర్ 1390 గొర్రెలకు, 410 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినారు.ఈ సందర్భంగా పర్యవేక్షణ అధికారి డా. బోనగిరి నరేశ్, సహాయ సంచాలకులు నట్టల నివారణ వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం లో టి ఎన్ జి ఓ అధ్యక్షులు మిరియాల నాగేందర్ రెడ్డి, సిబ్బంది పోచయ్య, అనిల్, మణి చందు తదితర రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం




**కరీంనగర్, డిసెంబర్ 31,(మనం బ్యూరో):** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కంట్రోల్ రూమ్ నుండి ఎస్సై శ్రీనివాస్, ఏ.ఆర్. పోలీస్ హెడ్ క్వార్టర్స్ విభాగం నుండి, ఏఆర్ ఎస్సై రాంచందర్ పదవీ విరమణ పొందారు. కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.
సీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఇరువురికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లు వెంకటరమణ , భీంరావు, రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) శ్రీ మేడ కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వము చొరవ తీసుకుని అన్వేష్‌ను దేశానికి రప్పించి దేశద్రోహం కేసు పెట్టాలి

- దేశాన్ని ద్వేషించిన హిందూ దేవతలను కించపరిచిన అన్వేషణ అన్వేష్ ను కఠినంగా శిక్షించాలి
- భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు




**జగిత్యాల డిసెంబర్ 31(మనం న్యూస్):** జగిత్యాల భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు, చెట్ల గంగాధర్ మాట్లాడుతూ గత కొన్ని రోజుల కింద సినీ యాక్టర్ శివాజీ మహిళల వస్త్రాధారణ గురించి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ నా అన్వేషణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా యాత్రలు చేస్తున్న అన్వేష్ అనే యాత్రికుడు హిందూ దేవతలైన సీతా ద్రౌపదీమాతలను అవమానకరంగా మాట్లాడడమే కాకుండా దేశాన్ని కూడా కించపరిచే విధంగా మాట్లాడటం జరిగిందని హిందువ ులందరూ రేపిస్టులని మహిళలను రేపులు చేసే వాళ్లంతా హిందువులేనని చాలా దారుణమైన వ్యాఖ్యలు చేశాడని ఇలాంటి వాడి పాస్పోర్ట్ క్యాన్సల్ చేసి దేశానికి రప్పించి కఠినంగా శిక్షించాలని కోరారు హిందువులు సంఘటితం కాకపోతే ప్రతి ఒక్కరు ఇలా హిందూ మతం మీద విషం కక్కుతూనే ఉంటారని ఇకనైనా హిందువులు జాగృతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు చిట్ల గంగాధర్ నాయకులు సింగం గంగాధర్, బాశెట్టి ప్రభాకర్, గాదాసు భూమన్న కొత్తకొండ బాలన్న ఎడమల వెంకటరెడ్డి నరేందుల శ్రీనివాస్ బొందుకూరి శ్రీనివాస్, దుబ్బ రాజం, పరంకుశం, నరేందర్ సిరిపురం గంగారం పాల్గొన్నారు

## పదవి విరమణ పొందిన ఏఆర్ఎస్ఐ సయ్యద్ తకీద్దీన్

**జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు**



**జగిత్యాల డిసెంబర్ 31( మనం ప్రతినిధి ):** పోలీస్ శాఖలో గత 30 సంవత్సరాలుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న ఏ ఆర్ ఎస్ ఐ సయ్యద్ తకీద్దీన్ ను ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు పూలమాల వేసి శాలువ లతో ఘనంగా సన్మానించారు.సుధీర్ఘ కాలంగా పోలీస్ శాఖ లో విధులు నిర్వహించి సేవలు మరువమని అన్నారు.పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు.ఎలాంటి సమస్య వచ్చిన తనను సంప్రదించ వచ్చని అన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన ఏ ఆర్ ఎస్ ఐ సయ్యద్ తకీద్దీన్ గారిని పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు కిరణ్ కుమార్, వేణు మరియు సిబ్బంది పాల్గొన్నారు

## మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్.



**చేవెళ్ల, డిసెంబర్ 31 (మనం న్యూస్):** మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు.
షాబాద్ మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం 40 ఎమ్ ఎల్ డి వద్ద మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ధర్నా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఎన్. సి. సి, కే. ఎస్ ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యాలు సకాలంలో మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తే సిఐటియు చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎన్.సీ.సీ, కె ఎస్ ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యాల లేబర్ లైసెన్సులు రద్దు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతారం నీటి శుద్ధి కేంద్రంలో 28 మందికి గాను కేవలం 15 మందితో పనులు చేయిస్తున్నారని వారిపై అధిక పని భారం పడిందని అన్నారు కార్మికులకు జీతాలు చెల్లించని పక్షంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల డిసెంబర్ 31(మనం ప్రతినిధి):** జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన సంవత్సరం జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం కొనసాగాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.




# ఓటర్ల మ్యాపింగ్ వారంలోపు పూర్తి చేయాలి

- భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, డిసెంబర్ 31 మనం న్యూస్ ప్రతినిధి :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) లో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్ పురోగతి, భూభారతి దరఖాస్తుల స్థితిగతులనుసమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, బి ఎల్వోలు, బిఎల్వో సూపర్వైజర్ల సమన్వయంతో ఫీల్ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని సూచించారు.ఏ ఈ ఆర్ ఓ వారిగా రోజువారీ పురోగతి నివేదికలు తీసుకొని రెగ్యులర్గా సమీక్షించాలని ఆర్డీవోలకు సూచించారు. జాప్యం జరగకుండా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలని తహసిల్దార్లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. పూర్తి పారదర్శకంగా భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారు? ఎంతవరకు చేస్తున్నారు?

- మున్సిపల్ కమీషనర్ పై చర్యలు తీసుకోండి
- చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా కుల్చివేతలు
- 43 మైసమ్మ గుళ్లను కూల్చివేసిన వారిపై ఇప్పటివరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదు
- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, డిసెంబర్ 31 (మనం న్యూస్):** గత రెండు సంవత్సరాలగా రామగుండం నియోజకవర్గంలో చట్టాన్ని తుంగలో తోక్కుతూ ఇష్టానుసారంగా దుకాణాల కూల్చివేతలు జరిగుతున్నాయని, అక్రమ కూల్చివేతలపై రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అరుణ శ్రీ పై చర్యలు తీసుకోవాలని రామగుండం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామగుండం రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష కు మున్సిపల్ కమీషనర్ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ కూల్చివేతలు చేపడుతున్నారని అన్నారు. కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో? ఎంత వరకు చేస్తున్నారో? ఎవరు చేస్తున్నారో చెప్పకుండా మున్సిపల్ కార్పోరేషన్ ఇష్టం వచ్చినట్లు కూల్చేస్తున్నరన్నారు. ఈ ప్రాంతంలో 43 మైసమ్మ గుళ్లను కూల్చివేశారని, ఇప్పటివరకు బాధ్యులపై ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చిరువ్యాపారుల దుకాణాలకు ఏలాంటి నష్టపరిహారం చెల్లించకుండా వారి జీవితాలను రోడ్డుపై పడేశారని అన్నారు. అక్రమ కూల్చివేతలు చేపడుతున్న కమీషనర్ అరుణ శ్రీ పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి, నీరటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో యూరియా స్టాక్ సమృద్ధిగా ఉంది

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, డిసెంబర్ 31 మనం న్యూస్ ప్రతినిధి :** జిల్లాలో యూరియాపూర్తిస్థాయిలోసరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. జిల్లాలోని అన్ని పిఏసి ఎస్ సొసైటీలు, సహకార సంఘాలు, అగ్రో కేంద్రాలు, హెచ్ ఏ సి ఏ, ఈ సి ఎం ఎస్ కేంద్రాలు మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 4,598 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని అందులో సహకార సంఘాల వద్ద 312 మెట్రిక్ టన్నులు,ప్రైవేట్ డీలర్లు వద్ద 621 మెట్రిక్ టన్నులు,మార్క్ఫెడ్ బఫర్ స్టాక్ 3,665 మెట్రిక్ టన్నులుయూరియా స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యూరియా సరఫరా విడతల వారీగా నిరంతరంగా కొనసాగు తుందని తెలిపారు.

# సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో పని చేయడం అదృష్టం




**సూర్యాపేట డిసెంబర్ 31 (మనం ప్రతినిధి)** సుదీర్ఘకాలం పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు న్యాయం చేసే వృత్తిలో ఉండటం ఎంతో అదృష్టమని జిల్లా ఎస్పీ కే నరసింహ అభిప్రాయపడ్డారు. బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ నందు ఏఎస్ఐ గా పని చేస్తున్న రాములు ద్యోగవిరమణ పొందినారు. ఈ సందర్భంగా ఉద్యోగవిరణ పొందిన ఏఎస్ఐ ని వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో జిల్లా పోలీస్ కార్యలయంలో ఎస్పి కె.నరసింహ గారు ఘనంగా సన్మానించారు, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పోలీసు డిపార్ట్మెంట్ నందు సుదీర్ఘకాలం సేవలు అందించడం గొప్పవిషయం అని, అభినందనీయం అని వారి సేవలను అభినందించారు, క్లిష్టమైన పోలీసు ఉద్యోగ విధుల నిర్వహణలో గృహిణిగా భర్తకు సహాయ సహకారాలు అందించడంలో భార్య సేవలు విలువైనవి అన్నారు. ఇంటిని, పిల్లలను ప్రయోజకులను చేయడంలో భార్య పాత్ర కీలమైనది అన్నారు. కానిస్టేబుల్ గా ఉద్యోగంలో చేరి ఈ స్థాయికి చేరడం, జీవిత ప్రయాణంలో సంపూర్ణ సంతోషకరమైన ఉన్నత కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నారు అని కొనియాడారు. ఈ ఉద్యోవిరమణ అనంతరం కుటుంబ సభ్యుల అందరితో సుఖ సంతోషలతో గడపాలని అని, ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటున్నాము అని తెలిపినారు. రిటైర్మెంట్ అనేది వయస్సు కే కానీ మనసుకు కాదు నచ్చిన పనిలో కృషి చేయాలని అన్నారు.అధికారులు, తోటి ఉద్యోగులు, స్నేహితులు బంధువులు మాట్లాడుతూ విధులలో అంకితభావంతో, బాధ్యతతో పని చేసేవారనీ, కష్టపడే తత్వం కలవారని, అధికారులకు, క్రిందిస్తాయి సిబ్బందితో కలుపుకుని పోయేవారు అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, ఏఅర్ ఆధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, ఏ ఓ.మంజు భార్గవి, డిఎస్పీ నరసింహ చారి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ ఐ.రామచందర్, వెల్ఫేర్ ఎస్ఐ సాయిరాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# పోలీసు కుటుంబానికి ఆర్థిక చేయూత

**సూర్యాపేట డిసెంబర్ 31 (మనం ప్రతినిధి)** సూర్యాపేట జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ నందు పని చేస్తూ కానిస్టేబుల్ కమలాకర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల అకాలంగా మరణించడం జరిగినది. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడం లో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా కమలాకర్ కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పోలీసు చేయూత పథకం చెక్కును ఎస్పీ నరసింహ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మృతుని కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది. కమలాకర్ కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి నెల జీతం నుండి విరాళం అందిస్తున్నారు అని అభినందించారు, పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ లు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, డిఎస్పీ లు ప్రసన్నకుమార్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహ చారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజు భార్గవి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ. సాయిరాం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# వేములవాడలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బ్రోచర్ విడుదల

**వేములవాడ,డిసెంబర్31(మనం న్యూస్):** వేములవాడ పట్టణంలో నిర్వహించబోయే ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్ విడుదల కార్యక్రమం వేములవాడ పట్టణం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కరాటే పోటీల బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ సబ్ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ కరాటే బ్లాక్ బెల్ట్ గ్రహీత అవధూత రజినీకాంత్ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, నిర్వాహకులు అబ్దుల్ మన్నన్, సీనియర్ జర్నలిస్ట్ లాయక్ పాషా, అకాడమీ సీనియర్ బ్లాక్ బెల్ట్ లు గ్రహీతలు మంగళగిరి శ్రీనివాస్, దండు గల తిరుపతి, శంకర్, లోలోపు రాజు, మానపాటి తిరుపతి, కనకరపు రాజశేఖర్, కావ్య, ఫర్హాన్ అబ్బాసి, బోడుగే శ్యాం కుమార్ పాల్గొన్నారు. ఇట్టి పోటీలు ఫిబ్రవరి 8 తేదీన స్థానిక వేములవాడ పట్టణం శ్రీనివాస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నుండి క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ

- పూజలో పాల్గొన్న దంపతులు జయా-గుణ., దత్తు, జగ్గారెడ్డి, నిర్మల.

**సంగారెడ్డికి డిసెంబర్ 31 మనం న్యూస్ ప్రతినిధి.:** సంగారెడ్డి పట్టణం లోని రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద జగ్గారెడ్డి స్వగృహం లో సత్యనారాయణ కథ, అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా జరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతీ ఏటా డిసెంబర్ 31 న ఆనవాయితీగా ఈ పూజలను జగ్గారెడ్డి నిర్వహిస్తుంటారు. ప్రతీఏడు మాదిరిగానే ఈ సారి సైతం ఈ పూజలు కన్నుల పండుగ గా జరిగాయి. ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి కథ తో ప్రారంభమయ్యే ఈ పూజ కార్యక్రమాల్లో మధ్యాహ్నము అయ్యప్ప పూజ, సాయంత్రం మొదలుకుని అర్ధరాత్రి వరకు మహా పడి పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఈసారి ప్రత్యేకంగా మధ్యాహ్నము యోగిని పుష్పార్చన, రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భజన బృందాల చే ఏర్పాటు చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ పూజా కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కుమార్తె , అల్లుడు జయా- గుణ లతో పాటు కుమారుడు దత్తు, జగ్గారెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

# జీవో 252 సవరించాలి

- జర్నలిస్టు సమాజానికి న్యాయం చేయండి
- ప్రభుత్వ విప్ కు జర్నలిస్టుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో వినతి



**వేములవాడ,డిసెంబర్31(మనంన్యూస్):** ర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేసే విధంగా చూడాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే హెచ్ 143) రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘం డిమాండ్ చేస్తుంది. బుధవారం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధి బృందంతో కలసి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో కలిసి జీవో ను సవరించాలని వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలోప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తూ ప్రజా పాలన ప్రభుత్వం నూతన అక్రిడిటేషన్ల జారీ కోసం జీవో 252 తీసుకురావడం అభినందనీయమన్నారు. అయితే ఈ జీవోలోని కొన్ని నిబంధనలతో ఇప్పటి వరకు అక్రిడిటేషన్లు కలిగిన దాదాపు 10 వేల మందికి నష్టం జరిగే ప్రమాదం ఉందనితెలిపారు.డెస్క్ జర్నలిస్టులు, ఫీల్ జర్నలిస్ట్ అన్న తేడా లేకుండా అందరికీ అక్రిడిటేషన్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టీయూడబ్ల్యూజే అభ్యర్థనపై రాష్ట్ర ప్రభుత్వ విప్ స్పందిస్తూ అయ్యండి పిఆర్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడారు. త్వరలోనే అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా టెంజు అధ్యక్షుడు ఇరుకుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు సామల గట్టు, మహమ్మద్ అజీమ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, లతోపాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



- వైద్యులు సమయ పాలన పాటించాలి
- జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**గోదావరిఖని, డిసెంబర్ 31 (మనం న్యూస్)** ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఈ మేరకు బుధవారం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో వైద్యులు సమయ పాలన పాటిస్తూ విధులకు తప్పకుండా హాజరుకావాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జనరల్ ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్ సర్జరీ బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా వైద్య సిబ్బంది సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాళ్ సింగ్, డాక్టర్లు కృపా బాయి, రాజు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వన సంరక్షణ సమితితో అటవీ సంరక్షణ

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వన సంరక్షణ సమితి బృందాల ఆర్థికాభివృద్ధి కి చర్యలు
- వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని ప్రారంభించిన మంత్రి



**కల్లూరు, డిసెంబర్ 31(మనం న్యూస్):** వన సంరక్షణ సమితి తో అటవీ సంరక్షణ, అభివృద్ధికి అటవీ శాఖ కు చక్కటి సహకారం లభిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో నిర్మించిన వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, వన సంరక్షణ సమితిని ప్రోత్సహిస్తే, అడవికి మంచి జరుగుతుందని అన్నారు. కనకగిరి, పులిగుండాల తదితర అటవీ ప్రాంతాల్లో 4 నుండి 5 వన సంరక్షణ సమితులు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు ఆయన అన్నారు. ఇందులో నుండి గుర్తించిన ఒక సమితిని పైలట్ ప్రాజెక్ట్ గా తీసుకొని వారిని ఆర్థికంగా ప్రోత్సహించడానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు విహారాలకు కోట్లు పెట్టి వెళతారని, మన చుట్టూ విహారానికి అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో పులిగుండాల, కనకగిరి హిల్స్ సుమారు 35 వేల ఎకరాలకు ఒకే బిట్ గా అటవీ ప్రాంతం విస్తరించివుందని తెలిపారు. ఈ ప్రాంతం ఎంతో బాగుందని, విదేశాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాల రేంజ్ లో వీటిని తీర్చిదిద్దే అవకాశం ఉందని అన్నారు. అడవులను రక్షించుకుంటూ, వన్యప్రాణులను కాపాడుకుంటూ, వినోదానికి, గిరిజనులకు ఉపయోగ పడి, లబ్ది కలిగే విధంగా ప్రోత్సహిస్తూ ప్రణాళిక చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కార్యాచరణకు కావాల్సిన నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అటవీ పరిరక్షణ చాలా అవసరమని, అటవీ పరిరక్షణలో పౌరులుగా మన అందరిపై బాధ్యత ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, 13 లక్షల వ్యయంతో వన సంరక్షణ సమితి సమావేశ మందిరాన్ని నిర్మించి, ప్రారంభించుకున్నామన్నారు. 35 వేల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కబ్జా, ఆక్రమణ నుండి కాపాడడంలో వన సంరక్షణ సమితి పాత్ర కీలకంగా ఉందన్నారు. వన సంరక్షణ సమితి ఆర్థికాభివృద్ధి కి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా సహకారం ఇస్తామన్నారు. కనకగిరి, పులిగుండాల, నీలగిరి పార్క్ లలో వారాంతం గడిపేలా అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, అడవులు, చెట్లు లేకపోతే మానవ మనుగడ లేదన్నారు. పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతో అవసరమన్నారు. చెట్ల పెంపకం, వన సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పులిగుండాల, కనకగిరి హిల్స్ ప్రాంతాలను ప్రోత్సహించి అభివృద్ధి చేస్తే, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఆదాయంతో పాటు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అంతకుముందు మంత్రి పులిగుండాల ఎకో టూరిజం విహారానికి రెండు వాహనాలను ప్రారంభించారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారిచే ఉచితంగా పంపిణీ జ్యూస్, సబ్బులు, విస్తరాకులు తయారీ యూనిట్లను వన సంరక్షణ సమితిలకు అందజేశారు. వన సంరక్షణ సమితి సభ్యులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, ఎఫ్ డిఓ మంజుల, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నీరజ ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



- జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్

**జగిత్యాల డిసెంబర్ 31(మనం న్యూస్):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వారి నూతన సంవత్సర క్యాలెండర్ ను జగిత్యాల ఎంఎల్ఏ డా. సంజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల స్కీమ్ లో చర్యలు తీసుకుందన్నారు. పేద మధ్యతరగతి ప్రజల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పై ఉంది. ఉపాధ్యాయుల సమస్యలు,పెన్షనర్స్ సమస్యలు నా దృష్టికి వచ్చాయి అని పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి వారంలో జీతాల చెల్లింపు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ బోగ రమేష్ ,స్టేట్ కమిటీ సభ్యులు రఘుపతి, రాష్ట్ర ఉపాధ్యాయ నాయకులు సుధ రాజేందర్, టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామచంద్రం ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆలయానికి కొత్త శోభ

- ఆలయ మాస్టర్ ప్లాన్‌పై దేవాదాయ శాఖ కమిషనర్‌తో మంత్రి తుమ్మల సమీక్ష
- జూలై 23, 2027 నుండి ప్రారంభం కానున్న పుష్కర ఏర్పాట్లపై సమీక్ష
- భద్రాచలం రామాలయం మాడ వీధుల విస్తరణ ఆగమ శాస్త్రం ప్రకారం జరగాలి
- దశల వారీగా మూడు ఏళ్లలో విస్తరణ పనులు పూర్తి చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు
- దేవాదాయ శాఖ కమీషనర్ కు మంత్రి తుమ్మల దిశానిర్దేశం



భద్రాచలం, డిసెంబర్ 31( మనం న్యూస్): దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య ఆలయం నూతన శోభ సంతరించుకోనుంది. మార్చి 2026లో శ్రీరామనవమి సీతారామ కళ్యాణం నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు. భద్రాద్రి రామయ్య అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న భూ సేకరణకు, కాంగ్రెస్ సర్కారు ముఖ్యమంత్రి ఆదేశాలతో రూ.34 కోట్లు విడుదల చేయడం తో భూ సేకరణ పూర్తి చేశారు. ఆలయం విస్తరణ పనులు కోసం భూ సేకరణ పూర్తవడంతో ఆలయం మాడ వీధుల విస్తరణ పనులు, ప్రాకార నిర్మాణాలు చేపట్టాలని,ఆగమ శాస్త్రం ప్రకారం ఆర్కిటెక్ట్ ఇచ్చిన డిజైన్లు (మాస్టర్ ప్లాన్) ముఖ్య మంత్రి ఆమోదంతో ఫైనల్ చేసి పనులు మొదలు పెట్టాలని మంత్రి తుమ్మల సూచించారు. దీంతో దక్షిణ అయోధ్య టెంపుల్ సిటీకి అడుగులు పడనున్నాయి. భద్రాచలం రామాలయం మాడ వీధుల విస్తరణ పనులు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణం చేయాలని మంత్రి తుమ్మల తెలిపారు. బుధవారం హైదరాబాద్ సచివాలయం లో దేవాదాయ శాఖ కమీషనర్ హరీష్ తో ఆలయ విస్తరణ పనులు పై మంత్రి తుమ్మల చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ దక్షిణ అయోధ్య గా భాసిల్లుతున్న భద్రాచలం రామాలయం 1664 లో భక్త రామదాసు నిర్మాణం చేశారు. పెరుగుతున్న భక్తుల సౌకర్యం కోసం ఆలయం విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రామాలయం మాడ వీధుల విస్తరణ పనులు దశల వారీగా మూడు ఏళ్ళలో పూర్తి చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కు మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు. మంత్రి తుమ్మల చొరవతో సీఎం రేవంత్ రెడ్డి భూసేకరణకు కావలసిన నిధులను విడుదల చేసి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. భారతదేశానికి తలమానికంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న భూసేకరణ సమస్యకు ఎట్టకేలకు మంత్రి తుమ్మల పరిష్కారం చూపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నవ భద్రాద్రి దిశగా తుమ్మల కృషి చేస్తున్నారు. భూ సేకరణ తరువాయి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దక్షిణ అయోధ్యగా భద్రాద్రి ఆలయ కీర్తి ధ్వనించేలా అభివృద్ధి చేయనున్నారు.

**నమూనాలు సిద్ధం...**

శ్రీరామచంద్రుడి ఆలయ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో భద్రాద్రి ఆలయం నూతన శోభ సంతరించుకొనుంది. ఆగమ పండితులు రూపొందించిన నమూనాల ప్రకారం అభివృద్ధి పనులను ప్రారంభించేలా మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ నమూనాల ప్రకారం అత్యద్భుతంగా భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణానికి అడుగులు పడనున్నాయి.

**గోదావరి పుష్కరాలు కుంభ మేళా మాదిరి ఏర్పాట్లు...**

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పై దేవాదాయ శాఖ కమీషనర్ తో చర్చించారు. పుష్కర ఏర్పాట్లపై అన్నీ శాఖలతో సన్నాహక సమావేశం నిర్వహించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.కుంభమేళా తరహాలో భద్రాచలం లో పుష్కరాల ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. దక్షిణ అయోధ్య గా భాసిల్లుతున్న భద్రాచలం రామాలయం దర్శనానికి, గోదావరి నదిలో పుష్కర స్నానానికి లక్షలాది మంది భక్తులు వస్తారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్నానాల ఘాట్లు ఏర్పాటు చేయాలని వసతి కేంద్రాలు, మెడికల్ క్యాంప్ లు శానిటేషన్, తాగునీరు, రవాణా సౌకర్యాలు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పుష్కరాల ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు. 2003, 2015 లో గోదావరి పుష్కరాలు సమయంలో మంత్రిగా ఉన్న తుమ్మల అప్పటి అనుభవాలను గుర్తు చేసారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు ప్రణాళికలు పై ఎండోమెంట్ కమీషనర్ కు మంత్రి తుమ్మల తన అనుభవాలు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచేలా ఉండాలని కోట్లాది మంది భక్తులు మెచ్చేలా పుష్కరాల ఏర్పాట్లు చేయాలని ఎండోమెంట్ కమీషనర్ హరీష్ కు మంత్రి తుమ్మల ప్రభుత్వ విధానం వివరించారు.

## ఉద్యోగులకు అండగా ప్రజా ప్రభుత్వం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం, డిసెంబర్ 31(మనం న్యూస్)ః తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా 2026 నూతన సంవత్సర క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం లో తమ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రిలకు జిల్లా కార్యవర్గ సభ్యులకు గెజిటెడ్, అధికారులకు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించడంలో ముందుంటుందని తెలియజేశారు. గెజిటెడ్ అధికారులు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాను ముందు వరుసలో ఉంచుతున్నందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులు గంగవరపు నరేందర్, మల్లెల రవీంద్ర ప్రసాద్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, మహిళ అధ్యక్ష కార్యదర్శులు జి ఉషశ్రీ, సుధారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు జీ రమేష్, కనపర్తి వెంకటేశ్వర్లు, బి.హరీష్, బి కృష్ణ, కరుణశ్రీ, ఎం సతీష్, బి రాంబాబు, జై పుష్పరాజు, వై మంజుల, బి బాలాజీ, కే విజయలక్ష్మి, ఎం గోపాలకృష్ణ, గౌస్ పాష, బి శంకర్, డి అరుణ కుమారి, బి శారద, ఎస్ భాస్కర్, గుమ్మడి మల్లయ్య, తమ్మిశెట్టి శ్రీనివాస్, ఎండి తాజుద్దీన్, కేజీబీవీ ప్రసాద్, మోదుగ వెంకటేశ్వర్లు, జె చిరంజీవి , డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘం బూరుగు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీమతి నవీన జ్యోతి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథాలయ సంఘ బాధ్యులు ప్రసాద్ బాబు, ఫణి కుమార్ మోహన్, కోపరేటివ్ డిపార్ట్మెంట్ శ్రీనివాసరావు ఏడుకొండలు అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ కరుణాశ్రీ, అరుణ కుమారి, జూనియర్ కళాశాల సంఘం బాధ్యులు తిరుపతిరావు, నాగేంద్ర బాబు, క్రిష్ణ కిరీటి, దామోదర్ పాల్గొన్నారు.

## జుజ్జులరావుపేట మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక




- హస్తం గూటికి 45 కుటుంబాలు
- మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక

కూసుమంచి, డిసెంబర్ 31(మనం న్యూస్)ః పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినా బిఆర్ఎస్కు వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. తాజాగా కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ ముఖ్య నేతలే గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. మాజీ సర్పంచ్ పడిశాల గోపి, మాజీ ఎంపీటీసీ బారి నాగేశ్వరరావు తమ అనుచర వర్గంతో కలిసి గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ బాట పట్టారు. ప్రధాన నేతల మూకుమ్మడి వలసకంచర్ల జీవన్ రెడ్డి నాయకత్వంలో గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ కార్యదర్శి శ్రీరాముల రాము, మల్లెబోయిన వీరభద్రం, పడిశాల మహేష్ సహా దాదాపు 45 కుటుంబాలు బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. గ్రామంలో ఆ పార్టీకి వెన్నెముకగా ఉన్న నేతలే ఒక్కసారిగా పార్టీ వీడటంతో జుజ్జులరావుపేటలో బిఆర్ఎస్ ఖాళీ అయినట్లయ్యింది.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే తమను కాంగ్రెస్ వైపు నడిపించాయని ఈ సందర్భంగా పడిశాల గోపి, నాగేశ్వరరావు పేర్కొన్నారు. 'ప్రజల పక్షాన నిలిచే నాయకత్వమే మాకు ముఖ్యం.. అందుకే కాంగ్రెస్లో చేరాం' అని వారు స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో పట్టున్న నాయకులు హస్తం గూటికి చేరడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొని కొత్తగా చేరిన వారికి ఆహ్వానం పలికారు.

## ఉపాధి హామీ కూలీలకు పారలు పంపిణీ




దమ్మపేట, డిసెంబర్ 31(మనం న్యూస్)ః దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం తరఫున ఇస్తున్న పారలను దమ్మపేట గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల జీవనోపాధి భద్రతను పెంచడం తో పాటు వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించే దృష్టితో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 2005 లో ప్రారంభించిన ఈ పథకం తో గ్రామీణ రోడ్లు, చెరువులు, కాలువల తవ్వకాలు, నీటి సంరక్షణ వంటి మౌలిక సదుపాయాల పనులను చేసే కార్మికులకు ఉపయోగపడే పారను కార్మికులకు ప్రభుత్వం తరపున ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు,వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, పసుమర్తి కుసుమాంబ, ధర్మసోతు పద్మ, రూపా రాంబాబు,గోళ్ళ భవాని కృష్ణ,పూనెం పోలమ్మ ,చిన్నశెట్టి నాగలక్ష్మి, చాట్ల శ్రీనివాసరావు, దాసరోజు సరిత, బద్దె వెంకట లీల, దారా రమేష్, గ్రామస్తులు అత్తులూరి వెంకటరామారావు, చిన్నశెట్టి చిట్టిబాబు, పండూరి వీరబాబు, దాసరోజు రామారావు, బద్దె రాంబాబు, చిన్నశెట్టి ముత్తు, పిట్టల శ్రీను, చిలకా శ్రీను, గొల్లపల్లి వెంకటేష్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎం రాయల హనుమంతరావు ఉద్యోగ విరమణ

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ




దమ్మపేట డిసెంబర్ 31(మనం న్యూస్) ః భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల హనుమంతరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. సుదీర్ఘ కాలం పాటు విద్యారంగానికి అంకితభావంతో సేవలందించిన హనుమంతరావు,కి గ్రామస్థులు, ఉపాధ్యాయ వర్గం ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. రాయల హనుమంతరావు,తన సేవా కాలంలో అనేక తరాల విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చారని, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారని ఎమ్మెల్యే ప్రశంసించారు. విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి వంటి అంశాలను విద్యార్థులలో నాటిన ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.పదవి విరమణ అనంతరం కూడా హనుమంతరావు,విద్యా రంగానికి తమ అనుభవాన్ని అందిస్తూ, మార్గదర్శకులుగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా రాయల హనుమంతరావు,ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఆయన సేవలను గుర్తుచేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, హనుమంతరావు ప్రధానోపా ధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పాఠశాలలో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని తెలిపారు.విద్యార్థుల హాజరు, ఫలితాలు మెరుగుపడటంతో పాటు, పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు మాట్లాడుతూ, హనుమంతరావు విద్యా సేవలతో పాటు గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్నారని,గ్రామానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గ్రామంలో ఎందరో విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించడానికి ఆయన ప్రోత్సాహం ఎంతో దోహదపడిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉమ్మడి జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



- రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల

ఖమ్మం, డిసెంబర్ 31(మనం న్యూస్)ః ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలందరికీ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2026 కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబం సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## శతాబ్ది ఉత్సవ సభకు విస్తృత ప్రచారం




- జిల్లా వ్యాప్తంగా భారీ హోర్డింగ్లు

ఖమ్మం, డిసెంబర్ 31(మనం న్యూస్)ః భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న జరగనున్న భారీ బహిరంగ సభకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామ గ్రామాన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు అమరుల పేరుతో ప్రత్యేక హోర్డింగ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశ గోడ రాత (వాల్ రైటింగ్స్)లను పూర్తి చేశారు. ఖమ్మం నగరానికి నలు మూలల నుంచి జనవరి 18న ప్రదర్శనలు వస్తుండడంతో నలువైపులా ప్రధాన రహదారులకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారుల వెంట భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. బైపాస్ రోడ్డు, వైరా రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు, బోనకల్ క్రాస్ రోడ్డు లలో ఫ్లెక్సీల ఏర్పాటు జరుగుతున్నాయి. జనవరి 18న జరిగే బహిరంగ సభ సందర్భంగా కాల్వొడ్డు -నుంచి జనసేవాదళ్ కవాత్, ప్రజా సంఘాల ప్రదర్శన బోనకల్ రోడ్డు నుంచి కళాకారుల ప్రదర్శన సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ నుంచి ప్రజా ప్రదర్శన నలువైపుల నుంచి రానుంది. బహిరంగ సభ అనంతరం రెండు రోజుల పాటు జాతీయ కౌన్సిల్ కూడా జరగనుండడంతో ఆ దిశగా కూడా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. 19, 20 తేదీలలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఖమ్మంలో జరగనుంది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాతో పాటు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, వామపక్షాలకు చెందిన దీపాంకర్ భట్టాచార్య -సహా పలువురు జాతీయ నేతలు హాజరవుతున్న నేపథ్యంలో ప్రచారానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు.

**మూడు నుంచి ప్రచార జాతా :**

శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను పురస్కరించుకుని మూడు నుంచి ఏడు వరకు ప్రచార జాతాను నిర్వహించనున్నారు. మూడవ తేదీ ఉదయం 10 గంటలకు సత్తుపల్లిలో జాతా ప్రారంభమవుతుంది. జాతాను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రారంభించనుండగా ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొననుండగా జాతాకు జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి నేతృత్వం వహించనున్నారు. సత్తుపల్లిలో ప్రారంభమై వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, వైరా మండలాల మీదుగా ఖమ్మంకు చేరుకోనుంది. ఈ జాతా మూడవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనుంది.

## టెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- జిల్లాలో టెట్ పరీక్షలకు మొత్తం 1017 మంది అభ్యర్థులు హాజరు



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 31 (మనం ప్రతినిధి): టెట్ పరీక్షలు అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలకమైన పరీక్షలు కావడంతో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో టెట్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్, అధనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యచందన, సంబంధిత శాఖల అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2026లో 4, 5, 6, 8, 9, 11, 19, 20 తేదీలలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి 11.30 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2.00 గంటల నుండి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో టెట్ పరీక్షలకు మొత్తం 1017 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని కలెక్టర్ వెల్లడించారు. టెట్ పరీక్షల నిర్వహణ నిమిత్తం జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సుజాతనగర్ మండలం అబ్దుల్ కలాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్, పాల్వంచ మండలం అనుబోస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు అబ్జర్వర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నిరంతర పర్యవేక్షణ చేపట్టే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షలు పూర్తిగా ఆన్లైన్ విధానంలో నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని కంప్యూటర్లు, నెట్వర్క్ కనెక్టివిటీ సక్రమంగా పనిచేసేలా ముందుగానే పరిశీలించాలని, సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఐటీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జనవరి 3వ తేదీన మాక్ టెస్ట్ను అబ్జర్వర్ల పర్యవేక్షణలో నిర్వహించి, అన్ని కంప్యూటర్లు సరిగా పనిచేస్తున్నాయా లేదా ధృవీకరించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ నిశితంగా పరిశీలించిన అనంతరమే అనుమతించాలని తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని, గుర్తింపు కార్డు పరిశీలించిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులకు పరీక్షా హాల్ వివరాలు సులభంగా తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, శౌచాలయాలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. దివ్యాంగ అభ్యర్థులకు అవసరమైన సహాయకులను నియమించాలని సూచించారు. పరీక్షల సమయంలో మెడికల్ క్యాంపులు సిద్ధం చేసి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ముందుగానే జనరేటర్లు, ఇన్వర్టర్లు అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి ముందే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకోవాలని, పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే గేట్లు మూసివేయాలని తెలిపారు. ఒకసారి గేట్లు మూసిన తరువాత ఎవరికీ లోపలికి అనుమతి ఉండదని, అలాగే పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవరినీ బయటకు అనుమతించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేదా లోపాలు తలెత్తితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెట్ పరీక్షలు ప్రశాంతంగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించే దిశగా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అనుబోస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, అబ్దుల్ కలాం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దయాకర్ రావు, అబ్జర్వర్లు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంగపేట -ఏటునాగారం ప్రధాన రహదారికి మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి

- బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి



**ములుగు, డిసెంబర్ 31, మనం ప్రతినిధి,:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా కూడా మంత్రి సీతక్క ఏటూరునాగారం నుండి - మంగపేట కు వచ్చే ప్రతిసారి అదే రహదారి మీదుగా వస్తున్న కూడా ఆమె కంటికి రహదారిపై ఉన్న గుంతలు కనపడడం లేదా, మంత్రి అయి రెండు సంవత్సరాలైనా కూడా ఈ ప్రధాన రహదారులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటు ములుగు నియోజకవర్గంలోని అతి పెద్ద మండలం అయినా మంగపేట మండలానికి జిల్లా కేంద్రానికి కలిపే ప్రధాన రహదారి ఇదే కావడం ఈ రహదారి వెంబడి ప్రజలందరూ జిల్లా కేంద్రంలోని మరియు వివిధ పనులకు గాని హాస్పటల్ కు వెళ్లేటప్పుడు ప్రజలు నరకయాతన పడుతున్నారు, ఈ గుంతలలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోయి యాక్సిడెంట్లు అవుతున్నాయి అయినా కూడా మంత్రి సీతక్క అతిపెద్ద మండలానికి ఏకైక రహదారిగా ఉన్న ఈ రోడ్లు మరమ్మత్తులు చేయకపోవడం సరైన చర్య కాదు , నియోజకవర్గాన్ని విపరీతంగా అభివృద్ధి చేస్తున్నాము అని చెప్పుకుంటున్న మంత్రి కి ఈ రోడ్డు మీదుగా వస్తున్నా తనకు గుంతలు కనపడడం లేదా, అభివృద్ధి చేస్తున్నాము అని చెప్పుకునే మంత్రి సీతక్క ఒక పెద్ద మండలన్ని జిల్లా కేంద్రానికి కలిపే అతి ప్రధానమైన రహదారిని మరమ్మతులు చేసే పరిస్థితి లేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు, మీరు చేస్తున్న అభివృద్ధి ఎక్కడ ఉంది, అతి పెద్ద మండలాన్ని జిల్లా కేంద్రాన్ని కలిపే అతి ప్రధానమైన రహదారిని మరమ్మత్తులు చేయలేని మీరు ములుగు నియోజకవర్గన్ని అభివృద్ధి చేశామంటే అంటే ప్రజలు నమ్ముతారా?, మరో 20 రోజులలో ఆసియా ఖండంలో అతిపెద్ద మహా జాతర ప్రారంభం కాబోతున్న తరుణంలో, లక్షలాది మంది ప్రజలు, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్, మరియు చత్తిస్గడ్ ఈ రహదారి మీదుగా లక్షలాది మంది భక్తులు ఆ తల్లుల దర్శనానికి వస్తుంటారు, ఇంత ప్రాధాన్యత కలిగిన రహదారునికి ఇప్పటివరకు మరమ్మత్తులు చేయకపోవడం అంక్షేపణ ( ఆశ్చర్యా), మహా జాతరకు 150 కోట్లు నిధులు మంజూరు చేశామని చెప్పుకునే మీరు పది కిలోమీటర్ల ప్రధాన రహదారికి మరమ్మతులు చేయకపోవడం సరైన చర్య కాదు,ఇప్పటికైనా మంత్రి సీతక్క స్పందించి మంగపేట మండల ప్రజల దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఈ రోడ్డును మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని, నిధులు మంజూరు అంటే రోడ్డు పాడైన అక్కడక్కడ రోడ్డు వేయడం కాదు , కమలాపురం నుండి ఏటురునాగరం వరకు ఒక లేయర్ బీట్ మంజూరు చేసి, నిధులు విడుదల చేసి వెంటనే పనులు చేపట్టాలి లేని పక్షంలో మంగపేట మండల ప్రజలతో కలిసి రోడ్డు మరమ్మత్తులు చేసే వరకు ఆందోళన చేయడానికి కూడా వెనకాడమని అన్నారు, ఈ కార్యక్రమంమండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరెం సంతోష్,కమలాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు తుక్కని శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు , పప్పు వెంకట్ రెడ్డి చిలకమర్రి రాజేందర్, చీకుర్తి సుధాకర్, పబ్బోజు సత్యనారాయణ, గాదె శ్రీనివాస్ చారి , యాదండ్ల రాజయ్య,చల్లగురుగుల తిరుపతి, పగడాల వెంకట్ రెడ్డి , పంజాల సత్యం, గంగుల శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉడుగుల శ్రీనివాస్, మునిగేలా సాంబులు, సోషల్ మీడియా మండల ఇంచార్జ్ గుడివాడ శ్రీహరి, యూత్ నాయకులు ముప్పారాపు సందీప్ , కమలాపురం గ్రామ సోషల్ మీడియా ఇంచార్జ్ బీస సాంబయ్య, కొత్త మల్లూర్ గ్రామ సోషల్ ఇంచార్జ్ మునిగేలా నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సాలార్ నగర్ ' భూ ఆధార్' సర్వే పైలట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయండి



- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్, 31డిసెంబర్, (మనం బ్యూరో):** మహబూబ్నగర్ జిల్లా గండీడ్ మండలం సాలార్ నగర్ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ' భూ ఆధార్' సర్వే పైలట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామంలోని ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి వివరాలను స్పష్టమైన సరిహద్దులతో పాటు ఖచ్చితమైన అక్షాంశాలు, రేఖాంశాలతో గుర్తించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూ సర్వే పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, సర్వే పనులను వేగవంతం చేయాలని, అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలు లేదా అభ్యంతరాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఈ. నవీన్, అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్ సర్వే అశోక్, తహసీల్దార్లు, సర్వేయర్లు, తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

## బోయపల్లి సురేందర్ గౌడ్ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**చండూరు డిసెంబర్ 31( మనం న్యూస్)** బుధవారం చండూరు మున్సిపల్ కేంద్రంలో అంగడిపేట ఫంక్షన్ హాల్లో నల్లగొండ జిల్లా బిగ్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి బోయపల్లి సురేందర్ గౌడ్ దశదిన కర్మలో... రాష్ట్ర భారీ నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి పాల్గొని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని



భగవంతుణ్ణి పార్థిస్తూ వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన...కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి.

## కావాలనే నన్ను



- హాదీ హత్య నిందితుల వీడియో

**ఢాకా, డిసెంబర్ 31 :** విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ఫైసల్ కరీమ్ మసూద్, ఆలంగీర్ షేక్లను బంగ్లాదేశ్ పోలీసులు అనుమానితులుగా గుర్తించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫైసల్ దుబాయ్ లో ఉన్నట్లు వెల్లడైంది. ఈ హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ అతడు ఓ వీడియోను విడుదల చేశాడు. వీడియోలో ఫైసల్ మాట్లాడుతూ.. తనను కావాలనే ఈ కేసులో ఇరికించారని ఆరోపించాడు. దీని నుంచి తనని తాను రక్షించుకునేందుకు దుబాయికి వెళ్లిపోయినట్లు తెలిపాడు. జమాతే ఇస్లామీ పార్టీ విద్యార్థి విభాగానికి చెందిన వ్యక్తులకు ఇందులో ప్రమేయం ఉందని ఆరోపించాడు. ఈ సందర్భంగా హాదీతో తనకు వ్యాపార సంబంధాలు మాత్రమే ఉన్నాయని తెలిపాడు. ప్రభుత్వ కాంట్రాక్టు దక్కించుకోవడం కోసం హాదీ రాజకీయ కార్యకలాపాలకు తాను విరాళాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. డిసెంబరు 12న హాదీపై దాడి తర్వాత అనుమానితులు దేశం విడిచి పారిపోయారని బంగ్లాదేశ్ పోలీసులు పేర్కొన్న సంగతి తెలిసిందే. వాళ్లు ప్రస్తుతం భారత్లో ఉన్నారంటూ ఇటీవల ఢాకా మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు. అయితే, వీటిని భారత భద్రతాధికారులు ఖండించారు. అంతర్జాతీయ సరిహద్దు దాటి ఎవరూ భారత్లోకి వచ్చినట్లు ఆధారాలు లేవని బీఎస్ఎఫ్ అధికారులు, మేఘాలయ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు పొరుగుదేశం ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఇక, ఈ కేసు విచారణను ఢాకా పోలీసులు వేగవంతం చేశారు. ఈ హత్యకు సంబంధించి అనేక మంది అనుమానితులను అరెస్టు చేస్తున్నారు. నిందితులు పారిపోయేందుకు సాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరిని రిమాండ్ కు తరలించారు.

## ఆగ్రో రైతు సేవ కేంద్రం లో వ్యవసాయ అధికారులు తనఖీలు



**మహబూబ్ నగర్, 31డిసెంబర్, (మనం బ్యూరో):** రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం సంయుక్త సంచాలకులు, మహబూబ్ నగర్ జిల్లా నోడల్ అధికారి బాలు నాయక్ జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేష్ బుధవారం జడ్చర్ల మండలం బాదేపల్లి లోని ఆగ్రో రైతు సేవ కేంద్రం 2 ను తనిఖీ చేశారు.ఆగ్రో రైతు సేవ కేంద్రంలో యూరియా కొనుగోలు వివరాలను, యూరియా బుకింగ్ విధానంను రైతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కలిగించారు. రైతులతో మాట్లాడుతూ యూరియా ను వృధా చేయొద్దు అని పంటలకు వేసేటప్పుడు మొక్క దగ్గర యూరియా వేసిన తర్వాత మట్టి కప్పినట్లు అయితే యూరియా ను మొక్క బాగా తీసుకుంటుందని తెలిపారు. అలాగే రైతులకు అవసరం కి మించి యూరియా వాడకూడదు, అవసరం మేరకు కొనుగోలు చేయాలని తెలిపారు జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 17610 మంది రైతులు నేటివరకు 52545 యూరియా బ్యాగ్స్ ను ఆన్లైన్ లో బుక్ చేసుకోవడం జరిగిందని వివరించారు అందులో 46193 బ్యాగ్స్ రైతులు కొనుగోలు చేయడం కూడా జరిగింది. ఇంకను 26220 యూరియా బస్తాలు యాప్ లో కొనుగోలు సిద్ధంగా ఉన్నాయి అని తెలియచేశారు కావున రైతులు యూరియా విషయం లో ఎటువంటి ఆందోళన చెంద కుండా యూరియా బుకింగ్ యాప్ ద్వారా కొనుగోలు చేయవలసిందిగా సూచించడం జరిగింది. యూరియా కొనుగోలు కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా వారి యొక్క ఆధార్ కార్డు, పాట్టా పాస్ పుస్తకం తీసుకుని వెళ్ళగలరు అని సూచించారు.

## ఈడీ సోదాలు.. కట్టలకొద్దీ నగదు

**ఢిల్లీ, డిసెంబర్ 31 :** మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఢిల్లీలోని ఓ ఇంట్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆభరణాలు లభ్యమయ్యాయి. ఓ సూట్ కేసులోనే రూ.8.80 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు ఉండటం గమనార్హం. వీటితోపాటు రూ.కోట్లాది విలువైన ఆస్తులకు సంబంధించిన దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. హరియాణాకు చెందిన ఇందర్జిత్ సింగ్ యాదవ్ పలు కేసుల్లో నిందితుడు. యూఏఈ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న అతడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 30న దిల్లీలోని సర్వప్రియా విహార్లో ఉన్న ఇందర్జిత్ సన్నిహితుడి నివాసంలో ఈడీ సోదాలు మొదలుపెట్టింది. భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు గుర్తించింది.

**మహారాష్ట్ర నూతన డీజీపీగా '26/11 హీరో'**

బుధవారం ఉదయం బ్యాంకు అధికారులను రప్పించి.. మెషిన్లతో నగదు లెక్కింపు మొదలుపెట్టారు. ఇప్పటివరకు రూ.5.12 కోట్ల నగదు లెక్కించగా.. సూట్కేసులో రూ.8.80 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు ఉన్నట్లు అంచనా వేశారు. మరో బ్యాగులో చెక్ బుక్కు, రూ.35 కోట్ల విలువైన ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దోపిడీ, ప్రైవేటు ఫైనాన్సర్ల కోసం సెటిల్మెంట్లు, బెదిరింపు చర్యలకు సంబంధించి ఇందర్జిత్ యాదవ్పై హరియాణా, ఉత్తర్ప్రదేశ్ పోలీసులు 14 ఎఫ్ఐఆర్లు నమోదు చేశారు. దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ.. ఆయా రాష్ట్రాల్లో పది చోట్ల ఇటీవల సోదాలు నిర్వహించింది. బెదిరింపు, అక్రమ కార్యకలాపాలతో వచ్చిన డబ్బుతో ఇందర్జిత్ ఖరీదైన భవనాలు, లగ్జరీ కార్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు.

## రిపబ్లిక్ డే కవాతులో జంతువుల ప్రదర్శన

**ఢిల్లీ, డిసెంబర్ 31 :** ఢిల్లీలోని కర్తవ్యపథ్లో వచ్చే ఏడాది జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కవాతులో ఈసారి ఓ అరుదైన కంటింజెంట్ చేరనుంది. గణతంత్ర దినోత్సవ పరేడ్లో తొలిసారిగా యానిమల్ కంటింజెంట్ను తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రీమౌంట్ అండ్ వెటర్నరీ కారప్స్ విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నామని అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత కోసం సైనికులు ఉపయోగించే బ్యాక్ట్రియన్ జాతికి చెందిన రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు డేగలు, పది స్వదేశీ జాతి ఆర్మీకి చెందిన జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ బృందంలో ఉన్నాయి.



## తెలంగాణ జర్నలిస్టు సమాజం పక్షాన అసెంబ్లీ వేదికపై చర్చించండి

**ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 252 జీవోను సవరించాలని డిమాండ్ చేయండి**

**మాజీ మంత్రివర్యులు కేటీఆర్ కు జర్నలిస్టుల జిల్లా సంఘం వినతి పత్రం అందజేత**



**రాజన్నసిరిసిల్ల,డిసెంబర్31(మనం న్యూస్):** జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో సవరణలు చేసే విధంగా చొరవ చూపాలని సిరిసిల్ల శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు కేటి రామారావు కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే హెచ్ 143) విజ్ఞప్తి చేశారు . బుధవారం టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్లో కేటీఆర్ ను కలిసి జీవో ను సవరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. వినతి పత్రం స్వీకరించిన కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ జర్నలిస్టుల పక్షాన నిలబడతామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం జర్నలిస్టుల నూతన అక్రిడిటేషన్ల జారీ కోసం జీవో 252 తీసుకురావడం జరిగిందనీ అయితే ఈ జీవోలోని కొన్ని ఇబ్బందికర నిబంధనలతో ఇప్పటి వరకు అక్రిడిటేషన్లు కలిగిన దాదాపు 10 వేల మందికి నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు.డెస్క్ జర్నలిస్టులు, ఫీల్ జర్నలిస్ట్ అన్న తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన అక్రిడిటేషన్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా టెంజు అధ్యక్షుడు ఇరుకుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు సామల గట్టు, మహమ్మద్ అజీమ్, అందే దేవేందర్, ప్రవీణ్ సయ్యద్ కలీం, సల్మాన్ ,ఫహద్ పాషా లు పాల్గొన్నారు.

## తెలంగాణ పర్యాటక రంగానికి మహర్దశ

- రూ. 22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు
- సుమారు 90,000 ఉద్యోగాల సృష్టి
- పర్యాటకుల భద్రతే ధ్యేయంగా 'టూరిస్ట్ పోలీస్' అద్భుత సేవలు
- తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030 ద్వారా సమగ్ర అభివృద్ధి
- 2025 విజయాలను, 2026 లక్ష్యాలను వెల్లడించిన పర్యాటక శాఖ

**హైదరాబాద్, డిసెంబర్ 31:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశంలో తెలంగాణ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పర్యాటక శాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 2025 సంవత్సరంలో పర్యాటక శాఖ సాధించిన ప్రగతిని, 2026 లో సాధించబోయే లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలను ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

**ప్రధాన విజయాలు - 2025..**

ఎకో (పర్యావరణ), మెడికల్ (వైద్య), హెరిటేజ్ (వారసత్వ), స్పిరిచ్వల్ (ఆధ్యాత్మిక), రూరల్ అండ్ ట్రైబల్ (గ్రామీణ, గిరిజన), సినిమా, వెడ్డింగ్ డెస్టినేషన్, స్పోర్ట్స్ టూరిజంపై దృష్టి సారించి 'తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030' ని అమలులోకి తెచ్చామని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను (ఖీఖీఅట) అభివృద్ధిని వివరించారు. టూరిజం కాంక్లేవ్ 2025 ద్వారా 30 ప్రాజెక్టులకు గాన్సూ15,279 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి, తద్వారా సుమారు 50,000 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా మర్ో7,045 కోట్ల పెట్టుబడులు, 40,000 ఉద్యోగాల సృష్టి జరగనుంది. ముఖ్యంగా ఫుడ్లింక్ గ్లోబల్ సెంటర్(3,000 కోట్లు), సారస్ ఇన్ఫ్రా(1,000 కోట్లు), స్మార్ట్ మొబిలిటీ(1,000 కోట్లు) వంటి సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చాయిని చెప్పారు. పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి సరికొత్త పథాన దూసుకెళ్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 123 ప్రాజెక్టులలో ఇప్పటికే 78 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయి. దీనికి అదనంగా, కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశ్ దర్శన్ 2.0 మరియు ప్రసాద్ (ఖఖఅఖిఏఅ) కింద రూ. 275 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అనంతగిరి కొండల్లో 'ఎకో-టూరిజం జోన్స , భువనగిరి కోట వద్ద 'ఎక్స్పీరియెన్షియల్ జోన్'ను తీర్చిదిద్దుతున్నారు. అలాగే, జల పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ హుస్సేన్ సాగర్లో 120 మంది ప్రయాణించగల 'ముచుకుంద' అనే డబుల్ డెక్కర్ బోటును పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చింది. ప్రపంచ సుందరీ వేడుకలు హైదరాబాద్ను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపడమే కాకుండా, 110 దేశాల నుండి వచ్చిన సుందరీమణులు 'పర్యాటక రాయబారులుగా' మారి మన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేశారు. ఇది హైదరాబాద్ను కేవలం పెట్టుబడులకే కాకుండా, వ్యాపారానికి 'సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రంగా' నిరూపించిందని ఉద్ఘాటించారు. బతుకమ్మ పండుగను ప్రపంచ వేదికపై నిలబెడుతూ.. అతిపెద్ద బతుకమ్మ (19.44 మీటర్లు), 1,354 మంది మహిళలతో అతిపెద్ద జానపద నృత్యం ప్రదర్శించి సెప్టెంబర్ 29, 2025న రెండు గిన్నిస్ రికార్డులు సాధించామని సగర్వంగా ప్రకటించారు పర్యాటకుల భద్రత కోసం 80 మంది ప్రత్యేక శిక్షణ పొందిన అధికారులతో అక్టోబర్ 13, 2025న ప్రారంభించిన 'టూరిస్ట్ పోలీస్' వ్యవస్థ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందన్నారు

పర్యాటకుల సౌకర్యార్థం యూనిఫైడ్ ఆన్లైన్ పోర్టల్, డిజిటల్ ట్రావెల్ కార్డులు వంటి వినూత్న సేవలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

**2026 లక్ష్యాలు:**

రాబోయే 2026 సంవత్సరానికి గానూ పర్యాటక శాఖ స్పష్టమైన ప్రణాళిక వివరాలను ప్రకటించింది: హైదరాబాద్ - సోమశిల - శ్రీశైలం సర్క్యూట్లో హెలీ టూరిజం సేవలను పూర్తిస్థాయిలో హెలీ టూరిజం అందుబాటులోకి తేవడం. నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ వంటి ప్రాంతాలను అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్లుగా అభివృద్ధి చేయడం. నాగార్జున సాగర్, బస్వాపూర్, సోమశిలలో కొత్త వెడ్డింగ్ డెస్టినేషన్ల అభివృద్ధి మెడికల్ టూరిజం సొసైటీని స్థాపించి, హైదరాబాద్ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్గా తీర్చిదిద్దడం. జనవరి 13, 14, 15న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ షోలను నిర్వహించడం. 19 దేశాల నుండి 40 మంది అంతర్జాతీయ, 55 మంది జాతీయ కైట్ ప్లేయర్స్ భాగస్వాములు కానున్నారు. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ 2026: జనవరి 16-18 వరకు ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన.

డ్రోన్ షో 2026: గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 13, 14న హైటెక్ డ్రోన్లతో వినూత్న ప్రదర్శన

జాతీయ-అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి.

తెలంగాణ పర్యాటక రంగం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించే వనరుగా మారుతోందని ఆశాఖ అధికారులు స్పష్టం చేశారు.

# స్టీల్ దిగుమతులపై భారత్ టారిఫ్‌ల పెంపు



- చైనా ఉత్పత్తులే టార్గెట్.. !

**ఢిల్లీ, డిసెంబర్ 31 :** చైనా నుంచి దిగుమతి అవుతున్న చౌక అయిన ఉత్పత్తులకు అడ్డుకట్ట వేసేందుకు భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోకి దిగుమతయ్యే కొన్ని రకాల స్టీల్ ఉత్పత్తులపై 12 శాతం టారిఫ్‌లు విధించింది. ఇది మూడేళ్ల పాటు అమలులో ఉండనుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రకటన ప్రకారం.. తొలి సంవత్సరంలో ఈ సుంకం 12 శాతంగా ఉండనుంది. రెండో ఏడాదికి గాను అది 11.5 శాతానికి తగ్గగా.. మూడో ఏడాదిలో 11 శాతంగా ఉండనుంది. ప్రపంచంలో అతిపెద్ద ఉక్కు ఉత్పత్తుల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. చైనా నుంచి తక్కువ ధరలకే ఉక్కు వస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. దీనివల్ల దేశీయ ఉక్కు తయారీదారులపై కూడా ప్రభావం పడుతుండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల దిగుమతులకు దీనినుంచి ఉపశమనం కల్పించింది. చైనా, వియత్నాం, నేపాల్ దేశాలకు ఈ సుంకాలు వర్తించనున్నాయి. స్టెయిన్లెస్ స్టీల్ వంటి ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులకు కూడా ఇది వర్తిస్తుంది. ఇటీవల స్టీల్ దిగుమతులు గణనీయంగా పెరిగిపోవడంతో.. దేశీయ పరిశ్రమలకు తీవ్ర నష్టం కలుగుతోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ తెలిపింది. ఈ క్రమంలోనే మూడేళ్లపాటు సుంకాల విధింపునకు సిఫార్సు చేసింది. దాని ప్రకారమే తాజాగా భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక, ఈ ఏడాది ఏప్రిల్లోనే భారత్‌కు విదేశాల నుంచి వచ్చే అన్ని దిగుమతులపై 12 శాతం తాత్కాలిక సుంకం విధించింది. 200 రోజులకు గాను విధించిన ఈ సుంకాలు గత నెలలోనే ముగిశాయి.

## ఎస్ఎస్ఎల్వీ మూడో స్టేజ్ పరీక్ష విజయవంతం



**శ్రీహరికోట, డిసెంబర్ 31 :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మూడో దశను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో మంగళవారం ఈ ప్రయోగం నిర్వహించింది. మూడు-దశల ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ పనితీరును విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలోకి చిన్న ఉపగ్రహాలను వేగంగా ప్రయోగించడం కోసం దీనిని రూపొందించారు. అధిక స్థాయిలో ఉత్పత్తికి కూడా ఇది అనుకూలంగా ఉంటుంది. పేలోడ్కు సెకనుకు 4 కి.మీ వేగాన్ని అందించడంలో ఎస్ఎస్-3 కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. పేలోడ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. ప్రస్తుతం చేసిన అప్‌గ్రేడ్‌లు ఈ దశలో మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్ ఉపగ్రహాల సామర్థ్యం, నిర్మాణాత్మక దృఢత్వాన్ని పెంచినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఒత్తిడి, థ్రస్ట్, ఉష్ణోగ్రత, వైబ్రేషన్, యాక్యుయేటర్ పనితీరు వంటి విషయాలను పరిశీలించినట్లు తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండించిన యూకే



**లండన్, డిసెంబర్ 31 :** బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా కొనసాగుతోన్న దాడుల పై యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీలైన దీపూ చంద్రదాస్, అమృత్ మండల్, బజేంద్ర బిశ్వాస్‌ల హత్యలను ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. దీపూ హత్య కేసులో బంగ్లాదేశ్ పోలీసులు ఇప్పటికే 12 మందిని అరెస్టు చేయడాన్ని ఆ దేశంలో అన్నివర్గాల భద్రతకు ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల మత స్వేచ్ఛ, విశ్వాసాలను కాపాడటానికి యూకే ప్రభుత్వం కట్టుబడి ఉందని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. నవంబర్‌లో తమ మంత్రి జెన్నీ చాప్మన్ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధాని యూనస్‌ను కలిసిన సమయంలో కూడా బంగ్లాలో మైనారిటీల రక్షణ అంశాన్ని లేవనెత్తినట్లు తెలిపారు. పౌర, మానవ హక్కులను రక్షించడంలో.. అవినీతిని ఎదుర్కోవడంలో బంగ్లాదేశ్‌కు బ్రిటన్ మద్దతు కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు.

బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న అల్లర్ల వేళ ఒక వర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణలతో ఇటీవల 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే హిందూ వ్యక్తిపై అల్లరిమూకలు దాడి చేసి, హత్య చేశాయి. మరో ఘటనలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో అమృత్ మండల్ అనే మైనారిటీ వ్యక్తిని గ్రామస్థులు కొట్టి చంపారు. మంగళవారం బజేంద్ర బిశ్వాస్ అనే మరో హిందువుని అతడి సహోద్యోగి తుపాకీతో కాల్చి చంపాడు. హిందువులపై వరుసగా జరుగుతున్న దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

## ఉక్రెయిన్లో బఫర్ జోన్ విస్తరణకు పుతిన్ ఆదేశాలు

### రష్యా జనరల్ వాలేరి గెరసిమోవ్



**మాస్కో, డిసెంబర్ 31 :** కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భారీగా విరుచుకుపడుతున్న రష్యా తాజాగా ఆ దేశంపై మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఉక్రెయిన్‌కు చెందిన భూభాగాన్ని మరింత ఆక్రమించుకోవడానికి చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాదిలో ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ పెంచమని తమ దేశాధ్యక్షుడు పుతిన్ ఆదేశించినట్లు రష్యా జనరల్ వాలేరి గెరసిమోవ్ వెల్లడించారు. దీంతో రష్యా దళాలు సుమీ, ఖర్కీవ్ ప్రాంతాల్లోని గ్రామాలను ఆక్రమించుకుంటూ మరింత ముందుకుసాగడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ఇటీవల పుతిన్ ఇంటిపై డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిన వేళ ఈ ఆదేశాలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా రష్యా జనరల్ వాలేరి గెరసిమోవ్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

సరిహద్దుల్లో ఉక్రెయిన్ చొరబాట్లకు అవకాశం ఉండటంతో సరిహద్దుల వెంబడి 'భద్రతా బఫర్ జోన్'ను ఏర్పాటుచేయాలని గతంలో పుతిన్ తమ సైన్యాన్ని ఆదేశించారు. కానీ ఆ జోన్ ఎక్కడివరకు ఉంటుందనే విషయంపై అధికారులకు స్పష్టతనివ్వలేదు. అనంతరం ఉక్రెయిన్ ఈశాన్య సుమీ ప్రాంతంలోని నాలుగు సరిహద్దు గ్రామాలను మాస్కో సీజ్ చేసింది. తాజాగా ఇచ్చిన ఆదేశాల్లో సరిహద్దుల్లోని బఫర్ జోన్లను మరింత విస్తరించాలని పుతిన్ సూచించడం గమనార్హం. మరోవైపు ఇరుదేశాల మధ్య శాంతిఒప్పంద చర్చలు జరుగుతున్నా కీవ్-మాస్కో దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. ఇటీవల ఉక్రెయిన్ మొత్తం 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను రష్యాపై ప్రయోగించినట్లు ఉక్రెయిన్ విదేశాంగశాఖ మంత్రి లవ్రోవ్ తెలిపారు.



## చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోంది

- కాంగ్రెస్‌పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్

**ఢిల్లీ, డిసెంబర్ 31 :** భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల నివారణకు తామే మధ్యవర్తిత్వం నడిపామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన ప్రకటనను భారత ప్రభుత్వ వర్గాలు ఖండించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ కాంగ్రెస్ స్పందించింది. చైనా ప్రకటన ఆందోళన కలిగిస్తోందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణలను తానే ఆపానని చాలాసార్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. పలు అంతర్జాతీయ వేదికలపై ఇప్పటివరకు 65 సార్లు ఆ మాట అన్నారు. అయినా ప్రధాని మోదీ మాత్రం మౌనం వీడటం లేదు. ఇక ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి అదే ప్రకటన చేశారు. ఇవన్నీ ఆందోళనకర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి'' జైరాం రమేశ్ పేర్కొన్నారు.

## 'స్వచ్ఛనగరం'లో కలుషిత జలాల కాటు

### ఏడుగురు మృతి!



**ఇండోర్, డిసెంబర్ 31 :** దేశంలోనే స్వచ్ఛ నగరంగా పేరొందిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత జలాలు ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారాయి. మురుగు కలిసిన నీళ్లు తాగడంతో డయేరియా, వాంతుల బారిన పడి నగరంలో ఇప్పటివరకు ఏడుగురు మృతి చెందారు. మేయర్ పుష్యమిత్ర భార్గవ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. భాగీరథ్ పుర ప్రాంతంలో లీకేజీ కారణంగా మురుగునీరు తాగునీటి పైప్‌లైన్‌లోకి ప్రవేశించినట్లు ప్రాథమికంగా తేలిందని చెప్పారు. మరో 149 మంది బాధితులు నగరంలోని 27 ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

కలుషిత జలాలతో గత వారం రోజుల్లో 1,100 మందికిపైగా అస్వస్థత పాలైనట్లు అంచనా. ఈ వ్యవధిలో ఆరుగురు మహిళలు సహా ఎనిమిది మంది మృతి చెందారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. చికిత్స పొందుతున్నవారి ఆస్పత్రి ఖర్చులు భరిస్తామన్నారు. సీఎం ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఓ జోనల్ అధికారి, ఓ సహాయ ఇంజినీర్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఓ ఇన్‌చార్జ్ సబ్-ఇంజినీర్‌పైనా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

భాగీరథ్‌పురలోని నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్‌లో ఒక చోట లీకేజీ బయటపడిందని, దాని కారణంగానే నీళ్లు కలుషితమై ఉండొచ్చని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. కలుషిత జలాల వ్యవహారంలో అధికారుల వైపు నుంచి లోపాలు ఉన్నాయని రాష్ట్ర మంత్రి కైలాష్ విజయవర్గీయ అంగీకరించారు. దోషులుగా తేలిన వారిని వదిలిపెట్టబోమన్నారు.

## హిజాబ్ వివాదం..

### విధుల్లో చేరని డాక్టర్ నుస్రత్ పర్వీన్



**పాట్నా, డిసెంబర్ 31 :** ఇటీవల బిహార్‌లో జరిగిన ఉద్యోగ నియామక పత్రాల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఓ వైద్యురాలి హిజాబ్‌ను తొలగించడంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఆ ఘటనతో ఇబ్బందిపడిన వైద్యురాలు నుస్రత్ పర్వీన్ ఇంకా విధుల్లో చేరలేదని స్థానిక అధికారులు వెల్లడించారు. నియామక పత్రాలు అందుకున్న వైద్యులు పోస్టింగ్‌లో చేరడానికి ఇచ్చిన డెడ్‌లైన్ నేటితో ముగుస్తుందని.. సబల్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధుల్లో చేరాల్సిన ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదని అధికారులు వెల్లడించారు. ఈ రోజు రిపోర్టు చేయకపోతే ఆమె అపాయింట్‌మెంట్‌ను రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. కాగా హిజాబ్ వివాదం తర్వాత పర్వీన్ కుటుంబం పట్నా నుంచి కోల్‌కతాకు మారినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇటీవల పాట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో నుస్రత్ పర్వీన్ అనే వైద్యురాలికి నీతీశ్ ఆయుష్ సర్టిఫికెట్‌ను అందజేశారు. సర్టిఫికెట్‌ను చేతికిచ్చిన ఆయన.. డాక్టర్ ముఖంపై ఉన్న హిజాబ్‌ను కొంతమేర తొలగించారు. సీఎం చర్యకు మహిళ స్పందించనప్పటికీ.. నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది. ఈ వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. ఈ ఘటనపై పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు నీతీశ్ చర్యను తీవ్రంగా ఖండించారు.

## వేతనం ఆధారంగా హెచ్-1బీ!




**వాషింగ్టన్, డిసెంబర్ 31:** వత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియలో కీలక మార్పులు చేపట్టాలని నిర్ణయించిన అమెరికా.. అందుకు సంబంధించిన నిబంధనలను తాజాగా ప్రకటించింది. ఈ మేరకు వీసా కేటాయింపుల విధి విధానాలను యూఎస్ సిటిజన్షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్.. ఫెడరల్ రిజిస్టర్లో ప్రచురించింది. ఈ కొత్త పద్ధతి వచ్చే ఏడాది ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి రానుంది. 2027 ఆర్థిక సంవత్సరం హెచ్-1బీ క్యాప్ రిజిస్ట్రేషన్ సీజన్‌కు ఇది వర్తించనుంది.

ఈ కొత్త విధానంలో ఇప్పుడు ఉన్నట్లుగా ర్యాండమ్‌గా హెచ్-1బీ వీసాలు జారీ చేయరు. అత్యధిక వేతనాలు, అధిక నైపుణ్యాలు ఉన్న వ్యక్తులకు వీసా పొందే అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. ఇక, తక్కువ జీతం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు వీసా ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

ఈ కొత్త పద్ధతి కోసం హెచ్-1బీ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను అమెరికా కార్మిక శాఖ క్రమబద్ధీకరించింది. నాలుగంచెల వేతన వ్యవస్థగా విభజించింది. ఎంట్రీ లెవల్ వర్కర్లను లెవల్-1గా.. నైపుణ్యం కలిగిన ఉద్యోగులను లెవల్-4గా పరిగణించింది. ఇందులో ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు ఇప్పటిలాగే ర్యాండమ్ విధానంలో లాటరీ తీయనున్నారు. మిగతా వారికి మాత్రం వారి వేతన స్థాయి ఆధారంగా లాటరీలో ఎక్కువ అవకాశాలు లభిస్తాయి.

అత్యధిక వేతనం కలిగిన లెవల్-4 ఉద్యోగులకు నాలుగు సార్లు లాటరీలోకి ప్రవేశించే వీలు ఉంటుంది. అంటే.. వారు వీసాలకు ఎంపికయ్యే అవకాశం 61 శాతం ఉంటుంది.

లెవల్-3 ఉద్యోగులు మూడుసార్లు లాటరీలోకి వెళ్లొచ్చు. దీంతో వీరికి వీసాలు పొందే అవకాశం 46 శాతం లభిస్తుంది. లెవల్-2 ఉద్యోగులు రెండు సార్లు లాటరీలోకి ప్రవేశించే వీలు ఉంటుంది. వీసాలు లభించే ఛాన్స్ 31 శాతంగా ఉండనుంది. ఇక, లెవల్-1 ఉద్యోగులు ఒకేసారి లాటరీలో ఉంటారు. దీంతో గతంతో పోలిస్తే ఇప్పుడు వీరికి వీసా లభించే ఛాన్స్ 15 శాతం తగ్గనుంది.

ఇదిలాఉండగా.. అమెరికా అనుసరిస్తోన్న కఠిన విధానాలతో వలసదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోషల్ మీడియా వెట్టింగ్, ఇతరత్రా నిబంధనలతో ఇప్పటికే హెచ్-1బీ, హెచ్-4 వీసా అపాయింట్‌మెంట్లు ఆలస్యమవుతుండటంతో భారతీయుల పరిస్థితి గందరగోళంగా మారింది. ఈ పరిణామాల వేళ భారత్‌లోని అమెరికా ఎంబసీ కీలక సూచనలు చేసింది. అగ్రరాజ్య చట్టాలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించింది. అక్రమ వలసలు అడ్డుకోవడానికి, తమ సరిహద్దులను, పౌరులను రక్షించుకోవడానికి ట్రంప్ యంత్రాంగం కట్టుబడి ఉన్నట్లు తెలిపింది.

## ట్రక్ డ్రైవర్ల లైసెన్స్‌పై వెనక్కి తగ్గిన కాలిఫోర్నియా



**కాలిఫోర్నియా, డిసెంబర్ 31 :** ప్రవాస డ్రైవర్లకు ఇచ్చిన వేలాది లైసెన్సు రద్దు విషయంలో అమెరికాలోని కాలిఫోర్నియా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌ల వ్యవహారంలో వలసదారుల సంఘాలు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మార్చి వరకు వాటి రద్దును నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. చట్టబద్ధంగా ఇప్పటికే లైసెన్స్‌లు పొందినవారు అప్పటివరకు వాటిని కొనసాగించొచ్చని వెల్లడించింది.

లైసెన్స్ గడువు తేదీల్లో సమస్యలున్నట్లు గుర్తించిన కాలిఫోర్నియా రవాణా ఏజెన్సీ.. ప్రవాస డ్రైవర్లకు జారీ చేసిన లైసెన్సులను రద్దు చేయాలని ఇటీవల నిర్ణయించింది. 17,000 మంది డ్రైవర్లకు వాటిని రద్దు చేస్తూ నోటీసులు జారీ చేసింది. తర్వాత సమీక్షలో ఆ సంఖ్య మరింత పెరిగింది. రవాణా ఏజెన్సీ తప్పులే లైసెన్సుల రద్దుకు కారణమని పౌర హక్కుల సంఘాలు ఆరోపించాయి. వీటిని సరిదిద్ది, లైసెన్సులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో లైసెన్సుల రద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ట్రక్కు డ్రైవర్లు కోర్టును ఆశ్రయించగా.. తాజాగా స్వల్ప ఊరట లభించింది.

## నాడు దేశాధినేతలు.. నేడు కటకటాల్లోకి!



**ఢిల్లీ, డిసెంబర్ 32:** ఒకప్పుడు వాళ్లు దేశాధినేతలు. రాజప్రాసాదాల్లో ఉంటూ ఏళ్లపాటు దేశ రాజకీయాలను శాసించారు. ఈ క్రమంలో కొందరు పాలనలో తమదైన ముద్ర వేసుకోగా.. మరికొందరు అవినీతి కార్యకలాపాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. చివరకు అరెస్టులు, జైలు శిక్షలతో కటకటాలపాలయ్యారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మొదలు.. బ్రెజిల్, మలేసియా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, చిలీ సహా పలు దేశాల మాజీ అధినేతలు కటకటాల్లో ఉన్నారు.

### పాకిస్థాన్ మాజీ ప్రధాని

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్.. పీఎం హోదాలో విదేశీ పర్యటనలు చేసిన సందర్భంగా ఆయనకు వచ్చిన బహుమతులను విక్రయించారనే ఆరోపణలు సహా వివిధ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. కొన్ని కేసుల్లో దోషిగా తేలారు. రెండేళ్ల క్రితం అరెస్టై జైలులో ఉన్నారు. ఓ కేసులో ఇమ్రాన్‌తోపాటు ఆయన భార్య బుష్రా బీబీకి డిసెంబర్ 2025లో 17 ఏళ్ల జైలు శిక్ష పడింది.

### బ్రెజిల్ బోల్సొనారో..

బ్రెజిల్ అధ్యక్షుడిగా 2019-22 వరకు పనిచేసిన జైర్ బోల్సొనారో.. 2022 ఎన్నికల్లో ఓడిపోయారు. పదవిలో కొనసాగేలా తిరుగుబాటు కుట్రకు బోల్సొనారో ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారించిన సుప్రీం కోర్టు.. మాజీ అధ్యక్షుడికి 27 ఏళ్ల శిక్ష విధిస్తూ సెప్టెంబర్ 2025లో తీర్పు ఇచ్చింది.

### మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్

మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్. పదవిలో ఉన్నకాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. మలేసియా అభివృద్ధికి ఉద్దేశించిన 1 మలేసియా డెవలప్‌మెంట్ బెర్హాత్ నిధి నుంచి భారీ మొత్తాన్ని వ్యక్తిగత ఖాతాలోకి తరలించినట్లు తేలింది. ఈ అవినీతి కేసులో ఇప్పటికే జైల్లో ఉన్న ఆయనకు 15 ఏళ్ల జైలు, భారీ జరిమానా విధిస్తూ డిసెంబర్ 26న అక్కడి న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

### ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ

ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్ అధ్యక్షుడిగా పనిచేసిన (2007 నుంచి 2012 వరకు) నికోలస్ సర్కోజీ.. లిబియా నుంచి అక్రమంగా నిధులు పొందినట్టు ఆరోపణలు వచ్చాయి.

ఈ కేసులో అయనకు ఐదేళ్ల జైలు శిక్ష (అక్టోబర్ 21న) పడింది. మూడు వారాలపాటు జైల్లో ఉన్న సర్కోజీ.. నవంబర్ 10న బెయిల్‌పై బయటకు వచ్చారు. దీనిపై ఆయన అప్పీలుకు వెళ్లగా పెండింగులో ఉంది. అయితే, ప్రపంచంలోని అతిపెద్దదైన అధికార నివాసాల్లో ఒకటైన పారిస్లోని ఎలీస్ అధ్యక్ష భవనంలో ఏకంగా 300 గదులకుపైగా ఉంటాయి. అలాంటి సౌధంలో ఐదేళ్లు ఉన్న సర్కోజీ.. కేవలం తొమ్మిది చదరపు మీటర్ల ఉన్న గదిలో మూడు వారాలు ఉండటం గమనార్హం.

# కల్లెడ చిన్నారులకు అండగా నిలిచిన మానవత్వం

- సత్యసాయి సేవా సమితి సేవలు ఆదర్శనీయం



**జగిత్యాల, డిసెంబర్ 31(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా కల్లెడ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ముగ్గురు చిన్నారుల దుస్థితి ప్రతి ఒక్కరి హృదయాలను కదిలిస్తోంది. ఈ విషాద ఘటనపై స్పందించిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి, జగిత్యాల, మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తూ ఆ చిన్నారులకు భరోసా కల్పించింది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా విషయం తెలుసుకున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు వెంటనే కల్లెడ గ్రామానికి చేరుకొని, పిల్లల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామ మాజీ సర్పంచ్ గంగాధర్ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం, ప్రస్తుతం వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్య పిల్లలను చూసుకుంటున్నారని గుర్తించారు. గ్రామ పెద్దలు, బంధువులు కలిసి త్వరలోనే పిల్లలను ప్రభుత్వ హాస్టల్లో చేర్చడంతో పాటు వారి పేరుతో బ్యాంకు ఖాతా ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితిని గమనించిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి వెంటనే స్పందించి, భక్తుల సహకారంతో తక్షణ సాయం అందించింది. ఒక నెలకు సరిపడే 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, పిల్లలకు అవసరమైన స్నాక్స్, దుప్పట్లు అందజేశారు. అంతేకాకుండా పిల్లల చదువు బాధ్యతను కూడా సంస్థ స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే భక్తుల సహకారంతో సమకూరిన సుమారు రూ.35 వేల మొత్తాన్ని పిల్లల పేరున బ్యాంకు ఖాతా తెరిచి ఎఫ్డీ రూపంలో భద్రపరచనున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి అనేక మంది దాతలు స్పందించి తమ వంతు సహకారాన్ని అందించారు. మంచిర్యాలకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ పురుషోత్తం రూ.5,000 విరాళం అందించగా, దుబాయ్లో నివసిస్తున్న సారంగాపూర్ వాసి చుక్క అంజి రూ.2,001 విరాళం అందించారు. కోరుట్ల మండలం మాదాపూర్ తపాల కార్యాలయంలో పనిచేస్తున్న అహోబిలం సుష్మ రూ.516 విరాళం అందించారు. సారంగాపూర్ గ్రామానికి చెందిన యువ రైతు ఏలేటి రాజేశ్వర రెడ్డి రూ.1,111 సహాయం చేయగా, వరంగల్కు చెందిన బోదె హిందు రెడ్డి రూ.2,000, సారంగాపూర్కు చెందిన సూర కోటేశ్వర్ రెడ్డి రూ.1,000, మహబూబాబాద్ కు చెందిన చోళ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ సాగర్ 2 వేలు, రామిడి తిరుపతిరెడ్డి 3000 విరాళంగా అందించారు. ఇదే సమయంలో జగిత్యాలకు చెందిన ప్రముఖ పిల్లల వైద్యులు, అరుణ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి తక్షణమే స్పందించి తన ఆసుపత్రి సిబ్బందిని గ్రామానికి పంపించి పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలింపజేశారు. అవసరమైన నిత్యావసరాలు అందించడంతో పాటు, భవిష్యత్తులో కూడా వైద్య సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బట్టు రాజేందర్, ఉత్తూరి గంగాధర్, ఠాకూర్ నారాయణ్ సింగ్, పిప్పరి రాజేందర్, వంగల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనాథలైన చిన్నారులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరిపై భగవాన్ శ్రీ సత్యసాయి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని సేవా సమితి సభ్యులు ప్రార్థించారు. ఈ సంఘటన మరోసారి సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించింది.

## పదవి విరమణ పొందిన మైనింగ్ ఏడి శ్యామూల్ జాకబ్‌కు సన్మానం



**నల్గొండ డిసెంబర్ 31( మనం న్యూస్):** జిల్లా మైనింగ్ ఏడి శ్యామూల్ పదవి విరమణ పొందిన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని మైనింగ్ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది పలువురు అధికారులు వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మైనింగ్ శాఖలో ఎలాంటి పొరపాటులకు తావు లేకుండా సౌమ్యంగా ఆ శాఖ కే వన్నెతెచ్చారని కొనియాడారు. ఆయన బాధ్యతలు చేపట్టినాటి నుండి నేడు పదవి విరమణ వరకు ప్రభుత్వానికి ఆదాయం కల్పిస్తూ ఉన్నత అధికారులతో అభినందనలు పొందుతూ ఎన్నో అవార్డులు పొందారని గుర్తు చేశారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు కుటుంబ సభ్యులతో ఉండాలని కోరుతూ నూతన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాల్వలతో పూలమాలలతో దంపతులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చందంపేట ఎంపీడీవో, ఇన్చార్జి ఏడి బాలు, సూపర్డెంట్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ అంబోతు గోపాల్, టి ఏ నాగమ్మ,వి.సైదులు, రాజు, గౌతమ్, తదితరులు ఉన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు



- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**నలగొండ- డిసెంబర్ 31 (మనం న్యూస్):** నూతన సంవత్సరం 2026 సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సమానత్వం అనే లక్ష్యాలతో మరింత వేగంగా పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన రహదారులు, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా కల్పించే విధానాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. నూతన సంవత్సరం ప్రజల ఆశలు, ఆకాంక్షలను సాకారం చేసే సంవత్సరంగా నిలవాలని, ప్రజలందరి సహకారంతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు అన్నారు.

# జర్నలిస్టుల హక్కులను ప్రభుత్వం కాలరాయద్దు



**సూర్యాపేట డిసెంబర్ 31 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాలరాయద్దని మాజీ మంత్రి సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అభిప్రాయ పడ్డారు.సమాజ సేవకులుగా పేరొందిన జర్నలిస్టులు అటు ప్రభుత్వాలకు,ఇటు ప్రజలకు వారధిగా పనిచేసే గొప్ప వ్యక్తులని అన్నారు.అటువంటి జర్నలిస్టులను వర్గాలుగా చీల్చి అవమానించ వద్దని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు నూతనంగా జారీ చేయనున్న అక్రిడేషన్ కార్డుల ప్రక్రియ కోసం జారీ చేసిన జీవో నెం.252 ను సవరించేందుకు మద్దతు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు టీయూడబ్ల్యూజే (హెచ్-143) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జర్నలిస్టులకు ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి,జీవో 252 లోని నిబంధనలను సవరించి న్యాయం చేయాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మాట్లాడుతూ ఇంతకాలం ఏకతాటిపై ఉన్న జర్నలిస్టులను వర్కింగ్ జర్నలిస్టులు,డెస్క్ జర్నలిస్టులు అనే రెండు వర్గాలుగా చేసి తారతమ్యాలు చూపడం సరికాదన్నారు. గతంలో 239 జీవో ప్రకారం 23 వేల అక్రెడిటేషన్ కార్డులు రాగా, ప్రస్తుతం ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 252 జీవో ప్రకారంతో పోలిస్తే సుమారు 13 వేల అక్రెడిటేషన్ కార్డులు జర్నలిస్టులు కోల్పోతున్నారని, ఇప్పుడు వారంతా ఎటు పోవాలని ప్రశ్నించారు.ప్రస్తుత జీవోను ప్రభుత్వం పునరాలోచించి తక్షణమే సవరణ చేయాలని డిమాండ్ చేశారు.లేని యెడల అసెంబ్లీ జర్నలిస్టుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ జిల్లా అధ్యక్షులు వజ్జ వీరయ్య యాదవ్,బొజ్జ ఎడ్వర్డ్,చల్లా చంద్రశేఖర్, ఊటుకురి రవీందర్,పెద్దింటి శ్యాం సుందర్ రెడ్డి,గుణగంటి సురేష్, అమరగాని నాగేందర్ వల్దాస్ ప్రవీణ్, యాకయ్య బచ్చుపురుషోత్తం,రామచారి,సతీష్, పిన్నెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**చండూరు డిసెంబర్ 31 ( మనం న్యూస్):** నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలోజ నల్లగొండ బిగ్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ గౌడ్ తండ్రి, గ్రామ మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ గౌడ్ దశదిన కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి .ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మరియు



స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల తనిఖీ



**సూర్యాపేట డిసెంబర్ 31 (మనం ప్రతినిధి):** జిల్లాలో సరిపడా ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ బి. నరసింహ రావు తెలిపారు. బుధవారం సూర్యాపేట మండలం లో నీ మన గ్రోమోర్ సెంటర్ వివిధ ఎరువుల డీలర్ షాప్స్ తనిఖీ చేశారు యూరియా అమ్మకాలు రైతులకు ఏ విధంగా జరుగుతుందని రైతుల వివరాలు తెలుసుకొన్నారు. రైతులకు సరిపడా యూరియా ఉందని రైతులు అవసరానికి మించి ఎరువులు తీసుకోరాదు సిఫార్సు మేరకు ఎరువులు తీసుకోవాలని రైతులకు తెలిపారు. జయాసంగి 2025 సీజన్ కు ప్రస్తుతం జిల్లాలో 9826 మె.ట. యూరియా రైతులకు సరఫరా చేయుటకు వివిద సొసైటీలు, డీలర్లు, గోధాంలలో అందుబాటులో ఉంది అన్నారు. వరకు 34731మె.ట యూరియా రైతులకు పంపిణీ చేయటం జరిగింది. యాసంగి 2025 సీజన్ కు గాను సూర్యాపేట జిల్లాలోని రైతులకు సకాలంలో ఎరువులు, సరఫరా చేయుట సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచేవిధంగా ప్రభుత్వం అన్ని కేంద్రాల్లో యూరియా నిల్వలను ఉంచుతున్నారు.జిల్లాలో ఈ యాసంగి 2025 సీజన్ కు సరిపడిన అన్నీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లుగా నిర్ధారించనైనది. రైతులకు సకాలంలో యూరియా అందజేయుటకు అన్నీ రకాల ఏర్పాట్లు చేయటం జరిగింది జిల్లాలో 544 సెంటర్ ల ద్వారా యూరియా పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేయటం జరిగింది స్పష్టం చేశారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందల్సిన అవసరం లేదు అవసరానికి తగ్గట్టుగా సకాలంలో యూరియా పంపిణీ చేయుటకు అన్నీ ఏర్పాట్లు చేయటం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్ ,ఏవో టెక్నికల్ సునీత,ఎరువుల డీలర్ మరియు రైతుల పాలుగున్నారు.

# సైన్స్ ఫెయిర్ విద్యార్థుల మేధస్సును వెలికి తీస్తుంది



**సూర్యాపేట డిసెంబర్ 31 (మనం ప్రతినిధి):** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత అలాగే పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ ప్రదర్శన ఉపయోగ పడుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం హుజూర్నగర్ పట్టణంలోని వి వి ఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన 53 వ జిల్లా స్థాయి విద్యా, బాల వైజ్ఞానిక ప్రదర్శన-2025 ముగింపు కార్యక్రమమునకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తక్కువ వయస్సు లోనే విద్యార్థులు సుస్థిర వ్యవసాయం,వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయం, గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, వినోదాత్మక గణిత నమూనా నిర్మాణం, ఆరోగ్యం పరిశుభ్రత, నీటి సంరక్షణ నిర్వహణ లలో సమస్యలు గుర్తించి నూతన ఆలోచనలతో వినూత్న పద్ధతిలో సమస్యలను పరిష్కరించటం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఈ చిన్నారులు ఇప్పుడే మదర్ బోర్డ్,సెన్సార్, కోతుల బేడద కొరకు పరికరాలు లను ఉపయోగించి సమస్యల పరిష్కరిస్తున్నారంటే రాబోయే 10 ఏళ్ల తర్వాత వారి నూతన ఆలోచనలతో రోబోటిక్స్ ను తయారు చేసే విధంగా ఉపాధ్యాయులు వారికి సైన్స్ అండ్ టెక్నాలజీ పై అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారంతో 2025 సంవత్సరం ముగుస్తుందని 2026 నూతన సంవత్సరం విద్యార్థులకి ఉజ్వల భవిష్యత్ ఉండాలని కోరుకుంటూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జూనియర్ విభాగం లో 121,సీనియర్ విభాగం లో 133 మంది.ఇన్స్ పెయిర్ 64 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను కలెక్టర్ విక్షించారు. ఈలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టెక్నాలజీ పై ఆసక్తి పెరిగి, సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగుపడతాయని స్పష్టం చేశారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకుబహుమతులు,ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమమునకు ఆర్డీఓ శ్రీనివాసులు, డి ఈ ఓ ఆశోక్, తహసీల్దార్ కవిత, ఎంపిడిఓ సుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎం ఈ ఓ లు సైదా నాయక్, సలీం షరీఫ్, ఛత్రు నాయక్,జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు హాజరైనారు.

## జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి చంద్రశేఖర్



- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ఉద్యోగులు

**నల్లగొండ- డిసెంబర్ 31( మనం న్యూస్ ):** నల్గొండ జిల్లా కలెక్టర్గా బి చంద్రశేఖర్ బుధవారం బాధితులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించేందుకు కృషి చేస్తానని నల్గొండ జిల్లా నూతన కలెక్టర్ బి .చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నల్గొండ జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తాను అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బి. చంద్రశేఖర్ కు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, డిసిసి బ్యాంక్ సీఈవో శంకర్ నాయక్,కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, నల్గొండ తహసీల్దార్ పరుశురాం, ఈ- జిల్లా మేనేజర్ దుర్గా రావు,కలెక్టర్ కార్యాలయ విభాగాల అధిపతులు,జిల్లా కలెక్టర్ సీసీలు ప్రసాద్, కరుణాకర్ రెడ్డి,పలువురు మీడియా ప్రతినిధులు, తదితరులు పూల మొక్కలు,పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

# నాడు దేశాధినేతలు.. నేడు కటకటాల్లోకి!

**ఢిల్లీ, డిసెంబర్ 32 :** ఒకప్పుడు వాళ్లు దేశాధినేతలు. రాజప్రాసాదాల్లో ఉంటూ ఏళ్లపాటు దేశ రాజకీయాలను శాసించారు. ఈ క్రమంలో కొందరు పాలనలో తమదైన ముద్ర వేసుకోగా.. మరికొందరు అవినీతి కార్యకలాపాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. చివరకు అరెస్టులు, జైలు శిక్షలతో కటకటాలపాలయ్యారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మొదలు.. బ్రెజిల్, మలేసియా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, చిలీ సహా పలు దేశాల మాజీ అధినేతలు కటకటాల్లో ఉన్నారు.

### పాకిస్థాన్ మాజీ ప్రధాని

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్.. పీఎం హోదాలో విదేశీ పర్యటనలు చేసిన సందర్భంగా ఆయనకు వచ్చిన బహుమతులను విక్రయించారనే ఆరోపణలు సహా వివిధ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. కొన్ని కేసుల్లో దోషిగా తేలారు. రెండేళ్ల క్రితం అరెస్టై జైలులో ఉన్నారు. ఓ కేసులో ఇమ్రాన్‌తోపాటు ఆయన భార్య బుష్రా బీబీకి డిసెంబర్ 2025లో 17 ఏళ్ల జైలు శిక్ష పడింది.

### బ్రెజిల్ బోల్సొనారో..

బ్రెజిల్ అధ్యక్షుడిగా 2019-22 వరకు పనిచేసిన జైర్ బోల్సొనారో.. 2022 ఎన్నికల్లో ఓడిపోయారు. పదవిలో కొనసాగేలా తిరుగుబాటు కుట్రకు బోల్సొనారో ప్రణాళికలు రచించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారించిన సుప్రీం కోర్టు.. మాజీ అధ్యక్షుడికి 27 ఏళ్ల శిక్ష విధిస్తూ సెప్టెంబర్ 2025లో తీర్పు ఇచ్చింది.

### మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్

మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్. పదవిలో ఉన్నకాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. మలేసియా అభివృద్ధికి ఉద్దేశించిన 1 మలేసియా డెవలప్‌మెంట్ బెర్హాత్ నిధి నుంచి భారీ మొత్తాన్ని వ్యక్తిగత ఖాతాలోకి తరలించినట్లు తేలింది. ఈ అవినీతి కేసులో ఇప్పటికే జైల్లో ఉన్న ఆయనకు 15 ఏళ్ల జైలు, భారీ జరిమానా విధిస్తూ డిసెంబర్ 26న అక్కడి న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

### ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ

ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్ అధ్యక్షుడిగా పనిచేసిన (2007 నుంచి 2012 వరకు) నికోలస్ సర్కోజీ.. లిబియా నుంచి అక్రమంగా నిధులు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అయనకు ఐదేళ్ల జైలు శిక్ష (అక్టోబర్ 21న) పడింది. మూడు వారాలపాటు జైల్లో ఉన్న సర్కోజీ.. నవంబర్ 10న బెయిల్‌పై బయటకు వచ్చారు. దీనిపై ఆయన అప్పీలుకు వెళ్లగా పెండింగులో ఉంది. అయితే, ప్రపంచంలోని అతిపెద్దదైన అధికార నివాసాల్లో ఒకటైన పారిస్లోని ఎలీస్ అధ్యక్ష భవనంలో ఏకంగా 300 గదులకుపైగా ఉంటాయి. అలాంటి సౌధంలో ఐదేళ్లు ఉన్న సర్కోజీ.. కేవలం తొమ్మిది



చదరపు మీటర్ల ఉన్న గదిలో మూడు వారాలు ఉండటం గమనార్హం.

### ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్టె

ఫిలిప్పీన్స్‌లో మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులో రోడ్రిగో డ్యూటెర్టె నేతృత్వంలోని ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో వేల మంది మరణించారన్న ఆరోపణలుపై విచారణ జరిపిన అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసీసీ) వారెంట్ మేరకు రోడ్రిగో డ్యూటెర్టె ఇటీవల అరెస్టయ్యారు.



### పెరూ మాజీ అధ్యక్షుడు మార్టిన్ విజ్కారా

పెరూ అధ్యక్షుడిగా (2018-2020) పనిచేసిన మార్టిన్ విజ్కారా.. అవినీతికి వ్యతిరేకంగా పోరాడతానని బాధ్యతలు స్వీకరణ సమయంలో వాగ్దానం చేశారు. అంతకు ముందు గవర్నర్గా పనిచేయగా.. ఆ సమయంలో లంచాలు తీసుకున్నారన్న కేసులో ఇటీవల దోషిగా తేలడంతోపాటు 14ఏళ్ల శిక్ష పడింది. బార్బడిల్లో జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. ఆ తర్వాత అధ్యక్షుడిగా (2021లో) చేసిన పెడ్రో కాస్టిలో.. కాంగ్రెస్‌ను రద్దు చేసేందుకు ప్రయత్నించి 2022లో పదవీచ్యుతుడయ్యారు. తిరుగుబాటుకు



కుట్ర పన్నారనే అభియోగాలపై ఇటీవల ఆయనకు 11.5 ఏళ్ల జైలు శిక్ష పడింది.

### దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్

దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ ఈ ఏడాది జనవరి 15న అరెస్టయ్యారు. గతేడాది ఆయన విధించిన మార్షల్ లా తీవ్ర విమర్శలకు కారణమైంది. ఈ క్రమంలో పార్లమెంటు అభిశంసనకు గురయ్యారు. ఆయా కేసులకు సంబంధించి అవినీతి నిరోధక విభాగం ముందు లొంగిపోగా.. అధికార దుర్వినియోగం, రికార్డుల తారుమారు వంటి అభియోగాలపై పదేళ్లు శిక్ష విధించాలని ప్రాసిక్యూటర్లు వాదించారు. దీనిపై జనవరి 2026లో తీర్పు వచ్చే అవకాశం ఉంది.

## పర్యాటకులకు భూతల స్వర్గధామంగా
# ములుగు జిల్లా ప్రకృతి అందాలు

- భక్తి - ఆనందం - ఆహ్లాదం తో పాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రదేశాలు.
- పర్యాటకులకు సాదర ఆహ్వానం పలుకుతున్నాం.
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క





ములుగు, డిసెంబర్ 31, మనం ప్రతినిధి: ములుగు జిల్లా పర్యాటకులకు భూతల స్వర్గధామంగా ఉందని, సహజ సిద్ధ ప్రకృతి అందాలు, భక్తి - ఆనందం - ఆహ్లాదం తో పాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రదేశాలు నెలవై ఉన్నాయని, ములుగు జిల్లా పర్యాటక అందాలను చూడటానికి వచ్చే పర్యాటకులకు సాదర ఆహ్వానం పలుకుతున్నాం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో ఎకో టూరిజం ఏటూరు నాగారం వైల్ లైఫ్ లోని తాడ్వాయి వైల్ లైఫ్ మేనేజ్మెంట్ రేంజ్ , తాడ్వాయి హట్స్, రెండు సఫారీ వాహనాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, డి.ఎఫ్.ఓ. రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడ్వాయి హట్స్ ఆవరణలో ఉన్నటువంటి వివిధ జాతులకు చెందిన వృక్షాల గూర్చి, అరుదైన జాతుల వృక్షాల గురించి వాటి ప్రయోజనాల గురించి పూర్తి వివరాలను మంత్రి సీతక్క కు డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ వివరించారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పి సధీర్ రామ్ నాథ్ కేకన్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో కలిసి సఫారీ వాహనంలో తాడ్వాయి వైల్ లైఫ్ రేంజ్ సుమారు 7 కిలోమీటర్ల మేర పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో ఎకో టూరిజం ఏటూరు నాగారం వైల్ లైఫ్ లోని తాడ్వాయి వైల్ లైఫ్ మేనేజ్మెంట్ రేంజ్ లోని తాడ్వాయి హట్స్ ను ఆధునీకరణంగా సుందరీకరించి ప్రకృతి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. తాడ్వాయి వైల్ లైఫ్ మేనేజ్మెంట్ రేంజ్ పరిధిలోని తాడ్వాయి మండల కేంద్రంలో జాతీయ రహదారికి పక్కన 6 హట్స్ ను, 18 కిలోమీటర్లు మేర సఫారీ చేయడానికి 2 సఫారీ వాహనాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ములుగు జిల్లా పేరు చెప్పగానే ఎంతోమంది పర్యాటకులకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని భక్తితో పాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రదేశాలు గుర్తుకు వస్తాయని అన్నారు. పర్యాటకులు భక్తులు ములుగు ప్రాంతానికి రావడంతోనే ఆది దేవత ఘట్టమ్మ తల్లిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ప్రపంచ పర్యాటకులను సైతం ఆకట్టుకుంటుందని, రామప్ప సరస్సు మధ్యగల ద్వీపకల్పం లో నూతనంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని త్వరలోనే పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రకృతి సహజ సిద్ధంగా కొండల మధ్య కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుందని, వచ్చే పర్యాటకులకు మరింత సౌకర్యాలు కల్పించే విధంగా సరస్సు మధ్యలో కాటేజీలను నిర్మించడం జరిగిందని, ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర , తెలంగాణ కుంభమేళాగా పేరు ప్రఖ్యాతలు గాంచిన శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను కూడా ప్రజా ప్రభుత్వం 251 కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి చేయడం జరుగుతుందని జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే జాతరకు భక్తులు విచ్చేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. పసర తాడ్వాయి జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కలిగిన బ్లాక్ బెర్రీ ఐలాండ్ ను మరల పునః ప్రారంభించడం జరిగిందని ఇక్కడికి వచ్చే పర్యాటకులకు నైట్ క్యాంప్ విడిదీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆయుర్వేద మూలికలు కలిగిన ప్రాంతంగా పేరు పొందిందని, తెలంగాణ నయాగరా బొగత వాటర్ ఫాల్స్ చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. ములుగు జిల్లా పర్యాటక ప్రదేశాలను వీక్షించడానికి వచ్చే పర్యాటకులకు భక్తులకు ప్రకృతి సహజసిద్ధమైన పర్యాటక ప్రదేశాలు స్వచ్ఛమైన గాలి లభ్యం అవుతుందని, చాలామంది సెలవు దినాలలో సుదూర ప్రాంతాలలో ఉన్నటువంటి పర్యాటక ప్రదేశాలను చూడటానికి వెళుతుంటారని హైదరాబాద్ కేంద్రానికి సుమారు 250 కిలోమీటర్లు, హనుమకొండ కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చూడటానికి విచ్చేయాలని కోరారు. వారందరికీ సాదర ఆహ్వానం పలుకుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం వైల్ లైఫ్ మేనేజ్మెంట్ ఎఫ్డిఓ రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గట్టమ్మ ఆలయం వద్ద నూతన పార్కింగ్ - భక్తుల సౌకర్యమే మా మొదటి ప్రాముఖ్యత



- ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్
- భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయానికి అతి సమీపంలో ఏర్పాటు
- 'నూతన ప్రణాళికలతో నూతన ఉత్సాహంతో పని చేస్తున్న ములుగు పోలీస్'

ములుగు డిసెంబర్ 31 మనం ప్రతినిధి: మేడారం మహాజాతర సందర్భంగా భక్తులకు సౌకర్యవంతమైన పార్కింగ్ ఏర్పాట్ల కోసం ములుగు జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామనాథ్ కేకాన్ , డీఎఫ్ఓ కిషన్ జాదవ్ తో కలిసి గట్టమ్మ ఆలయం పరిసర ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్కు అనువైన ప్రాంతాన్ని ఎంచుకొని చదును చేయగా ఈ రోజు చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని జాతర సమయంలో వేల సంఖ్యలో వచ్చే ప్రభుత్వ మరియు ప్రైవేట్ వాహనాల పార్కింగ్కు ఉపయోగించేందుకు, సుమారు 10 ఎకరాల మేర ప్రాంతాన్ని అనుకూలంగా తీర్చిదిద్దారు కాగా ఈ సారి ట్రాఫిక్ ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతికులంగా మారనుంది. కాగా ఎస్ పీ అటవీ శాఖ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పార్కింగ్ ప్రాంతంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పష్టమైన రేడియం స్టిక్కర్లు, దిశానిర్దేశక సైన్బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో కూడా స్పష్టంగా కనిపించేలా సూచికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్ పి ఆదేశించారు. వాహనాలు సులభంగా వచ్చేందుకు అవసరమైన ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ నుంచి ఆలయ మార్గం వరకు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల సాఫీగా రాకపోకలు జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించారు. మేడారం జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు




- జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్

ములుగు, డిసెంబర్ 31మనం ప్రతినిధి : కొత్త ఏడాది సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు జిల్లా పోలీస్ అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కొత్త ఏడాది అందరి జీవితాల్లో కొత్త వెలుగులు సంబరాలు తీసుకురావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## జాతరలో భక్తులకు మెరుగైన సేవలు అందించాలి



- జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు

ములుగు,డిసెంబర్ 31మనం ప్రతినిధి : రానున్న మేడారం జాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి గోపాల్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోనిప్రభుత్వ జనరల్ హాస్పిటల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, జిల్లా జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తో కన్వర్జెన్సీ మీటింగ్ జరిగింది. రాబోయే శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరకు ముందస్తు ప్రణాళికలో భాగంగా ఈ మీటింగ్ నిర్వహించడం జరిగిందని, శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరలో భక్త జనులకు మెరుగైన వైద్య సేవల కొరకు ఫస్ట్ రిఫరల్ సెంటర్ గా మేడారం నందు 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని సెకండరీ లెవెల్ ట్రీట్మెంట్ కొరకు ములుగు జనరల్ హాస్పిటల్ నందు శ్రీ సమ్మక్క సారలమ్మ భక్తుల వైద్య సేవల కొరకు ప్రత్యేకంగా 20 బెడ్లతో వార్డును ఏర్పాటు చేస్తున్నామని, టెర్షరీ లెవెల్ వైద్య సేవల కొరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్నామని, వీటికి మౌలిక సదుపాయాల కల్పన కొరకు స్పెషలిస్ట్ డాక్టర్లను మరియు మందులను పరికరాలను సమకూర్చు కుంటున్నామని డిఎంహెచ్వో గోపాల్ రావు మరియు ములుగు జనరల్ ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్ డాక్టర్ శ్రీకాంత్ ఏడి గఫర్ వైద్యాధికారి గౌతం డిపి ఏమో సంజీవరావు జిల్లా ఫార్మసీ ఇంచార్జ్ వినోదర్ మానిటరింగ్ సూపర్వైజర్ వెంకట్ రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

## మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర దృష్ట్యా కీలక ముందడుగు



- మేడారం పరిధి లోని నార్లాపూర్ నూతన పోలీస్ స్టేషన్ను ప్రారంభించిన....
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు, డిసెంబర్ 31, మనం ప్రతినిధి: ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్ను బుదవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన లతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం మేడారం మహా జాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయా గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

**ఈ సందర్భంగా ఎస్ పి మాట్లాడుతూ**

జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్ను ఏర్పాటు చేసినట్లు, ఇది ప్రజలకు మరింత చేరువైన, సమర్థవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు. పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30 మంది పనిచేయనున్నారని, నార్లాపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ ఐ ఏ. కమలాకర్ విధులు నిర్వహించనున్నారని, పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుందని పస్రా సర్కిల్ ఇన్స్పెక్టర్గా దయాకర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్ పి లతో కలిసి మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, స్థానిక సర్పంచ్ పిరిల భారతీ వెంకన్న, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు

- డి ఏ ఓ సురేష్ కుమార్



ములుగు,డిసెంబర్ 31మనం ప్రతినిధి : జల్లాలో ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్ లో పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ఎరువుల పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్దంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని సహకార సంఘాలలో మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా సహా ఇతర ఎరువులు అందుబాటులో ఉంచామని, : పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు అందేవిధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ములుగు మండలంలో 137 ఎంటిఎస్ మల్లంపల్లి మండలంలో 68 ఎంటిఎస్ వెంకటాపూర్ మండలంలో 107 ఎంటిఎస్ గోవిందరావుపేట్ మండలంలో 40 ఎంటిఎస్ మంగపేట మండలంలో 214 ఎంటిఎస్ తాడ్వాయి మండలంలో 29 ఎంటిఎస్ ఎటునాగారం మండలంలో 46 ఎంటిఎస్ వాజేడు మండలంలో 22 ఎంటిఎస్ వెంకటాపురం మండలంలో 126 ఎంటిఎస్ కన్నాయిగూడెం మండలంలో 22 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. యురియాతో పాటు కాంప్లెక్స్ ఎరువు డీ.ఏ.పీ ,ఎం.ఓ.పీ ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎరువుల పంపిణీ కేంద్రాలలో ప్రతీ చోట కౌంటర్లను నెలకొల్పి రైతులు వచ్చిన వెంటనే వారికి ఎరువులు అందించేలా చర్యలు తీసుకుంటున్నాము. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో ఎక్కడ కూడా యూరియా, ఇతర ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తుగానే జిల్లా అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు తెప్పిస్తున్నామని అన్నారు. కోరిన వెంటనే ప్రభుత్వం రైతుల అవసరాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో యూరియా నిల్వలను జిల్లాకు కేటాయిస్తోందన్నారు. యూరియా ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించడం జరుగుతోందని, పంపిణీలో లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాము. పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా వారి అవసరాలకు సరిపడా యూరియాను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అయితే ఒకేసారి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో అవసరానికి సరిపడా మాత్రమే వినియోగించాలని రైతులను కోరారు. ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, దారి మళ్ళించడం వంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, యూరియా పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపైనా చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మేడారం పనులను పరిశీలించిన మంత్రి సీతక్క





తాడ్వాయి, డిసెంబర్ 30మనం న్యూస్ : మండలంలోని కల్వపల్లి నుండి ఊరటం వరకు రహదారి పనులను , కల్వర్టు నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్,ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణిలతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మహా జాతర సమీపిస్తున్న నేపథ్యంలో పనులను అధికారులు సిబ్బంది సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ మేడారం జాతరను వైభవోపేతంగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు, డిసెంబర్ 31, మనం ప్రతినిధి: శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతరను వైభవోపేతంగా నిర్వహించాలని,అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలిసి శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర 21 లైన్ శాఖల జోనల్, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరకు, గద్దెల పునరుద్ధరణ కు ప్రభుత్వం 251 కోట్ల రూపాయల నిధులతో శాశ్వత అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, గిరిజనుల ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటేలా అంగరంగ వైభవంగా జాతరను నిర్వహించాలని పేర్కొన్నారు. గత జాతరలో వచ్చిన భక్తుల సంఖ్యతో పోలిస్తే , భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వనదేవతల దర్శనం జరిగే విధంగా సౌకర్యాలు కల్పించాలని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జాతర విజయవంతం చేయాలని తెలిపారు. జాతర సమయంలో ముఖ్యంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఆలయం పరిసర ప్రాంతాలు, జన సందోహాలు కలిగిన కూడలిలో పారిశుద్ధ్య కార్మికుల ద్వారా వ్యర్థాలను తొలగించాలని, భక్తులకు త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేపటి నుండి నోడల్ అధికారులు మేడారం లో జోన్స్, సెక్టార్స్ లలో ఫీల్ విసిట్ నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, నోడల్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# శుభ్మన్ గిల్.. విజయ్ హజారేలో ఆడేది అప్పుడే!

టీమ్ఇండియా టెస్ట్, వన్డే జట్టు కెప్టెన్ శుభ్మన్ గిల్ , ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా , స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ జనవరిలో విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొనే అవకాశముందని సమాచారం. జనవరి 11 నుంచి న్యూజిలాండ్తో టీమ్ఇండియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. అంతకంటే ముందే వీరు విజయ్ హజారేలో ఆడనున్నారని తెలుస్తోంది. 'క్రిక్బజ్' సమాచారం మేరకు శుభ్మన్ గిల్ పంజాబ్ తరఫున జైపూర్ వేదికగా జనవరి 3న సిక్కింతో, 6న గోవాతో జరగనున్న మ్యాచుల్లో పాల్గొనే అవకాశముంది. ప్రస్తుతం పంజాబ్ జట్టు మూడు మ్యాచుల్లో రెండింట విజయం సాధించింది. ఈ రెండు మ్యాచ్ల అనంతరం శుభ్మన్ టీమ్ఇండియా జట్టుతో కలవనున్నాడు. రవీంద్ర జడేజా సైతం విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా.. జనవరి 6న సర్వీసెస్, 8న గుజరాత్తో జరగనున్న మ్యాచుల్లో పాల్గొంటున్నట్లు సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్కు తెలిపాడు. సౌరాష్ట్ర జట్టు ఇప్పటివరకు మూడు మ్యాచుల్లో కేవలం ఒక మ్యాచులోనే విజయం సాధించింది. కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్ జనవరి 3న త్రిపురతో, 6న రాజస్థాన్ జరగనున్న మ్యాచుల్లో పాల్గొనే అవకాశముంది. అయితే ఈ విషయాన్ని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ధ్రువీకరించలేదు. కర్ణాటక జట్టు మూడుకు మూడు మ్యాచుల్లో విజయం సాధించింది. ఈ సీజన్లో దేశవాళీల్లో స్టార్ క్రికెటర్ల రాకతో సందడి నెలకొంది. టీమ్ఇండియా ఆటగాళ్లంతా కచ్చితంగా దేశవాళీల్లోనూ ఆడాలని బీసీసీఐ ఇటీవల నిబంధన విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ముంబయి తరఫున రోహిత్ శర్మ , దిల్లీ తరఫున విరాట్ కోహ్లీ రెండేసి చొప్పున మ్యాచ్లు ఆడారు. విరాట్ కోహ్లీ జనవరి 6న మరో మ్యాచ్ సైతం ఆడే అవకాశముంది. రిషభ్ పంత్ దిల్లీకి కెప్టెన్గా వ్యవహరిస్తూ.. వరుసగా మ్యాచ్లు ఆడుతున్నాడు.

# విజయ్ హజారే ట్రోఫీ.. మళ్లీ ఓడిన ఆంధ్ర, హైదరాబాద్

విజయ్ హజారే ట్రోఫీ లో భాగంగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్లో ఆంధ్ర 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఆంధ్రకు నాలుగు మ్యాచ్లో ఇది మూడో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఆంధ్ర 47.2 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. ఒక్క బ్యాటర్ కూడా కనీసం అర్ధ శతకం చేయలేదు. ఓపెనర్ సిఆర్ జ్ఞానేశ్వర్ (33) టాప్ స్కోరర్. కేఎస్ నరసింహ రాజు (30), నితీశ్ కుమార్ రెడ్డి (30), హేమంత్ రెడ్డి (29), జాగర్లపూడి రామ్ (20₹) పరుగులు చేశారు. శ్రీకర్ భరత్ (4), రికీ భుయ్ (4) సింగిల్ డిజిట్కే పరిమితమయ్యారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వార్ (5/27) సత్తాచాటాడు. చిరాగ్ జైన్, హితేన్ కాన్బి, పార్త్ భుట్, సమర్ గజ్జర్ ఒక్కో వికెట్ తీశారు. విశ్వరాజ్ జడేజా (3), హెత్విక్ కోటక్ (7), ప్రేరక్ మన్కడ్ (13), సమర్ గజ్జర్ (0) వరుసగా పెవిలియన్కు చేరడంతో సౌరాష్ట్ర తొలుత తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేలా కనిపించింది. 62 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టును ఓపెనర్ హార్విక్ దేశాయ్ (61).. ఆరు, ఏడు స్థానాల్లో వచ్చిన చిరాగ్ జైన్ (69), రుచిత్ అహిర్ (76; 54 బంతుల్లో) ఆదుకున్నారు.ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 3, కేఎస్ నరసింహ రాజు 2, నితీశ్ రెడ్డి, జాగర్లపూడి రామ్ చెరో వికెట్ పడగొట్టారు.



# కోమాలో ఆస్ట్రేలియా మాజీ స్టార్ క్రికెటర్



ఆస్ట్రేలియా మాజీ స్టార్ క్రికెటర్ డామియన్ మార్టిన్ (ౖఛ్చీఝజ్ఛ్చీ ఝ్చటట్ఛ్ఞ) ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. 54 ఏళ్ల మార్టిన్ మెనింజైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. అతడు ప్రస్తుతం బ్రిస్బేన్లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్న వైద్యులు.. మార్టిన్కు మత్తు మందు ఇచ్చి తాత్కాలికంగా కోమాలోకి వెళ్లేలా చేశారు. మెనింజైటిస్ వల్ల మెదడు, ఇతర అవయవాలు పూర్తిగా చెడిపోకుండా ఉండేందుకు తాత్కాలికంగా కోమాలోకి పంపి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడితే మరికొన్ని రోజుల్లో డామియన్ మార్టిన్ను కోమా నుంచి బయటకు తీసుకువస్తారని ఆస్ట్రేలియా మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మార్టిన్ తొందరగా కోలుకోవాలని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లు డారెన్ లెహమన్, ఆడమ్ గిల్క్రిస్ట్ ఆకాంక్షించారు. డామియన్ మార్టిన్ ఆసీస్ తరఫున 67 టెస్టులు, 208 వన్డేలు, 4 టీ20లు ఆడాడు. ఆస్ట్రేలియా 1999, 2003 ప్రపంచ కప్ సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. భారత్తో జరిగిన 2003 వరల్ కప్ ఫైనల్లో 88 పరుగులు చేశాడు. 2006 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులోనూ భాగంగా ఉన్నాడు. భారత్పై ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచిన అత్యుత్సాహంలో మార్టిన్ పాల్పడిన ఓ దుందుడుకు చర్య.. అతడికి జీవితకాలం మర్చిపోని చేదు అనుభవాన్ని మిగిల్చింది.

# 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ వచ్చేస్తోంది.. హైప్ పెంచేసిన సందీప్ రెడ్డి వంగా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'స్పిరిట్' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. 'స్పిరిట్' (ఖిఇజీటజ్టీ) చిత్రంతో ఈ కాంబో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విధ్వంసాన్ని సృష్టిస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక న్యూ ఇయర్ కానుకగా ఈ సినిమా నుంచి ఓ సాలిడ్ అప్డేట్ ఇవ్వబోతున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే తెలిపింది. అయితే, ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ మరికొద్ది గంటల్లో వస్తుందని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తాజాగా ట్వీట్ చేశారు. దీంతో కేవలం ఫస్ట్ లుక్ పోస్టర్తోనే సినిమాపై మరింత హైప్ పెంచేస్తున్నారు మేకర్స్. ఈ పోస్టర్ ఎలా ఉండబోతుందా.. ఇందులో ప్రభాస్ని సందీప్ రెడ్డి ఎలా చూపిస్తాడా..? అని అభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాగా, ఈ సినిమాలో ప్రభాస్ రూత్లెస్ కాప్ పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే, ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ను డిసెంబర్ 31న అర్ధరాత్రి సమయంలో రిలీజ్ చేసి ప్రేక్షకులకు, అభిమానులకు సాలిడ్ న్యూ ఇయర్ ట్రీట్ ఇచ్చేందుకు స్పిరిట్ టీమ్ రెడీ అవుతుంది.

# డెబ్యూ ప్రాజెక్టుతో రిస్క్ చేస్తున్న హీరోయిన్

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్, మిలాప్ జవేరి కలయికలో ఓ యాక్షన్ పాక్డ్ మూవీ రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే వీరిద్దరి ట్రాక్ రికార్డు గత కొన్ని సినిమాలుగా ఏమంత బాలేదు. బాఘీ4, బడే మియా చోటే మియా, గణపత్ లాంటి సినిమాలు ఫ్లాపైన తర్వాత టైగర్ ష్రాఫ్ మార్కెట్ బాగా డల్ అయింది. అందుకే ఈ సినిమాతో అయినా టైగర్ ష్రాఫ్ కెరీర్ లో కంబ్యాక్ ఇస్తారా లేదా అని అందరూ అనుమానపడుతున్నారు. ఇక మిలాప్ జవేరి కూడా ఈ మధ్య ఫ్లాపుల్లోనే ఉన్నారు. మస్తీ4 సినిమా ఫ్లాప్ గా నిలవగా, ఏక్ దీవానే కీ దీవానియత్ సినిమాతో ఓ మోస్తరు సక్సెస్ దక్కినప్పటికీ, సినిమాను చూసిన చాలా మంది ఆడియన్స్ దాన్ని క్రింజ్ అంటూ ట్రోల్ చేశారు. అలాంటి వారిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టు ఇప్పుడు బాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే ఇలాంటి సినిమాతో ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి బాలీవుడ్ లోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనున్నారు. కృతి ఇప్పటికే తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేయగా, ఇప్పుడు బాలీవుడ్ లోకి వెళ్తున్నారు. గతంలో కృతి హృతిక్ రోషన్ సూపర్30 లో నటించినప్పటికీ అందులో కృతి లీడ్ రోల్ చేయలేదు. అందుకే కృతి ఈ సినిమాతోనే బాలీవుడ్ డెబ్యూ చేయనుందని అందరూ భావిస్తున్నారు.అయితే ఈ విషయంలో కృతి డెసిషన్ కరెక్ట్ కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. టైగర్ ష్రాఫ్, మిలాప్ జవేరి కలిసి తీస్తున్న సినిమా ద్వారా కృతి డెబ్యూ జరిగితే అది తన ఫ్యూచర్ ఛాన్సులకు హాని కలిగిస్తుందని అనుకుంటున్నారు. పైగా ఇప్పటివరకు టైగర్ ష్రాఫ్ తో కలిసి డెబ్యూ చేసిన హీరోయిన్ల ట్రాక్ రికార్డు చూసుకుంటే, కృతి రిస్క్ తీసుకుంటున్నట్టే అనిపిస్తోంది. ఓ వైపు టైగర్ ష్రాఫ్, మరోవైపు మిలాప్ జవేరి ఇద్దరూ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న టైమ్ లో, కృతి ఈ మూవీతో కాకుండా కాస్త వెయిట్ చేసి ఏదైనా మంచి సినిమాతో డెబ్యూ జరిగితే బావుండేదని అందరూ అభిప్రాయపడుతున్నారు. కానీ కొందరు మాత్రం కృతినే టైగర్ ష్రాఫ్ యొక్క ఫ్లాప్స్ స్ట్రీక్ కు ఫుల్ స్టాప్ పెట్టి, అతనికి లక్కీ హీరోయిన్ గా మారుతుందేమో అని ఆశ పడుతున్నారు.



# ప్రభాస్ పెళ్లి మారునాడే నా పెళ్లి : నవీన్ పోలిశెట్టి



టాలీవుడ్ యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి మరోసారి తన హ్యూమర్తో ప్రేక్షకులను నవ్వించారు. సంక్రాంతికి విడుదల కానున్న తన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన 'పెళ్లి రిసెప్షన్' ఈవెంట్లో మీడియా ప్రశ్నలకు చమత్కారంగా సమాధానాలు ఇచ్చారు. పెళ్లి గురించి ఎప్పటి నుంచో వస్తున్న వార్తలను ఎప్పుడు నిజం చేస్తారు? అని అడగగా.. ప్రభాస్ ఏ రోజైతే పెళ్లి చేసుకుంటారో, ఆ మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు నేను పెళ్లి చేసుకుంటా అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్ అక్కడున్న వారిని నవ్వుల్లో ముంచెత్తడమే కాకుండా సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఇప్పటివరకు వివాహం చేసుకోలేదు. ఎప్పటికప్పుడు తన పెళ్లి ప్రస్తావన వాయిదా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్ పెళ్లి ఇప్పట్లో జరిగే అవకాశాలు లేవని ఇన్డైరెక్ట్గా చెప్పిన నవీన్, ఇకపై తనను కూడా పెళ్లి ప్రశ్నలతో ఇబ్బంది పెట్టొద్దన్న సందేశం ఇచ్చినట్టయ్యింది. అంతేకాదు ప్రభాస్తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పిన నవీన్.. ప్రభాస్ అన్న స్విగ్గీలో ఆర్డర్ పెడితే ఓటీపీ నాకు వస్తుంది అంటూ మరో సరదా వ్యాఖ్య చేసి అభిమానులను ఆశ్చర్యపరిచారు. తనకు కాబోయే జీవిత భాగస్వామి గురించి మాట్లాడుతూ.. తనను ఎక్కువ ప్రశ్నలు అడగకూడదని, ఆమె కోసం తానే మారిపోతానని తెలిపారు.ఇక సంక్రాంతి బాక్సాఫీస్ పోటీపై స్పందించిన నవీన్ పోలిశెట్టి, మెగాస్టార్ చిరంజీవి చిత్రంతో పాటు తన సినిమా విడుదలవుతున్నా ఎలాంటి భయం లేదన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి స్టార్గా ఎదగడానికి చిరంజీవి ఎంతోమందికి స్ఫూర్తి అని ప్రశంసించారు. చిరంజీవి నటించిన 'మన శంకర్ వరప్రసాద్ గారు' సినిమాను చూసేందుకు వచ్చే ప్రేక్షకులు తమ సినిమా 'అనగనగా ఒక రాజు' కూ వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మీనాక్షి చౌదరి హీరోయిన్గా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 14న విడుదలకు సిద్ధంగా ఉండగా, నవీన్ కామెంట్స్తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రచారంలో భాగంగా 'అనగనగా ఒక రాజు పెళ్లి రిసెప్షన్' పేరుతో ఈవెంట్ నిర్వహించారు. అందులో నవీన్ పొలిశెట్టి సందడి చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానమిచ్చారు.



# గంగగా నయనతార

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్లుక్ పోస్టర్ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్లో గన్ పట్టుకొని పవర్ఫుల్ లుక్స్తో నయన్ కనిపించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్లను వరుసగా విడుదల చేసింది. కియారా ఆడ్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీయఫ్' తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.